TIGHT BINDING BOOK

UNIVERSAL LIBRARY
OU_204063
UNIVERSAL LIBRARY

# జకోస్లోవేకియా బలి

నాగేశ్వరరావు

చీప్ బుక్ డిపో
2-16, మౌంట్ రోడ మద్రాస.

అమ్మకు నాన్నకు
భక్తి పురస్సరంగా

# ఇందలి విషయాలు

యూరపు పరిస్థితులు
జకోస్లోవేకియా పూర్వచరిత్ర
ఆష్ట్రియా సమస్య
జక్ జర్మను తగాదా
ఐరోపా యుద్ధం
జక్ రాజ్యాంగవిధానం
జక్ ఉద్ధారకులు
సుడేటనుజర్మనులు
హిట్లరు ఆశలు
నియంతృత్వం: ప్రజాస్వామ్యం
ప్రపంచ ప్రతిష్ఠంభన
యూరపురాజ్యాల ద్రోహం
కొద్దిలో తప్పిన యుద్ధం
జెకోస్లోవేకియా నేటి స్థితి
యుద్ధమా ? శాంతియా ?
రాబోయే యుద్ధం ?

'వాహిని' యీనాడు అంతర్జాతీయ సమస్యలపై పేరొందినదంటే, కారణం నాగేశ్వరరావుగారి లేఖినిమాత్రమే పాండిత్యము కాక, కూడను. నూతన శైలి, వినూత్న దృక్పధమును విజ్ఞాన విజృంభణముద్వారా యీచిన్ని 'జకోస్లొవేకియా' పుస్తకాన ప్రకటించినందులకు సంతసము.

జకొస్లోవేకియా యిటుల విభజింపబడక తప్పునా? లేకున్న 1919 మిత్రమండలి చేసిన అధర్మమెటుల భగ్నమగుట? పోతే వొక్క అన్యాయాన్ని సరిపెట్టుట కీనాటి హిట్లరు అన్యాయపు దౌర్జన్యమే శరణ్యమైనదంటె ప్రపంచపు అసహాయత, ధార్మిక దౌర్బల్యమే కదా కారణము! ఆ కారణపు చరిత్ర యేమి? చదువండి యీ పొత్తాన్ని?

ఆంధ్ర రైతాంగ
విద్యాలయం
నిడుబ్రోలు.

రంగా.

# టాన్సినాల్ (రిజిష్టర్డు)

MANY THOUSANDS SAVED FROM TONSILS WITHOUT OPERATION

# TONSINOL (REGD.)

GUARANTEED CURE FOR

## TONSILS

WITHOUT OPERATION.



**TONSINOL LABORATORY**
**53 GOVINDAPPA NAICK ST. MADRAS.**


గొంతుకలో పెరుగు కండలకు, లేక ఎరుగు కుత్తుకలకు (టాన్సిల్సు) శస్త్రచికిత్స లేకయే, నిరపాయముగా నివారించు దివ్యౌషధము. దేశీయ మూలికలపై 5 సంవత్సరములు పరిశోధనచేసి కనుగొనిన ఔషధరాజము. వేనకువేలు చికిత్సనొంది తమ సంతృప్తిని వెల్లడించియున్నారు.

సగ వేహా రామేశం పంతులు గారు ఇట్లు వ్రాసియున్నారు:—

నా కొమార్తెలలో ఒక ఆమెకు గొంతులో కండలు పెరిగితే డా. డి. అప్పారావు, యల్. ఐ. యమ్. గారు చికిత్సచేశారు... ఈ గొంతులో కండలు పెరిగిన దానికి ఆయన లోపల పుచ్చుకొనేందుకొక యౌషధాన్ని యిచ్చి, వెలుపల పూయుటకు ఒక లోషను యిచ్చారు. నాయొక్క కొమార్తెయొక్క పై వ్యాధిని పూర్తిగా నివారణచేశారు........

వివరములకు :— టాన్సినాల్ లేబరేటరీ,
మాన్యుఫేక్చరింగ్ కెమిస్టులు,
53, గోవిందప్పనాయక్ వీధి, మద్రాసు.

# కన్నులు ద్రవ్యముతీసికొనక
# పరీక్ష ఊరకయే చేయబడును




మా యొక్క కంపెనీయందు, కన్నులను పరిశోధనచేసి కంటి వైద్యశాల డాక్టర్, ప్రాస్క్రిప్షన్. యందు, వయసుకు తగినవారు గొప్ప ఇంగ్లీషు, అమెరికా దేశపు సెల్ రోల్గోల్డు నిక్కల్, ఫ్రేములలో, క్రిస్టల్, స్పెరికల్, క్రౌన్, క్రూకుస్ జీస్పంగ్ టాల్ స్ఫటికము మొదలైన బిల్లలను ఇమిడ్చి వెల సరసముగాను ఇయ్యబడును. ఒకతూరి మాకంపెని యందు పరీక్షచేసి చూడుడు.



## టి. కుప్పసామి నాయుడు.

ముక్కద్దముల వ్యాపారము,

నెం. 120 & 121, మూర్మార్కట్, పి. టి. మదరాసు.

# సౌందర్యము యవ్వనము


## ఆతంకనిగ్రహ మాత్రలను

ఉపయోగించుటవలన పొందవచ్చును. అవి, 57 సంవత్సరములనుండి ఇండియా, బర్మా, సిలోన్, స్ట్రెయిట్ సెటిల్మెంట్లులోగల పట్టణముల బజారులన్నిటియందును దొరుకుచున్నవి. మలబద్ధకం, నరముల బలహీనత, మొదలగునవి నివర్తించును.

32 మాత్రలు గల సీసా 1 కి రు 1-0-0 వివరములకు మా కామశాస్త్ర గ్రంథం చదువుడు. పోస్టు ఖర్చులతో ఉచితంగా బంపబడును. నేడే కార్డు వ్రాయుడు:—

**ఆతంకనిగ్రహ ఫార్మసీ,**

**26 బ్రాడ్వే, మద్రాసు.**



ఆభరణాలంకారములు
టి.సి.ఎల్
గోల్డ్ మెటల్
నగలే స్త్రీలకన్నివిధాలా
అలంకారానికి
తగినవి.
22
24
25
26
27
28
నెం 1
పుదుచ్చేరి నాను
కెంపులతోకట్టిన
రంగూన్ డైమండ్లు
రూ 8.
రూ 8.
రూ 10
పెద్దసైజు గాజులు 2 అంగుళములు
పైబడినవి జత 1-8 రూ 3-0-0
మధ్యరకం సైజు 1¾ నుండి 2 అంగు
ళములకు లోగ జత 1-8 రూ 2-8-0
చిన్న సైజు 1¾ అంగుళములకు
లోబడినది జత 1-8 రూ 2-0-0
మెడ చెయినులు
నెం 1 పేట రూ 7 చిన్నసైజు రూ 5
2 రూ 14 రూ 10
3 రూ 21 రూ 15.
నెం 3. వడ్డాణములు.
పెద్దసైజు రూ. 20 చిన్నసైజు రూ 15.
కాటలాగు ఉచితము.
సి. నాగలింగప్ప అండ్ కో. 280
మద్రాసు.

# జకోస్లోవేకియా బలి

పండితారాధ్యుల నాగేశ్వరరావు

చీప్ బుక్ డిపో
2/16, మౌంటురోడ్ మద్రాసు.

అన్నిహక్కులూ ప్రకాశకులవే !

మొదటి ముద్రణం : డిశంబరు 1938

Printed at P. P. P. Works 2/16, Mount Road Madras.

# సింహావలోకనం

మే 21 వ తేది. జర్మనీలోని బ్రిటిష్ రాయబారి ఛేంబర్లేనుకు "ఈరాత్రి నాజీసేనలు జకోస్లోవేకియా సరిహద్దులను దాటుతవి. యుద్ధం తప్పదు." అని చెప్పాడు.

జర్మనీ విపులంగా సైనిక సన్నాహాలు చేసింది. జకస్లోవేకియా ఆవిషయంలో ఏమాత్రం వెనుకబడలేదు. రష్యా జకోస్లోవేకియాకు హామీఇచ్చింది. ఫ్రాన్స్ తన ఒడంబడికను తప్పకుండా గౌరవించుతాననన్నది. మిగత చిన్న దేశాలంతా కలిసి మధ్యయూరప్‌ను కాపాడటానికి నిశ్చయించుకున్నవి.

తుపాకులు పేలినవి. సెప్టెంబరులో యూరప్ అంతా యుద్ధజ్వరంతో బాధపడుతూ ఉన్నట్లు కనపడింది. ప్రజాస్వామ్య ప్రభుత్వాలు నాజీ, ఫాసిస్టు ప్రభుత్వాలకు అంత్యదశ దగ్గరకొచ్చిందని సంతోషించాయి. 1914 నాటి పరిస్థితులను తెలిసినవారందరికీ ఇంకా యుద్ధం ప్రారంభం కాలేదేమో అనిపించింది.

బ్రిటన్ మంత్రివర్గం బేలల చేతిలో ఉంటంవల్ల జక్-జర్మన్ యుద్ధం ఆగింది. యూరప్ సంక్షోభం తాత్కాలికంగానే ఆగింది. తాత్కాలికంగానే అన్నాను. యుద్ధం రాకతప్పదు. వస్తుందనే నా నమ్మకంగూడా. ఫ్రాన్స్‌లో తిరిగి కత్తిలేని సామ్యవాద ప్రభుత్వం ఏర్పడు సూచనలు కన్పడుతూఉన్నవి. బ్రిటన్‌లో ప్రస్తుత జాతీయ ప్రభుత్వానికి బలం తగ్గుతూఉంది. కనీసం మితవాద-కార్మిక కొయలిషన్ మంత్రివర్గమైనా ఏర్పడవచ్చు. 1939 ఆఖరులో బ్రిటిష్ పార్లమెంటు ఎన్నికలు ప్రారంభమౌతవి.

“యుద్ధం” యూరప్‌లోని నాలుగు దేశాలమీదనే ఆధారపడి ఉంది. ఫ్రాన్స్, బ్రిటన్, జర్మనీ, ఇటలీలు. ఫ్రాన్స్, బ్రిటన్ దేశాలు పట్టుదలగా ఉన్నట్లయితే యుద్ధం ఈసంవత్సరమే ప్రారంభమై ఉండేది. జకోస్లొవేకియాకు నేటి పరిస్థితి పట్టేది కాదు కూడా.

జకోస్లొవేకియాకు ద్రోహం జరిగింది. ఫ్రాన్స్, బ్రిటన్ దేశాలు మోసగించినవి. ఇది మిగతా దేశాలకు మంచిపాఠము అవుతుంది. మనుష్యుల ప్రవృత్తిని, వారి మాటలబట్టి నిర్ణయించుకోటానికి వీలుగాదని తేలింది. ఈ విషయాలను మనం తెలుసుకోవాలి. చాలా అవసరం. అట్టిస్థితి ప్రతిదేశానికీ వస్తుంది. అబిసీనియా, స్పెయిన్‌లను ఇంతకుపూర్వం జరిగిన ద్రోహం ఇంత బహిరంగముగా లేదు.

హిట్లర్ త్వరలోనే మరిరెండు దేశాలను ఆక్రమించుకోటానికి ప్రయత్నాలు చేస్తాడు. లిథూనియాలో అప్పుడే అల్లరులు ప్రారంభమైనవి. హిట్లర్ డాబులు, డంబాలుచూచి భయపడవలసిన అవసరం ఏమాత్రం లేదు. యూరప్‌చరిత్రయందలి రాజకీయ రహస్యాలను అచటచట కొంత వివరించాను.

జకస్లొవేకియా అసలు బానిసదేశంగా ఉండి, తరువాత సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని పొంది తిరిగి బానిసదేశం ఎలాఅయిందో వీలైనంతవరకూ వివరించాను. తిరిగి ప్రపంచ యుద్ధంవచ్చిన భారతీయులు ఏమిచేయాలో, అప్పుడప్పుడు మననాయకులు, వివరించుతూ వచ్చారు. 1914 యుద్ధంలోనే జకోస్లొవేకియా స్వాతంత్ర్యాన్ని సంపాదించుకుంది. 20 సంవత్సరాలలో ఆశ్చర్యకరమైన అభివృద్ధిని పొందింది. ఆదర్శ ప్రజారాజ్యంగా అలరారింది. అట్టిదేశాన్ని శాంతికోసం బలిఇచ్చారు యూరప్ రాచకీయజ్ఞులు. ఇంతటి అన్యాయం ఎవ్వరికీ జరిగిఉండలేదు. ఇట్టి విషాదఘట్టం చరిత్రలో కనపడదు. అట్టిదానిని తెలుసుకోటం అవసరంకాదూ?

# ఇంకెక్కడి ప్రజాస్వామ్యం?

యుద్ధారప్ నియంతద్వయం నేటిప్రపంచాని కంతకూ భూగోళ శాస్త్రాచార్యులు ఐనారు. క్రొత్తపటములను గీయించుతూ ఉన్నారు. వారి చిద్విలాసాలపై ఆధారపడిఉంది ప్రపంచ చరిత్రఅంతా. వారిదయా దాక్షిణ్యములమీదనే నిలిచి ఉన్నది నేటి ప్రపంచశాంతి. వారికరుణా కటాక్షములకు పాత్రమైన దేశములకే స్వాతంత్ర్యము కలదు. వీరిరువుర అవసరములబట్టి ప్రపంచ చరిత్రను భూగోళశాస్త్రమును తిరిగి వ్రాయించు చున్నారు. వివిధ దేశములందలి ప్రజలకు, రాచకీయ వేత్తలకు క్రొత్త పాఠములను నేర్పు చున్నారు.

మూడు సంవత్సరముల క్రితము, ముస్సోలినీ దండెత్తక పూర్వము, ఎంతమందికి తెలుసు అబిసీనియాఅనే దేశము ఒకటి ఉందని? దానికి హెయిలీ సెలాస్సీ చక్రవర్తినే ఓడించి నారని? నేడో మారుమూలలలనున్న ప్రజలకుకూడా తెలిసింది అబిసీనియా చరిత్ర.

అట్లే ఆస్ట్రియా ఆక్రమణతో హిట్లర్ మతికొంత భూభాగము మనదృష్టికి తెచ్చేడు. గత నాలుగుమాసముల నాటకముతో

ఇంకొక క్రొత్తదేశమును మనయెదుట పెట్టేడు. జెకోస్లోవేకియా చక్కని ప్రజాస్వామ్య దేశమని, శాంతికి ఆలవాలమై సిరి సంపదలతో అలరారుచున్న ఆదర్శ రాజ్యమని, యూరప్ ఖండ రాజకీయ పరిణామము అంతా ఆచిన్నదేశము మీదనే ఆధారపడి ఉందని మనకింతకుముందు తెలియదుగదా? కాని జర్మనీమాత్రం గతరెండు శతాబ్దాల నుంచీకూడా జకోస్లోవేకియా మీద కన్నువేసేఉంది. మధ్యయూరప్ లో ఇది పెట్టని కోటఅని, దీనిని వశపరచుకుంటే యూరప్ రాజకీయ చక్రము గిఱ్ఱునత్రిప్ప వచ్చునని నాడు బిస్మార్క్ భ్రమపడ్డాడు. తిరిగి నేడు హిట్లర్ను ఆకర్షించినదీ ఆ ఆశే!

జకోస్లోవేకియా జర్మనీ క్రిందకు వస్తేమధ్య యూరప్ లోనే గాక యూరప్ ఖండం అంతటాకూడా నాజీపెత్తనమును చలాయించవచ్చునని జర్మనీ నియంత తలంచాడు. అతడు తలచుటే తడవు వెంటనే సాధించుతాడు ఎంతటి పనినైనా. వర్సైల్స్ సంధిని తృణీకరించి రైన్ లాండ్ ను సేనలతో నింపివేయలేదా? చేసిన వాగ్దానములన్నిటినీ త్రోసివేసి ఆస్ట్రియాను వశమొనర్చుకోలేదా? అలాగే నేడు జకోస్లావేకియాను కూడా చేర్చుకున్నాడు. జర్మన్ సామ్రాజ్యంలోకి, హిట్లర్ ఆడిందిఆట; పాడింది పాట. ఇతనికి ఇంతశక్తిని ఇచ్చింది బ్రిటిష్మంత్రి వర్గపు కుటిల రాజనీతి; ఫ్రెంచి మంత్రివర్గపు పిరికితనము.

ప్రపంచంలోని అన్నిదేశాల సానుభూతి ఉంది జకోస్లోవేకియాకు. జర్మని యుద్ధానికే దిగినట్లయితే అన్నిదేశాలు జకోస్లోవేకియాకు సహాయంచేసేవే. 1914 యుద్ధానంతరం జర్మనీకి ఎలాంటి గతి పట్టిందో తిరిగి 1938 యుద్ధం తరువాత అలాంటి దుర్గతే పట్టి

మాటాడితే యుద్ధ ఢంకా మ్రోగించే 'హిట్లరు'

ఉండేది. కాలచక్రం మారింది. ఆనాడు కెయిసర్ కు లేని అదృష్టం హిట్లర్ కు పట్టింది. నిజంగా బ్రిటిష్ మంత్రివర్గము ఏమాత్రము పట్టుదల చూపినా జకోస్లోవేకియా బ్రతికేదే. బ్రిటన్ తో విరోధం పెట్టుకోటం జర్మనీ నియంతకు సుతరామూ ఇష్టం లేదు. జర్మనీ విజృంభణమునకు బ్రిటిష్ సహకారం, సహాయం అవసరమని హిట్లర్ బాగా గ్రహించాడు. "మైన్ క్యాంఫ్"-నాజీ బైబుల్-లో ఈ విషయమును స్పష్టం చేసాడు.


"మనము సామ్రాజ్య విస్తరణకు పూనుకొన్న బ్రిటన్ ఒక్కటే మనల కాపాడగల దేశము. కనుక ఆ దేశపు మైత్రిని, సానుభూతిని సంపాదించుటకు ఎంతటి త్యాగమునైనా చేయవచ్చు. చేయాలి."

ఐనాకూడా ఛేంబర్లేన్ మంత్రివర్గము నిలబడలేక పోయింది. నమ్మిన జకోస్లోవేకియాకు ద్రోహము చేసింది. ప్రజాస్వామ్యమునకు అంత్యక్రియలు జరిపినది. నాజీమకుటమునకు మరొక క్రొత్త తురాయిని అమర్చినది. దీని ఫలితమును బ్రిటన్ ఫ్రాన్స్ దేశములు త్వరలోనే అనుభవింపగలవు. ప్రధానులు ఛేంబర్లేన్, డిలాడియర్లు పశ్చాత్తాప పడగలరు.

# పదిశతాబ్దాల చరిత్ర

హిట్లర్‌కు జకోస్లోవేకియా ఆక్రమణ విషయమైఇంతటి పట్టుదల ఉండటానికిగల కారణములను తెలుసుకోటానికీ ముందు జకోస్లోవేకియా చరిత్రను సింహావలోకనము చేయుట అవసరము. జకోస్లోవేకియా అనేదేశమేలేదు ఒకప్పుడుఅనీ, అందులోఉన్న వారిలో హెచ్చుమంది జర్మనులేనని హిట్లర్ వాదము. ఒకప్పుడు జక్స్ ఆస్ట్రియా సామ్రాజ్యమునకు చెందియున్నారని అంగీకరించినా, నేడు ఆస్ట్రియా తన అధీనమైనది కనుక జకోస్లోవేకియాకూడా తనకు రావాలని, ఆదేశములో జర్మన్‌లున్నారు గనుకే, వారిపురోభివృద్ధికిగాను జకోస్లోవేకియాను ఆక్రమించుట అవసరము అనువాదము సహేతుకమైనదికాదు.

జక్స్‌కు దాదాపు పదిశతాబ్దముల చరిత్రఉంది. ఐనప్పటికీ కూడా జకోస్లోవేకియా ఏ ఒకరిద్దరి వ్యక్తుల ఇష్టాయిష్టములవల్లనూ, దైవసంఘటనములవలననూ ఏర్పడిన దేశమనిన్నీ దురభిప్రాయం చాలా మందికి ఉన్నది. ఐరోపా మహాసంగ్రామానంతరం జకస్లవేకియాకు సంపూర్ణ స్వాతంత్ర్యము, ఒకవ్యక్తిత్వము వచ్చేసరికి ప్రజలుచూపిన పెద్దసంతోషము, నాయకులు గావించిన వింత ప్రకటనలు ఈ అసత్య



జెకోస్లోవాకియా జాతులు
జెక్కులు
రుథేనియన్లు
జర్మనులు
మేగ్యారులు
స్లోవాకులు
రుమేనియన్లు
పోలులు
జెర్మని దేశము
పోలెండు
హంగెరి
రుమేనియా

ప్రచారమునకు దోహద మొసగినవి. కుంతిచెవులలోనుంచి కర్ణుడుపుట్టు కొచ్చినట్లు ఐరోపాసంగ్రామ సంక్షోభమునుండే పుట్టింది జకోస్లో వేకియా అనితలచుట కేవలం పొరపాటేఅని చెప్పాలి. తాత్కాలిక పరిస్థితుల అనుకూలతవలన ఏర్పడిన దేశము ఎంతకాలము ఉండ గలదు? జకోస్లోవేకియాకు మొదట్నుండీ కూడా యూరప్ రాచకీయ ములందు స్థానముకలదు.

పూర్వాపరసందర్భములు తెలియని వారికి జకోస్లోవేకియా చరిత్ర—ఇటీవలచరిత్ర కొంత వింతగానే కన్పడుతుంది. ఆదేశపు నైసర్గిక స్వరూపముల నెరుగనివారికి అంతయు అగమ్య గోచరము గానే ఉంటుంది.

మొరేవియన్ సామ్రాజ్యములో ఒకప్రత్యేక వ్యక్తిత్వముగల దేశముగా ఉంది జకోస్లోవేకియా. ఇది 9 వ శతాబ్దమునాటిమాట. సాటోప్లక్ పాలనక్రింద 870-894 సంవత్సరములమధ్య ఆదేశము నకు విషాద సంఘటనములు సంప్రాప్తమైనవి. ఆకాలమున క్రైస్తవ మతము తీవ్రముగా వ్యాపించుతూఉంది. స్వాటోప్లక్ సామ్రాజ్యము తూర్పు, పడమట చర్చిలమధ్య విభిన్నములై పోయింది. అతడు సకాలములో నిర్ణయం గావించుకోలేకపోవుటే దీనికి కారణము. తుదకు మిగిలింది బొహీమియా. ఎటుచేరవలసినది నిర్ణయించుకోవల సిన భారం ఆదేశముమీద పడింది. ఆపనినే మొరేవియన్ సామ్రా జ్యము చేసిఉంటే యూరప్‌చరిత్రే మరొకవిధంగా ఉండేది. అన్ని దేశాలు కలిసిఉన్నట్లయితే ఇతరదేశముల దాడిని ఎదుర్కోటం తేలికగా ఉండేది. ఆపరిస్థితులలో బొహీమియాకు వేరు గత్యంతర ములేక పాశ్చాత్య మతపీఠములో చేరినది. ఆపీఠములో జర్మనీకి గురు

స్థానంఉంది. అంచేత బొహీమియా మత వ్యవహారములలో జర్మనీకి లొంగిపోవలసి వచ్చింది. మతాధికారాలను ఉపయోగించుకొని రాజకీయ పెత్తనమునుకూడా సంపాదించింది జర్మనీ.

జక్స్ అప్పుడే ఈ అవాంతరాలన్ని ఆపుటకు ప్రయత్నాలు చేసారు. జర్మనీని ఎదిరించారు. కాని బొహీమియా రాజకుటుంబమునకు జర్మన్ సామ్రాజ్యానికి చక్రవర్తిగా ఉండే అర్హత నిచ్చారు జర్మన్ అధికారులు. అందువల్ల అప్పట్లో జక్స్ సాగించిన ప్రతిఘటనము అంత విజయవంతముకాలేదు. కాని, 14 వ శతాబ్దము వచ్చేసరికి బొహీమియారాజు, నాల్గవ ఛార్లస్ జర్మన్ సామ్రాజ్యానికంతకూ చక్రవర్తి ఐనాడు.

బొహీమియారాజు జర్మన్ సామ్రాజ్యానికి చక్రవర్తి ఐనాడన్న సంతృప్తేగాని, ఆదేశపు ప్రజలకు అందువల్ల ఏలాంటి లాభమూ కలుగలేదు. జర్మన్ మతగురువులను హెచ్చుఅధికారం ఉంటంవలన బొహీమియాలోని హెచ్చుభాగాలను ఆక్రమించుకొని, ఉన్నత ఉద్యోగాలను సంపాదించుకొని, ఆప్రాంతంలోని ప్రజలను రాజకీయములలో స్థానములేకుండా చేసారు. ఏశాఖలో చూచినా వీరిదే పైచెయ్యిగా ఉంటూవచ్చింది. జక్స్ ఈ ఘోరాన్యాయములను సహించలేకపోయారు. జర్మన్ల ఆర్థిక, రాజకీయ, సాంఘిక వ్యవహారములందలి పెత్తనమును పోగొట్టుటకు జక్స్ పోరాటాన్ని సాగించారు. ఇదే జర్మన్లకును, జక్స్‌కును వైషమ్యములు కలుగుటకు మూలకారణము. జర్మన్ ప్రతికూలోద్యమము 'జాన్ హస్' నాయకత్వంక్రింద ఒకస్వరూపాన్ని పొందింది. 14 వ శతాబ్దం ఆఖరులో జక్స్‌యొక్క స్వతంత్రాభిప్రాయాలు, జాతీయాభిమానం బాగా

వృద్ధిపొందాయి, ఎలాగైనాసరే ఈ జర్మన్ బానిసత్వమునుండి జయుపడాలని కృతనిశ్చయులై కృషిచేయ నారంభించారు.

ఈవైషమ్యాలు బాగావృద్ధిపొంది ఉన్నసమయంలో అనగా 1526 సంవత్సరం ఆగస్టు 29 వ తేదీన తురుష్కులు డాన్యూబ్ లోయపై దండెత్తారు. మొహాక్సువద్ద తీవ్రంగా యుద్ధంజరిగింది. దాంతో హంగరీ తురుష్కుల వశమైంది. తురుష్కుల విజృంభణ మును అరికట్టడానికి, బొహిమియాదేశము, హాప్స్‌బర్గ్ కుటుంబానికి చెందిన ఫెర్డినాండు ఆర్చిడ్యూక్‌ను రాజుగా ఎన్నుకుంది. హంగరీ బొహిమియాను అనుసరించింది దాంతో ఆస్ట్రియారాజు క్రిందకు వచ్చాయి బొహిమియా, హంగరీ దేశాలురెండూనూ. ఈ ఐక్యతను బొహిమియాయే చాలవరకు బాధ్యురాలని చెప్పాలి. బొహిమియా అలాచేయుటానికి కారణాలు చాలాఉన్నాయి.

ఆ రోజుల్లో జర్మన్ సామ్రాజ్యానికి ఇంచుమించు ప్రధాన నగరముగా ఉండేది ప్రేగ్. అందుచేత 1583-1682 సంవత్సరముల మధ్యకాలములో ఈ ప్రాంతములకు జర్మనులు రావడం, నివాసాల నేర్పరచుకోడం ఎక్కువైంది. అంతకుపూర్వం ఉన్న జక్సుకు క్రొత్తగావచ్చిన జర్మనులకు మైత్రి ఏర్పడింది. అప్పటి మతవైషమ్యాల వలన జక్సువలెనే జర్మన్‌లుకూడా ప్రొటెస్టెంట్ సిద్ధాంతాల నంగీ కరించి లూథర్ శిష్యులైనారు. కాని వారి చక్రవర్తి, వారి కుటుంబీ కులు అందరూ కాథలిక్కులుగానే ఉంటూవచ్చారు. వారికి తమ రాజ్యంలో ప్రొటెస్టెంట్ ప్రాపకం ఎక్కువకావటం ఇష్టంలేక పోయింది. తమ రాచరికమునకే భంగంవస్తుందేమోనని భయపడి 1620 వ సంవత్సరంలో జక్సుతో యుద్ధానికి దిగారు. "వైట్‌మౌన్

రెన్” వద్ద తీవ్రమైన యుద్ధం జరిగింది. అందులో జక్స్ ఓడి పోయారు. వారి ఓటమితో బొహీమియా నామరూపాలే లేకుండా పోయింది. జక్స్ భూములన్నింటినీ హాప్స్‌బర్గ్స్ స్వాధీన మొనర్చు కొని, ఇతరదేశాలలో తమకు అనుకూలంగా ఉన్నవారి నందరినీ రప్పించి పంచిపెట్టారు. అలా వచ్చినవారిలో జర్మన్ దేశీయులే హెచ్చుగా ఉన్నారు. బొహీమియా పంపకం పూర్తి అయిన తరు వాత హంగరీనికూడా అలాగే ఇతరులకు పంచి ఇచ్చేసారు హాప్స్ బర్గ్స్.

బొహీమియా పతనం పూర్తి అవుతూ ఉన్న రోజుల్లోనే యూరప్‌లో కొత్త జాతీయ సంచలనం బయలుదేరింది. ఫ్రాన్స్‌లో క్రొత్త రాజ్యాంగ విధానం ఏర్పడింది. కార్డినల్ రష్లూ సహాయంతో అంతకుపూర్వం రాజ్యాంగ వ్యవహారములలో మత పీఠాలకు ఎక్కువజోక్యం ఉంటూ ఉండేది. దాన్ని తగ్గించి జాతీయతకు హెచ్చు ప్రాధాన్యమిచ్చి, రాజ్యాంగ విధానాన్ని నిర్మించారు. అది 1624-1642 సంవత్సరముల మధ్య ఫ్రాన్స్‌నుచూచి ఇంగ్లండ్‌లో కూడా నూతన రాజ్యాంగవిధానం ఏర్పాటైంది. ఇప్పటిమాదిరిగానే అప్పుడుకూడా ఫ్రాన్స్, బ్రిటన్‌దేశాల పలుకుబడి యూరప్‌లో ఎక్కువగానే ఉండేది. ఎప్పుడైతే ఈ రెండుదేశాలలో క్రొత్త రాజ్యాంగ విధానాలను ఏర్పాటుచేసారో యూరప్‌లోని ఇతరదేశా లలో చైతన్యంకల్గింది. రష్యాలో పీటర్ (దిగ్రేట్) పునర్నిర్మాణ కార్యక్రమానికి పూనుకున్నాడు. జర్మనీ, ఇటలీ దేశాలలో మాత్రం కదలిక పుట్టలేదు. ఫ్రెంచి విప్లవము బయల్దేరిందాకా వీరిలో మార్పు ఏమీ కలుగలేదు, 19 వ శతాబ్దంలో ఈ రెండు దేశాలవారు కళ్లు తెరచారు. జర్మన్‌జాతి ఐక్యత అంటు సాగించింది జర్మనీ. ఈ

దృక్పథమే కొంపలు తీసింది. నేడు యూరప్‌లో శాంతికి స్థానం లేకుండా చేసింది.

జకోస్లోవేకియాకు సంబంధించినంతవరకు 1526 లో హాబ్స్‌బర్గ్సును రాజులుగా ఎన్నుకొనుటయే పొరపాటైనపని. అప్పట్లో "జకోస్లోవేకియా" మంచి, విశాలదృష్టితో ఆపనిని చేసింది. బొహీమియా, హంగరీ. ఆస్ట్రియా-ఈ మూడుదేశాలుకలిసి ఉంటే ఇతరుల నెదిరించుట, స్వదేశీ రక్షణ తేలికౌతుందని జక్స్ ఆశపడ్డారు. 1526 లో తురుష్కుల దాడిని ఎదుర్కోటంవరకు ఆ పద్ధతి ఉపయోగపడింది. 19 వ శతాబ్దంలో ఒక్క తురుష్కుల దాడినుండే గాక, జర్మనీ, రష్యాలనుండికూడా డాన్యూబ్ లోయను కాపాడవలసి వచ్చింది.

# ఆస్ట్రియా పూర్వగాథ

**19** వ శతాబ్దం ప్రారంభంలో జర్మన్‌ల మధ్య అంతఃకలహాలు బయల్దేరాయి. హాప్స్‌బర్గ్స్‌కు హోహెన్‌జోవెరన్ కుటుంబాలలో ఎవరు రాజులుకావాలీ అన్నదొక పెద్ద సమస్య. 1815 లో హాప్స్‌బర్గ్స్ పెద్దరికం క్రిందనే ఒక జర్మన్ సమాఖ్యను ఏర్పాటు చేసారు. ఇన్ని కొట్లాటలు, అంతఃకలహాలు ఉన్నా జర్మన్ జాతీయ ఐక్యతా కార్యక్రమముమాత్రం వెనుకబడలేదు. 1848 లో "ప్రసిద్ధజర్మనీ"ని స్థాపించటానికి ప్రయత్నాలు తీవ్రంగా జరిగాయి. అందుకుగాను ఫ్రాంక్‌ఫర్ట్‌వద్ద ఒక సమావేశాన్ని ఏర్పాటుచేసారు. హాప్స్‌బర్గ్స్‌కు కేవలం అధికారతృష్ణ ఉంటంవలన ఆ సమావేశానికి హాజరు కావటానికి అంగీకరించారు. ఆ సమావేశానికి ఆస్ట్రియా హంగరీ, బొహీమియా దేశాలవారికికూడా ఆహ్వానాలను పంపారు. కాని, జక్స్‌కు రాచకీయ నాయకుడైన పలాకీ ఆహ్వానాన్ని అంగీకరించలేదు. 1848 ఏప్రియల్ 11 వ తేదీన జర్మనీ ఆహ్వానానికి జవాబు పంపుతూ అందులో ఇలావ్రాసారు.

"ఈ సమావేశ పర్యవసానంగా ఆస్ట్రియా, హంగరీ, బొహీమియాలు అంతరిస్తవి. ఆస్ట్రియా ప్రత్యేకతను, వ్యక్తిత్వమును కాపా

డుట జక్స్‌కేగాక యూరప్ ఖండానికంతకూ కూడా అవసరమైన విషయం. యూరప్‌లో తూర్పున ఒక సామ్రాజ్యభూతం బయలుదేరింది. క్రమేణా పడమటికి, దక్షిణానికి వ్యాపించటానికి ప్రయత్నం చేస్తోంది. ఈదేశం ఈప్రయత్నంలో జయంపొందిందంటే ఏకచ్ఛత్రాధిపత్యం ఏర్పడిపోతుంది. నాకు రష్యాఅంటే కోపంలేదు. జర్మనీ అన్నా అంతే. కాని ఇలాంటి ఏకచ్ఛత్రాధి పత్యాన్ని మాత్రం సహించను. దానివలన యూరప్ కేగాక ప్రపంచనాగరికతకే ముప్పువాటిల్లుతుంది. రష్యా యూరప్ సరిహద్దు ప్రాంతాలలో నానాజాతుల ప్రజలను కలిపివేసారు. భాషలువేరు ఆచార వ్యవహారాలు వేరు. అన్నీవేరే. అయినా అందరూ కలిసిఉండాల్సి వచ్చింది. స్లావ్స్, రుమేనియన్స్, మాగియర్స్, కొద్దిగా తురుష్కులు, గ్రీకులు, అల్బేనియన్లుకూడా ఇలా కలిసిపోయారు. వీరందరూ డాన్యూబ్ వల్ల ముడివేయబడి దగ్గరగా చేర్చబడ్డారు. ఆస్ట్రియాదే వీరందర్నీ కాపాడాల్సిన విధి. అలాంటప్పుడు ఆస్ట్రియా చులకనగా వారినందర్నీ వదిలివేయటానికి వీలులేదు. యూరప్ భద్రతకొరకు, ప్రపంచ శాంతికొరకు ఆస్ట్రియా అవసరం. ఆస్ట్రియా లేకపోతే సృష్టించనైనా సృష్టించాలి.” అయితే ఆస్ట్రియావారు జర్మనీకి లొంగిపోయారు. “ఉంటే జర్మన్స్‌లాగానే ఉండాలి లేకపోతే అసలు లేకుండా పోవాలి.” అని ఆస్ట్రియన్లు అభిప్రాయపడ్డారు.

ఆస్ట్రియాలేకుంటే మధ్యయూరప్ ఉండదు. చిన్న చిన్న దేశాలన్నీ విడిపోయి క్రమేణా ఇతర రాజ్యాలవారి అధీనమైపోతాయి తేలికగా. కనుకనే హిట్లర్ ముందు ఆస్ట్రియాను ఆక్రమించి తరువాత జకోస్లోవేకియాను కావాలన్నాడు. త్వరలోనే చూస్తాంకూడా మిగతా చిన్నదేశాలన్నీ ఎలా మారిపోతాయో!

1848 లో కూడా మధ్యయూరప్ భవిష్యత్తు ఆస్ట్రియా నిర్ణయంపైనే ఆధారపడిఉంది. హాప్స్‌బర్గ్స్ రెండు విషయాలను తేల్చుకోవాల్సి వచ్చింది. జాతీయ జర్మన్ వ్యవహారమా లేక మధ్య యూరప్ వ్యవహారమా? రెండవది ప్రసిద్ధ జర్మనీయా లేక శాంతి భద్రతలుగల మధ్యయూరప్పా? నిజానికి ఆసమయంలో ఆస్ట్రియాను వివిధదేశాల దాడినుండి రక్షించింది ఆస్ట్రియన్లు గాదు, హాప్స్‌బర్గు రాజులా? గాదు. జర్మన్ ఆదేశాన్ని కాపాడారు. జర్మనీకి ఆస్ట్రియా, హంగరీ, బొహీమియా దేశాలను కట్టిపెట్టనని నిర్భయముగా తెల్పింది బొహీమియాయే. ఈవిషయాలన్నింటినీ విస్మరించారు హాప్స్‌బర్గులు. మధ్యయూరప్ ఆధిపత్యాన్ని అంగీకరించక హంగరీ బొహీమియాలను జర్మన్‌లతో నింపటానికి తయారైనారు. అందులో కేవలం స్వార్థాన్నే కనబరచారు. జర్మన్‌రాజ్యానికి కేవలం ఒక్క ఆస్ట్రియానేగాక హంగరీ,బొహీమియాలనుకూడా చేర్చామని ప్రగల్భాలు కొట్టి, చక్రవర్తిత్వాన్ని సంపాదించటానికే ఆనాడు హాప్స్‌బర్గ్స్ అంతటి ద్రోహానికి ఒడిగట్టారు.

జర్మనీలో మంచి సూక్ష్మబుద్ధి, దూరదృష్టిగల రాజకీయవేత్త ఉన్నాడాసమయంలో. అతడే బిస్ మార్క్. యూరప్‌కు హానికలుగకుండా ఈ మూడుదేశాలను జర్మనీలో చేర్చటానికి వీలుకాదని గ్రహించాడు. హాప్స్‌బర్గ్స్ రాజ్యాధికారిని వదలకుండా ఉన్నారని తెలుసుకొని యుద్ధంచేయ నిశ్చయించుకొన్నాడు. ఇది 1866 లో. సడోవావద్ద జరిగిన యుద్ధంలో హాప్స్‌బర్గులు ఓడిపోయారు. అప్పుడు ప్రషియారాజు రెండవ విలియం ఆస్ట్రియాను ఇచ్చివేయమన్నాడు. బిస్‌మార్క్ ససేమిరా అని ఆస్ట్రియాను, హాప్స్‌బర్గు రాజులను జర్మనీనుంచి విడదీసివేసాడు బిస్‌మార్క్. ఇలా చేయటానికి ఇతర

కారణాలు ఇంకేమన్నా ఉన్నా ముఖ్యంగా కనపడేది కాథలిక్కులతో నిండిఉన్న ఆస్ట్రియా జర్మనీ విస్తరణకు అభివృద్ధికి తీవ్ర ప్రతిబంధకం అని అతను తలచాడు. బిస్మార్క్ చాలా దూరదృష్టి కలవాడగుటవల్ల జర్మన్ జాతీయతకంటె ముఖ్యమైనది ఉందని తెలుసుకున్నాడు. ఏమిటి ఆముఖ్యమైంది? అది యూరప్ భవిష్యత్తుకే ప్రధానమైనవిషయం. ఆస్ట్రియా ఆక్రమణకు అతనికొక ప్రబల నిరోధం కన్పించింది.

"ఆస్ట్రియా ప్రత్యేకంగా ఉండాల్సిందే. కాని బొహీమియా రష్యా చేతుల్లోకి పోతే జర్మనీ ఎప్పటికీ బానిస దేశంగానే ఉండాలి. అలాగాక బొహీమియా జర్మనీ వశమైతే చీటికి మాటికి రష్యా సామ్రాజ్యంతో లడాయిలకు దిగుతూఉండాలి."

ఇది బిస్మార్క్‌ను వేధించిన సమస్య. మధ్యయూరప్‌లో జర్మనీకిగాని, రష్యాకుగాని పెత్తనం ఇవ్వటానికి యూరప్‌లోని ఇతరదేశాలు సమ్మతించవని తలంచాడు.

1866 లో అపజయంపొందినా హాప్స్‌బర్గ్‌లకు బుద్ధిరాలేదు. ఇంకా జర్మన్ రాజులు గానే ఉంటామని పట్టుపట్టారు. జెకోస్లోవక్స్ అలాచేయటం తెలివితక్కువని ఎంతగానో చెప్పారు. వినలేదు. చివరికి సామ్రాజ్యాన్ని రెండుగా విభజించి హంగరీని మాగియర్స్‌కు ఇచ్చివేసి ఆస్ట్రియాను జర్మన్లకు అట్టిపెట్టేసారు. 1848 లో మాగియర్స్ లూయీకోసత్ నాయకత్వంక్రింద తిరుగుబాటు చేయటమువలన 1867 లో హాప్స్‌బర్గ్ రాజులు పై ఒడంబడికను చేసుకున్నారు. ఇదంతా చూచి జెక్స్ నాయకుడు పలాకీ ఇలా ప్రకటించాడు.

"హంగరీ ఏమైనా, ఆస్ట్రియా అస్తమించినా బోహీమియా మాత్రం ఎప్పటి లాగానే ఉంటుంది." అలాగే ఉందికూడా చివర వరకూ.

యూరప్ మహాసంగ్రామము ముగియక పూర్వమే 1918 లో బోహీమియాను జకొస్లావేకియాగా మార్చి రిపబ్లిక్ను స్థాపించారు. 9 వ శతాబ్దంలో బోహీమియాగావున్న దేశమే 20 వ శతాబ్దంలో జకొస్లావేకియాగా మారింది. అంతేగాని కొందరు అనుకున్నట్లు 1520 వ సంవత్సరంలో ఏర్పడిందికాదు, మరికొందరు తలంచినట్లు జర్మన్ దాడిని, విజృంభణమును అరికట్టడానికి ఫ్రెంచి రాజకీయవేత్తలు సృష్టించిన దేశమూగాదు. కాని వర్సేల్స్ సంధివల్ల ఈ దేశానికికొన్ని ప్రత్యేకహక్కులు వచ్చాయి. అదనపు సౌకర్యాలు సమకూరినాయి. మొదట్నుండీకూడా జక్స్ స్వాతంత్ర్య ప్రియులు కనుకనే ఆస్ట్రియా మీదకు ఎప్పుడు, ఎవరు దండెత్తివచ్చినా రక్షణకుముందు యుద్ధానికి దిగుతూ ఉండేవారు జక్స్.

1848 లో వచ్చిన విప్లవం ఇతర యూరపియన్ జాతుల్లో కల్గించిన చైతన్యాన్నే జక్కులలోనూ కల్గించింది. విప్లవానంతరం బాచ్ నిరంకుశత్వం ఎక్కువైంది. అప్పుడే అస్ట్రియాలో జాతీయ భావాలు రేకెత్తినవి. 1860 ఇటాలియన్ యుద్ధం 1866 ప్రష్యా యుద్ధం అన్నీకలసివచ్చాయి జక్స్కు. వారిలో స్వాతంత్ర్యేచ్ఛ రగుల్కొప్పింది. వారు స్వాతంత్ర్యం ఇచ్చి వేయాలని కోరారు. ఆస్ట్రియా పాటించలేదు. అంతట జక్స్ సత్యాగ్రహం సాగించారు. తత్ఫలితంగానే 1879 లో కొన్నిహక్కుల్ని సంపాదించుకొన్నారు. 1882 లో ప్రత్యేక విశ్వవిద్యాల

యాన్ని స్థాపించుకొని ప్రజల్లో విజ్ఞానవ్యాప్తి ప్రారంభించినారు. 1889 లో ప్రత్యేక రాజకీయ పక్షాన్ని ఏర్పాటు చేసుకున్నారు దానికి నాయకుడు మేజరిక్. ఆయన అధ్యక్షతనే జకోస్లోవేకియా ప్రథమ రిపబ్లిక్ స్థాపితమైంది. ఆ తరువాత క్రమేణావృద్ధి పొందుతూ వచ్చి, నేటికి ఆదర్శప్రాయమైన ప్రజా రాజ్యమైంది కదా అని సంతోషించే సమయానికి హిట్లర్ భస్మాసుర హస్తం పడింది. ఫలితం ఏమౌతుంది? అస్తమయం; కాదు భస్మం అయిపోయింది. ఇప్పుడు జకోస్లోవేకియా ఆస్థితిలోనే ఉంది.

# జెక్-జర్మను తగాదా ఈ నాటిదా?

జెక్-జర్మన్ తగాదా 1938 లో ప్రారంభమైందికాదు. అయిదు శతాబ్దాలక్రితం ఆరంభమై అనేక యుద్ధాలకు కారణమైనది. 15 వ శతాబ్దారంభంలో జర్మన్ ప్రతికూలోద్యమం ఒక స్వరూపాన్ని పొందింది. అప్పుడు జాన్‌హస్ నాయకత్వం వహించాడు. ఇతడొక గొప్ప మతాధికారి. ఎంత మతపిచ్చి వుందో అంతకు వెయ్యిరెట్లు దేశాభిమానంఉంది. ప్రేగ్ విశ్వవిద్యాలయంలోనూ, బెత్లెహాం చర్చిలోనూ తరచు ఉపన్యాసాలుచేస్తూ జన్సులో జాతీయాభిమానాన్ని రగుల్కొల్పాడు. ప్రజలు విపరీతంగావచ్చి ఇతని ఉపదేశాలను వింటూఉండేవారు, అనతికాలంలోనే అతని ఉద్యమం ప్రజాదరణనుపొంది, గొప్ప బలాన్ని సంపాదించింది. జర్మన్ మతాధిపతులకు ఇదంతా కంటకంగాఉంది. పోప్‌కు రిపోర్టు చేశారు. ప్రయోజనం లేకపోయింది. దానికి కారణం ఒక్కటే. అప్పట్లో బోహీమియాకు రాజుగాఉన్న వెన్‌కెస్‌లాకు హస్‌అంటే అపరిమితమైన అభిమానం ఉంది. ప్రజల్లో మంచి పలుకుబడికూడా ఏర్పడింది. కాలం గడచిన కొద్దీ హస్‌ప్రారంభించిన ఉద్యమం విప్లవ ఉద్యమంగా మారిపోయి జర్మను మతాధిపతులకు నిద్రలేకుండా చేసింది. చివరకు పోప్ హస్‌ను

వెలివేసి చర్చిని ధ్వంసం చేయవలసిందని ఉత్తరువుచేసాడు. ఆ పని చేయటానికిపోయిన జర్మన్‌లు జక్కుల తిరుగుబాటును ఎదుర్కోలేక చావు తప్పి కన్ను లొట్టపోయెననే స్థితిలో బయట పడ్డారు.

తిరుగుబాటును సేనలతో అణచలేమని గ్రహించి హస్‌ను రాజీ పేరిట కాన్‌స్టన్స్‌కురప్పించి, 1415లో "మతద్రోహి" అంటూ కాల్పించారు. హస్ ప్రాణాలనైతే తీసుకో కలిగారుగాని అతడు ప్రజల హృదయాల్లో నాటిన స్వాతంత్ర్య బీజముల ఫలితాలను కోసి పారవేయటం ఎవరితరం? జక్స్‌కు ఎక్కడలేని ఆవేశం; ఆగ్రహంవచ్చింది. ప్రజలందరూ హస్‌సిద్ధాంతాలను అంగీకరంచేసారు. ప్రథమంలో బొహీమియారాజు ఉద్యమం పట్లసానుభూతినైతే చూపాడుగాని చివరకు హంగరీరాజు బెదిరింపులను పోప్ హెచ్చరికలకు భయ పడిపోయాడు.

చివరకు 'కూృసేడ్'(మతయుద్ధం) బయల్దేరింది జకోస్లొవేకియా మీదకు. జకోస్లొవేకియాలో ఉన్న జర్మన్‌లుకూడా జక్స్‌కు వ్యతిరేకంగా పనిచేసారు. సమయానికి వచ్చాడు జాన్‌జిజ్‌కా. గొప్ప ప్రతిభావంతుడు. అనుభవంగల సైనికుడు. అయితే వినాయకుడి వివాహానికి తాళిబొట్టు దగ్గర్నుంచీ ఎరువే అన్నట్లు, సైనికులు; ఆయుధాలు...అన్నీ వెతుకోక్కవాల్సి వచ్చింది. రైతుల్ని కొందర్ని తేవదీసాడు. పలుగులు, పారలు చేతికిచ్చి రణరంగానికి నడిపాడు. గొడ్డళ్లు తీసుకొని కొందరు తయారైనారు. వాళ్ల సహాయంతోనే జర్మన్ సేనలను తరిమితరిమి కొట్టాడు. యూరప్ అంతా ఆశ్చర్యం పడింది. నిజంగా జక్స్‌కే సామ్రాజ్యతృష్ణ ఉన్నట్లయితే రైన్‌నది వరకూ వెళ్లి ఎన్నో దేశాలను స్వాధీనము చేసుకోకలిగి ఉందురు.కాని

శత్రువుల్ని ఓడించామనే సంతృప్తిలోనే ఉండి పోయారు. వారెప్పుడూ శాంతినేకోరుతూ ఉండేవారు. నిజంగా 1431 లో డోమాలిక్ యుద్ధానంతరం జక్స్ తల్చుకుంటే యూరప్ అంతా కాళ్లదగ్గరకు వచ్చిపడేది. దురదృష్టవశాత్తు జక్స్‌కు ఇంతటి ప్రాముఖ్యమును ఆధిక్యతను సంపాదించిన జిజ్‌కా ప్లేగ్ వ్యాధికిఆహుతి ఐపోయినాడు.

మంచితనానికి, న్యాయానికి ఎప్పుడూ రోజులులేవు. 16 వ శతాబ్దం మొదలోనే జక్స్‌కు దుర్దినాలు ఏర్పడినవి. వారిదేశంలోని ధనికవర్గం వారేనిదేశద్రోహులైనారు. దానికితగినట్లుగానే 1520లో తిరిగి ఆస్ట్రియాలో చేరిపోయింది, హాప్స్‌బర్గ్ రాజులు జక్ స్వాతంత్ర్యోద్యమాన్ని, నాగరకతను పూర్తిగా నాశనం చేసారు. ఆదెబ్బనుండి 19వ శతాబ్దంవరకూ తేరుకో లేకపోయారు. ఈ మూడుశతాబ్దములు కేవలంబానిసలుగానే ఉండిపోయారు. 1889 లో మాజరిక్ జకోస్లోవేకియాను పునర్నిర్మించాడు.

ఈమూడు శతాబ్దాల విషాద చరిత్రను క్లుప్తంగా వ్రాస్తాను. ఆస్ట్రియా హంగరీ దేశాలను అధికారం ఎక్కువైంది. జర్మన్ చక్రవర్తినివెన్నుకొనుటలోఅంతవరకుబొహీమియాకు ఉన్నహక్కుకూడాపోయింది. జక్స్‌ను చాలా నీచంగా జూచేవారు. అనేక అవమానాలకు పాలైనారు. ముప్పది సంవత్సరాల పర్యంతం మాడ్చివేసారు. కాని అదేతిరిగి జక్స్‌లో విప్లవజ్వాలలను రగుల్కొల్పినది. అన్ని తరగతులవారూ ఏకమైనారు. ప్రప్రథమంలో వీరు ఆస్ట్రియాలో కయ్యానికిదిగలేదు. పైగా ఇంతకుముందువ్రాసాను, జ్ఞాపకముందా? 1866 లో బిస్‌మార్క్ ఆస్ట్రియాతో యుద్ధానికిదిగినప్పుడు జక్స్ ఆస్ట్రియాను రక్షించటానికి ఎలా కొట్లాడారో!

జక్స్ సంపూర్ణస్వరాజ్యాన్ని పొందటానికి ఇద్దరితో పోట్లాడాల్సి వచ్చింది. ఆస్ట్రియన్ సామ్రాజ్యాన్ని ఎదిరించాలి. జర్మన్స్‌ను తరిమేయాలి. 1914లో యుద్ధం ప్రారంభం కాకముందువరకు ఆస్ట్రియా పోరాటం తీవ్రరూపాన్ని దాల్చలేదసలు. జక్ స్వాతంత్ర్య సంపాదనకు సూడేటన్ జర్మనులు మొదట్నుండీకూడా శత్రువుల్లాగా ఉంటూ వచ్చారు. పార్లమెంటు సమావేశాలు ప్రేగ్‌లో గాక వియన్నాలో ఐతే జర్మన్‌లు, ఆస్ట్రియన్లు, అంతా కలిస్తే జక్స్ కంటే ఎక్కువబలం ఉంటుంది. అప్పుడు జర్మన్ ఐక్యతకు ఏమీ భంగం కలుగదు. అలాగే జరిగింది చాలాకాలం. దాన్ని ఉపయోగించుకొని జర్మన్‌లు జక్స్‌ను అనేకవిధాల హింసచేసారు. ఆస్తులను లాక్కొని, పనులనుండి పంపివేసారు. జక్ కూలీలను కేవలం జర్మనులమీదనే ఆధారపడక పరిశ్రమల ప్రారంభించి వృద్ధిపొందుతూ వచ్చారు. జర్మన్ పారిశ్రామికులు దీన్ని సహించలేకపోయారు. పరస్పర వైషమ్యములు ఎక్కువైనాయి. జక్స్‌ను కుక్కలకంటే కనాకష్టంగా చూసేవారు. ఇవన్నీ జక్స్ జాతీయ వికాసానికి, ఐక్యతకు ఉపకరించినవి. విప్లవ జ్వాలలు బయల్దేరాయి. ఆర్పటానికి ఆస్ట్రియన్ల సహాయంతో విశ్వప్రయత్నాలు చేసారు. లాభంలేకపోయింది.

ఈసమయంలో (1868) రంగంమీదకు వచ్చాడు మాజరిక్. ఒకబడి పంతులు ఉద్యోగంచేస్తో ఉండేవాడు. ఐనా మంచిరాజకీయ పరిజ్ఞానం, దృక్పథంఉంది. మరిద్దర్ని చేరదీసి "యువకజక్ పార్టీ" అంటూ స్థాపించారు. బోహీమియా శాసనసభకు 1889 లో జరిగిన ఎన్నికల్లో వీరిపక్షానికే మెజారిటీ వచ్చింది. 1893 లో ఈపార్టీని

వదిలేసి మాజరిక్ "ప్రజాపక్షం" అంటూ మరొక రాచకీయపక్షాన్ని లేవదీశాడు. యువజన పార్టీ కార్యక్రమం తీవ్రంగా లేకపోయినా ప్రజా హృదయాలను చూరగొంది. శాసన సభల్లో హెచ్చుప్రాతినిధ్యం కావాలని, వయస్సు వచ్చిన వారందరికీ వోటింగుహక్కు ఉండాలని ఈపార్టీవారు ఆందోళన చేసారు. ఆందోళనే నాయకులకు ప్రజలకు సన్నిహిత సంబంధాన్ని ఏర్పరచింది.

# ఐరోపామహాయుద్ధం: జకోస్లోవేకియా

ఐరోపా మహాసంగ్రామం జకోస్లోవేకియా తిరిగి ప్రాణంపోంద టానికి ఉపకరించింది. కాని ఆయుద్ధంలో జకోస్లోవేకియా చేసిన కృషికి తగిన బహుమానాన్నేమో పొందలేదు. 1914-18 సంవత్సరాలమధ్య మాజిరిక్, బెనిష్‌గారలు బ్రహ్మాండంగా పని చేసారు. ఉద్యమాన్ని జకోస్లోవేకియా పునర్నిర్మాణానికి అతి జాగ్రత్తగా నడుపుతూవచ్చారు. ప్రజలను చక్కగా తరిఫీదు చేసారు. జాతీయాభివృద్ధికి, స్వయంసంపన్నతకు ఎంతోపనిచేసారు. పరిశ్రమలు బాగా వృద్ధిపొందాయి. వ్యవసాయం బాగుపడింది. 1862 లో వ్యాయామశిక్షణ శిబిరాలకు (సోకోల్) ను ఏర్పాటు చేసి ప్రజల నారోగ్యవంతులుగా చేసారు. శాస్త్ర పరిశోధనల కెంతో ప్రోత్సాహం ఇచ్చారు. జకోస్లోవేకియా అన్నివిధాలా పైకివచ్చింది.

స్లోవక్కులకు అంత అదృష్టం పట్టలేదు. వారు హంగరీ క్రింద ఉండిపోయారు. వారి అభివృద్ధికి అవకాశాలే లేకపోయాయి. జక్స్ నుచూచి వారూ కొంత ప్రయత్నంచేసారు గాని,ఫలించలేదు. అసలు జక్స్‌కుకూడా ఆస్ట్రియాను వదిలేసి పోవాలని లేదు. కాని ఆస్ట్రి

యాను అంటిపట్టుకున్నన్నాళ్లు జర్మన్ పెత్తనం ఎక్కువవుతూ వచ్చింది. దాన్ని సహించటం చాలా కష్టమైంది. దీనికి తోడుగా 1908 సంవత్సరంలో బాస్నియా, హెర్జిగోవినాల ఆక్రమణ జక్స్ దృష్టిని పూర్తిగా మార్చివేసింది. ఆ తరువాత రష్యా, ఫ్రాన్స్ దేశము లతో యుద్ధానికి దిగటంవల్ల ఇంక ఆస్ట్రియాలో ఉండటం దుర్లభం అనుకున్నారు.

1914 యుద్ధములో జక్స్ సానుభూతి పూర్తిగా మిత్ర మండలిపట్లనే ఉంది. అంత ఉత్సాహంతో దిగలేదు యుద్ధములో రష్యారంగములో జక్స్ మిత్రమండలికి కావాలనే లొంగిపోయారు. జక్స్ చెల్లాచెదరై పోయారు. వెళ్లినచోట్లల్లా విప్లవసంఘాలను స్థాపించారు. వాటిపేరు "మాఫీ". ప్యారిస్‌లో మాజరిక్ అధ్యక్షతను ఒక జాతీయసంఘం ఏర్పడింది. బెనిష్, మాజెరిక్‌ల సలహా ననుసరించి జక్స్ అంతా మిత్రమండలిలో చేరిపోయారు. దీనితో ఆస్ట్రియా సేన బలం సగం తగ్గింది దేశమంతా విచ్ఛిన్నమై పోయింది. జక్స్ యుద్ధంలో బాగా పనిచేసారు ప్రత్యేకంగా రష్యా ప్రాంతాలలో చాలా తీవ్రంగా యుద్ధంచేసారు. రష్యా గెలిస్తే తమకు లాభకరమనుకున్నారు. రష్యన్‌లు బొహీమియావరకూ వచ్చి జక్ రాజ్యాన్ని రష్యన్ సామ్రాజ్యంక్రింద ఏర్పాటుచేస్తారన్న ఆశకూడా ఉంది. కాని జక్ నాయకుడు మాజరిక్ మాత్రం తన దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని మొదట్నుండీ పట్టుదలగా ఉన్నాడు. మిగతా వారికిమాత్రం ఈ జర్మన్ పీడవదిలితే చాలుగా అనిపించింది. పైగా మొదట్లో ఇతరదేశాలవారు ఎవ్వరూకూడా జకోస్లోవేకియా విషయమై ఆలోచించేవారే కాదు. అట్లాగని మాజరిక్, బెనిష్‌లు అధైర్యపడలేదు. వారు తమ ప్రచారాన్ని సాగిస్తూనే ఉన్నారు.

దానికి తగినట్లుగానే జకోస్లోవేకియాలోకూడా తిరుగుబాట్లు ప్రారంభమైనాయి. అప్పటి చక్రవర్తి ఫ్రాన్సిస్ జోసఫ్ జక్ స్వాతంత్రోద్యమాన్ని అణచివేయటానికి ఎంతో ప్రయత్నం చేసాడు. పత్రికా స్వాతంత్ర్యాన్ని అరికట్టాడు. యువజనసంఘాలను నిషేధించి, వారి నాయకులనందర్నీ-ముఖ్యులు డాక్టర్ క్రామర్, డాక్టర్ రాసిన్-అరెస్టుచేసాడు. 1921 లగాయతు 1933 వరకు బ్రిటిష్‌వారు మన స్వాతంత్రోద్యమాన్ని అణచివేయటానికి ఎలాంటి నిర్బంధాలు చేసారో అవిగంగానే ఆనాడు ఆస్ట్రియా చక్రవర్తి జక్స్‌ను తొక్కిసేటందుకు అట్టి ఘాతుకాలను చేసాడు. లాభంలేకపోయింది. చివరకు 1916 నవంబరులో ఫ్రాన్సిస్ మరణించాడు. ఆయన తరువాత వచ్చిన చార్లెస్ చక్రవర్తి మితవాదధోరణిని అవలంబించి జక్స్‌ను లోబరచుకుందామనుకున్నాడు సామోపాయంతో. కాని అప్పటికే "మాఫియా" ఉద్యమం బాగా విజృంభించి పోవటంవల్ల వీరిఎత్తులు ఏమీ సాగలేదు.

మాజిరిక్ కృషి 1916 ఫిబ్రవరికి కొంత ఫలించింది. ఫ్రెంచి ప్రధాని యం. బ్రియాండ్ ఇతనితో సంప్రదించి జక్ ఆశయముల పట్ల సానుభూతితెల్పుతూ ఒక "అధికార" ప్రకటన గావించాడు. తరువాత బెనిష్ ప్రయత్నములవల్ల మిత్రమండలివారు 1917 జనవరిలో జకోస్లోవేకియాకు సంపూర్ణస్వాతంత్ర్యం ఇచ్చివేయాలని కోరుతూ అమెరికా అధ్యక్షులు విల్సన్‌కు వ్రాసారు. పారిస్‌లో మాజిరిక్, బెనిష్‌ల కృషి ఫలితంగా ఏర్పడిన "జాతీయసభ" జకోస్లోవేకియా తరఫున పనిచేయుటకు అర్హతకలదని ఫ్రెంచి ప్రభుత్వం గుర్తించింది. బ్రిటన్, అమెరికా, జపాన్, ఇటలీదేశములు కూడా ఫ్రెంచి ప్రభుత్వవిధానాన్ని అనుసరించారు. వెంటనే మాజరిక్,

బెనిష్, స్టిఫానిక్ లు కలసిన తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది జకో స్లోవేకియాకు. అన్ని దేశాలవారు అంగీకరించారీ క్రొత్త ప్రభుత్వాన్ని.

ఆస్ట్రియా చక్రవర్తి చార్లస్ 1918 అక్టోబరు 16 వ తేదీన తన సామ్రాజ్యంలో ఉన్న వివిధదేశాలకు స్వపరిపాలనాధికారాన్నిస్తున్నానని ప్రకటించాడు. అప్పటికే అంతా అయిపోయింది. పైగా అధ్యక్షులు విల్సన్ జకోస్లోవేకియా భవిష్యత్తును ఆ దేశపు విప్లవ నాయకులను సంప్రదించి గాని నిర్ణయించటానికి వీలులేదని స్పష్ట పరిచారు. తరువాత ఈసమస్య లన్నింటనీ పరిష్కారం చేయుటానికి జినీవాలో ఒక సమావేశం జరిగింది. సమావేశము పూర్తి గాక పూర్వమే జక్ జాతీయ సభవారు స్వాతంత్ర్యాన్ని ప్రకటించి ఒక్క రాత్రిలోనే ఒక్క హత్యగాని, సంఘర్షణగాని లేకుండా అన్ని అధికారాలను హస్తగతంచేసుకున్నారు. ఆమరునాడే స్లోవక్స్ తాముకూడా జక్స్ తో కలసిఉంటామని ప్రకటించారు. అక్టోబరు 30 వ తేదీన స్వతంత్ర్య జకోస్లోవేకియా రాజ్యం ఏర్పడింది.

బ్రిటిష్ రాజకీయవేత్తలలో అప్పుడు లాయడ్ జార్జియే ప్రధాన పాత్ర వహించాడు. ఆస్ట్రియా సామ్రాజ్యాన్ని విభజించి చిన్న చిన్న దేశాలకు పూర్ణస్వరాజ్యం ఇవ్వరాదని వాదించారు. కాని లాభంలేకపోయింది. ఫ్రాన్స్ సానుభూతి, అమెరికా పట్టుదల జక్స్ కు ఉపయోగపడినవి.

వర్సైలస్ సంధి ఒడంబడిక ఐనమూడురోజులకు అంటే 14 తేదీన నేషనల్ అసెంబ్లీ సమావేశమై హప్స్ బర్గ్ సంబంధాన్ని పూర్తిగా వదలుకుంటూ మాజిరిక్ ను అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఇదంతా జరుగుతూవున్న కాలంలో మాజిరిక్ జకోస్లోవేకియాలో లేడు. ఇతర

దేశములందు ప్రచారంలో నిమగ్నుడై ఉన్నాడు. ఆతరువాత ఒక మాసము రోజులకు ఇల్లుచేరుకున్నాడు.

బెనిష్ విదేశాంగమంత్రిగాను, యువజనపక్ష నాయకుడు డాక్టర్ క్రామర్ ప్రధానమంత్రిగాను, జనరల్ స్టిఫానిక్ యుద్ధ శాఖామాత్యుడుగాను ప్రభుత్వం ఏర్పడింది. కాని స్టిఫానిక్‌కు స్వాతంత్ర్య జకోస్లావేకియాను చూచేఅదృష్టం కలుగలేదు. ఇంటికి తిరిగివస్తూవున్న విమానం 1919 మే లో త్రోవలో కూలిపోయింది. స్టిఫానిక్ అప్పుడే మృతినొందినాడు.

# జకోస్లోవేకియా రాజ్యాంగ విధానం

**1920**లో సక్రమరాజ్యాంగవిధానం ఏర్పడింది. దాంట్లో నేషనల్ అసెంబ్లీఅంటూ ఒక శాసనసభను ఏర్పాటుచేసారు. అందులో 306 మంది సభ్యులుగల "ఛేంబర్ ఆఫ్ డిప్యూటీస్" అని ఒకశాఖ 150 మంది సభ్యులుగల ఒక సెనేటుఉంది. వయస్సువచ్చిన వారందరికీ వోటింగు హక్కు వుంది. జనాభా ననుసరించి అసెంబ్లీలో ప్రాతినిధ్యం ఏర్పాటుచేసారు. ఎన్నికలు రహస్యంగాను, ప్రత్యక్షంగాను జరుగుపద్ధతిని ఏర్పాటుచేసారు. ఛేంబర్ ఎన్నికలకు 21 సంవత్సరందాటిన ప్రతివ్యక్తీ వోటుచేయవచ్చు. సెనేట్ ఎన్నికలకు మాత్రం 26 దాటినవారే వోటర్లు. స్త్రీలు, పురుషులు అందరూ ఈఅర్హత కలిగిఉండేచాలు ఎన్నికల్లో పాల్గొవచ్చు.

ఈరెండు సభలుకలిసే అధ్యక్షుని ఎన్నుకుంటారు. అధ్యక్షుడు 7 సంవత్సరాలవరకూ ఆపదవిలో ఉంటాడు. కేవలం సభాకార్యక్రమాల్ని జరపటమే గాకుండా ప్రభుత్వాన్ని రద్దుచేయాలన్నా కూడ చేయవచ్చు. క్రొత్త మంత్రివర్గాన్ని ఏర్పాటుచేయవచ్చు.

'ఛేంబర్' లో ప్యాసయిన ప్రతిచట్టము సెనేట్‌లో ఆమోదన పొందాలన్న ప్రత్యేక నిబంధన ఏమీలేదు. పైగా "ఛేంబర్"

ఒక విశ్వాసరాహిత్య తీర్మానాన్ని ప్యాస్ చేసిందంటే సెనేట్ ఎగిరి పోతుంది.

జకోస్లోవేకియాను పరిపాలనా సౌకర్యంకోసరం నాలుగురాష్ట్రాల క్రింద విభజించారు బొహీమియా, మొరేవియా సైలీషియా, స్లవెకియా, కార్పెథియన్, రుథేనియా. అందరూకలసే సుఖంగా, ఇతరులమీద ఆధారపడకుండా జీవించుతూ ఉన్నసమయంలో వచ్చివాలింది జర్మన్ రాబందుపక్షి.

స్వాతంత్ర్యమును సంపాదించి ప్రజాస్వామ్య ప్రభుత్వమును స్థాపించి స్వయం సంపన్నులమై ఉంటాముకదాయన్న సంతోషము సంతృప్తి ఉండటానికి వీలులేదు. జకోస్లోవేకియాకు చుట్టూఉన్నారు విరోధులు. ఏ నిమషాన ఎవరువచ్చి మీదపడతారో అన్నబెంగ, భయం, ఆయుధములను బాగా ఎక్కువ చేసుకోవాల్సి వచ్చింది. ఆవిషయంలో ఎమీ లోటుచేయలేదు. జక్స్ సర్వతోముఖాభివృద్ధినందింది మాజరిక్ అధ్యక్షతక్రింద. 1920 లో డాక్టర్ బెనిష్, అప్పుడు విదేశాంగ మంత్రిగా ఉండి, ప్రక్కదేశాలతో నేస్తం సంపాదించి, జకోస్లోవేకియాలో దక్షిణ ఒడంబడికను ఏర్పాటుచేసాడు. ఆమరుసంవత్సరం ఆవిధంగానే రుమేనియాతో మరొక ఒడంబడికను గావించుకొన్నాడు. ఈవిధంగా ఏర్పడింది. "లిటిల్ ఎంటిటీ" (చిన్నదేశాల సఖ్యతవర్గము) మధ్యయూరప్‌నందలి అరాజక పద్ధతులను కాపాడటానికి ఈవర్గం బాగా ఉపయోగపడింది. వీరిని ఎప్పుడూ బలపరుస్తూవచ్చింది ఫ్రాన్స్. 1922 లో ఆర్థిక సహాయంచేసి ఆస్ట్రియా వైరుధ్యాన్ని కొంతవరకు తగ్గించుకుంది. జకోస్లోవేకియా 1925 లో జరిగిన లోకార్నో ఒడంబడిక ఫలితంగా ఫ్రాన్స్ జర్మ

నుల మధ్య కొంతసఖ్యత కుదరటంవల్ల జకోస్లోవేకియాపట్ల జర్మన్
వైఖరి కొంచెం మారింది.

విదేశ వ్యవహారాలకు సంబంధించినంతవరకు బెనిష్ అతిజాగ్ర
త్తగా, తెలివితేటలతో వ్యవహారాలు నడుపుకుంటూ వచ్చాడు.
ఇంక జాతీయాభివృద్ధిని పరిశీలించితే గత 20 సంవత్సరములలోనూ
జకోస్లోవేకియా పొందిన అభివృద్ధి అచ్చెరువు గొల్పుతుంది.

1938 లో స్వాతంత్ర్యంవచ్చేసరికి సివిల్, మిలిటరీశాఖలలో
పనిచేయించటానికి తగినంతమంది ఉద్యోగులే లేకపోయారు. కంచు
కాగడాలుపెట్టి వెతికినామంచి డొక్కశుద్ధిగలవారు కనపడలేదు.
అంచేత విజ్ఞానవ్యాప్తి ముఖ్యావసరంగా కన్పడింది ప్రభుత్వానికి.
వెంటనే రెండు విశ్వవిద్యాలయాలను ఏర్పాటుచేశారు; మొరేవి
యాకు బ్రూనోవద్ద, స్లోవేకియాకు బ్రాటిస్లావావద్ద పారిశ్రామిక,
కళాశాలలు, వ్యవసాయశాస్త్ర పాఠశాలలు, వ్యాపారవిద్య నొసగు
టకు ప్రత్యేక విద్యాలయాలు...ఇలా అనేకసంస్థలను నేర్పాటు
చేసారు. నేడు జకోస్లోవేకియాలో చదువురానివారు ఎంతమంది
ఉన్నారో తెలుసా? ఇండియాలో చదువువచ్చిన వారెందరో
జకోస్లోవేకియాలో చదువురానివారందరుంటారు. ఇంకా తక్కువ
కూడా.

జకోస్లొవేకియాకు, దేశసౌభాగ్యం ఎంతఅవసరమో అంతకు
రెండురెట్లు అవసరం రక్షణశక్తి, మంచి సైనికదళాలు కావాలి.
యూరప్అంతా వకటిఐనా జకోస్లోవేకియాను కాపాడగల సైని
కులు ఉండాలి. కారణం ఇదివరకేచెప్పాను. ప్రభుత్వం ఎక్కువశ్రద్ధ

తీసుకుంది. 6 సంవత్సరాలు దాటి 50 సంవత్సరాలలోపు ఉన్న ప్రతి వ్యక్తికి-స్త్రీ గాని, పురుషుడు గాని, సైనికశిక్షణ పొందటం అవసరంగాతలచి నిర్బంధంచేస్తూ శాసనాన్ని ప్యాసుచేసారు. వీరి సైనిక శిక్షణ జక్ సైనికుల ధైర్యసాహసాలనుగురించి విపులంగా ముందు వ్రాస్తాను. దాన్నిబట్టి బ్రిటన్, ఫ్రాన్స్‌దేశాలు తటస్థంగా ఉన్నా జక్స్ తమ స్వాతంత్ర్యాన్ని కాపాడుకోకలిగే వారే అని స్పష్టపడుతుంది.

ఆర్థిక విషయములలోకూడా వీరికి చిక్కులు చాలా ఉన్నాయి. క్రొత్తగా స్థాపించుకున్న రాజ్యంఅవటంవల్ల ఇతరదేశాలతో వ్యాపారఒడంబడికలు, మారకము మొదలైనవన్నీ ఏర్పాటు చేసుకోవాల్సివచ్చింది. ఆస్ట్రియా, హంగరీదేశాలనుండి వచ్చేకరెన్సీని ఆపటం ముందుపనిగా యెంచుకున్నారు. జకోస్లోవేకియాలో ఉన్న బ్యాంకుల నోట్లన్నింటికీ జక్ ప్రభుత్వ ముద్రవేసారు. అలా ముద్దర్లు లేనినోట్లు చెల్లవన్నారు. ఈవిధానంలో ఆర్థికపరిస్థితులు కొంతవరకు బాగుపడినాయి. చివరకు ఆస్ట్రియాకే ఎంతగానోతోడ్పడింది. అప్పు లిచ్చి. 1934 లో అమెరికన్ డాలర్, బ్రిటిష్‌పౌండు విలువతగ్గినా కూడా జక్ దేశపు ఆర్థికస్థితిఏమీ మారలేదు. ఆసమయంలో ఆస్ట్రియా, హంగరీ, జర్మనీలకుపట్టిన అవస్థ తెలిసినవారికి జకోస్లోవేకియా ఇలా నిలబడిందనివింటే ఆశ్చర్యపడకపోరు. అది సామాన్య విషయమూకాదు.


1919 లోనే "భూమి విధానాన్ని" బాగా సంస్కరించారు. అంతకుముందు, నేడు మనదేశంలో ఉన్నట్లుగానే, భూమి అంతా కొద్దిమంది చేతుల్లోనేఉంది. రైతులు అవస్థపడుతూ ఉండేవారు

ఉన్న భూములమీద వచ్చే ఆదాయం తిండికి చాలక. ఈ అన్యాయాన్ని తొలగించి భూములను బాగా పంచివేసారు. రైతులు సుఖంగా ఉన్నారు. అడవులను ప్రభుత్వం తీసుకొని ప్రజలకు ఉపయోగపడేలా చేసింది. నేడు నూటికి 40 మంది వ్యవసాయంమీద, 33 మంది పరిశ్రమలమీద జీవించుతూ ఉన్నారు. వ్యవసాయంఅంతా ఆధునికపద్ధతులమీద సాగించుతూ ఉన్నారు. పంచదార విరివిగా తయారవుతుంది. అంటే చెరకుబాగా ఉత్పత్తి అవుతుందన్నమాట. 1937 ఆదాయ వ్యయపట్టికలను పరిశీలించితే ఆదాయమే ఖర్చుకంటే ఎక్కువగాఉన్నట్లు కన్పడుతూ ఉంది. సంవత్సరానికి 20 లక్షల క్రౌన్లు (సుమారు 60 లక్షల రూపాయలు) మిగులుతూ ఉంది.

# జెక్కు ఉద్ధారకులు

జెకొస్లొవేకియాను ఇంతటి అభివృద్ధికి తెచ్చిన మాజరిక్, బెనిష్‌ల గురించి తెలుసుకోటం అనవసరం కాదు.

మాజరిక్ 1850 వ సంవత్సరంలో దక్షిణ మొరేవియాలోని హొడొనిన్‌లో జన్మించాడు. తలితండ్రులు చాలా బీదవారు. అజ్ఞానులుకూడా. తల్లి వియన్నాలో దాసీగా పనిచేసేది. తండ్రి "కోచ్ మెన్" గా ఉండేవాడు. చిన్నతనంలో మాజరిక్ ఒక కమ్మరి షాపులో ఉండేవాడు. కాని చిన్నప్పట్నించీ బాగా చదువుకోవాలని, పైకిరావాలని ఆశ ఉండేది. కమ్మరి దుకాణంలో ఉంటూనే చదువుట, వ్రాయుట బాగా నేర్చుకున్నాడు. తరువాత ఒక బ్రన్ పోలీసుఉద్యోగి కొడుక్కు మేష్టరుగా కుదిరాడు. అలా అలా కాలం గడుపుకుంటూ చదువువదలక 1876 లో పట్టభద్రుడైనాడు. వెంటనే వియన్నా విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడుగా చేరాడు. 1882లో ప్రేగ్ విశ్వవిద్యాలయంలో తత్వశాస్త్ర ఆచార్యుడుగా ఉండాల్సిందంటూ కోరారు. సరేనన్నాడు. సారస్వతము, రాజకీయాలు, చరిత్రల్లో ప్రావీణ్యము ఉంది. పత్రికారచన అంటే అభిలాష. జోరుగా వ్రాసేవాడుకూడా.



జెకోస్లోవకియా ఉద్ధారకుడు మేజరిక్


ప్రేగ విశ్వవిద్యాలయంలో చేరాక జాతీయాభివృద్ధికి చేయవలసిన కార్యక్రమాన్ని గురించి ఆలోచించాడు. ఆవిషయంలో ఆ ఘనకృషిని ఇంతవరకు వ్రాసాను. అదంతా ఒక్కమాటలో చెప్పితే- ఆయన లేకపోతే జకోస్లోవేకియా దేశమే ఉండేదిగాదు. స్వాతంత్ర్యప్రియుడు, కల్లకపటములు లేనివాడు, అన్యాయం, అసత్యం అంటే అసహ్యం; సహించలేడు. 1900 లో జక్ రాజకీయ పక్షాన్ని స్థాపించి బాగా పనిచేయటంవల్ల 1907 లో పార్లమెంట్ కు జక్ జాతీయసభ్యులుగా ఎన్నుకోబడ్డాడు. ఆతరువాత ఐరోపా మహాసంగ్రామం రావటం, దాన్ని ఉపయోగించుకొని 1918 సరికి జక్ రిపబ్లిక్ ను ఎలా స్థాపించింది తిరిగ చెప్పనక్కర్లేదుకదా.

1918 నవంబరులో జక్ రిపబ్లిక్ కు ప్రథమ అధ్యక్షులుగా ఈయనను ఎన్నుకొన్నారు. తిరిగి 1927 లో మళ్లీ ఆయనే కావాలన్నారు జక్ ప్రజలు. చట్టప్రకారం ఒక్కొక్కరు రెండుసార్లకంటే ఎక్కువ ఎన్నుకోబడకూడదు ఈ అధ్యక్ష పదవికి. కాని తిరిగి 1934 ఎన్నికలువస్తే ప్రజాభిప్రాయాన్ని అనుసరించి చట్ట నిబంధనలను మార్చి మూడవసారి అధ్యక్షపదవికి ఈయననే మళ్లీ ఎన్నుకున్నారు. జక్స్ కు ఆయనంటే ఎంతటి ప్రేమ, గౌరవం,అభిమానం ఉందో దీనివల్ల స్పష్టపడుతుంది. పైగా అందుకు అర్హతకూడా ఉంది. చివరకు 1935 డిసెంబరులో రాజకీయాలనుండి విరమించుకొని ప్రేగ్ లో విశ్రాంతి తీసుకుంటూ ఉన్నారు. గత సంవత్సరం సెప్టెంబరు 14 వ తేదీన అసువుల విడినాడు ధన్యుడు. అంత కష్టపడి సంపాదించిన జకోస్లోవేకియా నేడిలాంటి దుస్థితికి వచ్చుట చూడలేకుండ ఇయన కాలగతి చెందేడు.

అబ్రహాం లింకన్ లా చిన్న సాధారణ కుటుంబంలో పుట్టి ప్రపంచ విఖ్యాతిని పొందాడు. ఇటలీ నిర్మాత కౌంట్ కవూర్ (19 వ శతాబ్దం) బాగా చిరస్మరణీయుడైనాడు.

మాజరిక్ అంతటి అదృష్టవంతుడు కాదు, అతని తరువాత అధ్యక్షుడైన బెనిష్. జక్-రిపబ్లిక్ స్థాపనకునూ జక్ తో పాటు కష్టించి స్వాతంత్ర్యం వచ్చాక వన్నె చిన్నెలు గూర్చి అంతర్జాతీయ ప్రఖ్యాత, సభ్యతలను సమకూర్చాడు జకోస్లోవేకియాకు. కాని అతడు అధ్యక్షుడుగా ఉన్న సమయంలో తనదేశమునకిట్టిస్థితి సంభవించుటవల్ల ఆతడెంతగా బాధపడి యుండునో? బాధను భరించలేక, అవమానముల సహింపలేకనే అధ్యక్షపదవికి రాజీనామా ఇచ్చి రాజకీయాలనుండి విరమించటమేగాక, దేశాన్ని కూడా వదలి నేడింగ్లండ్ లో విశ్రాంతి తీసుకుంటూ ఉన్నాడు. అట్లుగాక జకోస్లావేకియాలోనే ఉండి ఎప్పటి మాదిరి పనులు సాగించుచున్న కొంతకాలానికి డాక్టర్ షూష్నిగ్ కు పట్టిన అవస్థలే ఈయనకు సంప్రాప్తమైయ్యేవి. కాని బెనిష్ నిష్క్రమణం, బ్రిటిష్ ప్రజలకు అష్టమ ఎడ్వర్డు రాజ్యపరిత్యాగ మొన్న వెస్తునప్పుడు ఎలాంటి విచారము కల్గినదో, జక్స్ కుకూడా అంతటి విచారమునకు కారణమైనది.

బెనిష్ ప్యూరిటన్ జీవితాన్ని గడుపుతూ ఉండేవాడు, మొదట్నుంచీ త్రాగుడు పనికిరాదు. చుట్టా సిగరెట్లను ముట్టడు. శాంతి ప్రియుడు కనుకనే నేడు యూరప్ కు కాదు. ప్రపంచానికే శాంతిభిక్ష పెట్ట కలిగినాడు. ఒక అపూర్వ వ్యక్తి ఆయన గురించి ఇటీవలనే వరల్డ్ రివ్యూ సంపాదకులు వెర్నన్ బార్ట్లెట్ ఇలా వ్రాసాడు.



మొన్న మొన్నటివరకు జెక్ అధ్యక్షుడుగా ఉన్న
స్వాతంత్ర్యవీరుడు డా. (బెనిష్)

"1917 లో కాబోలు యుద్ధరంగమునుండి తిరిగివచ్చేసాం ఇంగ్లండ్‌కు. ఒకరోజు ఆఫీసుకుపోయాను. గోడమీద యూరప్ మ్యాప్ ఉంది. రంగు పెన్సలుతో మధ్య కొన్ని గీతలుగీసి ఉన్నాయి అవి జక్ దేశపు సరిహద్దులు. అకస్మాత్తుగా అంతరించాయి అవన్నీ నేడు. నేను వెళ్లిన ఆఫీసు ఒక జక్ దేశీయుడు నడుపుతూఉన్నాడు. అతడు నాతో అత్యుత్సాహంతో ఇద్దరు వ్యక్తుల్ని గురించి చెప్పడం మొదలు పెట్టాడు. వాళ్లుమేజిరిక్ బెనిష్‌లు. వాళ్లెవరో నాకు తెలీదప్పుడు. కాని ఆస్ట్రియా, హంగరీ సామ్రాజ్యం అంతరించుకుందని, దానికి ఈ ఇరువురే కారణ భూతులౌతారని అతడు చెప్పినప్పుడు నాకు కొంత ఆశ్చర్యం కల్గింది.

ఆ తరువాత ఒక రోజున ఒకవింత వ్యక్తిని కలుసుకున్నాను. వచ్చీరాని ఇంగ్లీషులో యూరప్ ·యుద్ధంలో జక్స్ జర్మనీ తట్టు ఉండం ఎలా మిత్రమండలితో కలసి పోట్లాడుతూ ఉన్నారో. దాని కోసం తనంతగా కృషిచేసాడో చెప్పటకువచ్చాడు. అతడొక బడిపంతులని చెప్పటంవల్ల అతని మాటల్లో నాకు నమ్మకం కుదర్లేదు. అతడే బెనిష్. ఆస్ట్రియా స్విట్జర్లండ్ దేశాల మధ్య ఒక కల్పితమైన పాస్‌పోర్టుతో సంచారంచేస్తూ ఉన్నాడప్పుడు. ఒకరోజున విద్రోహి అని పిల్చారతన్ని, మరునాడే గౌరవనీయుడైన స్నేహితుడన్నారు మిత్రమండలివారు. నేను నమ్మలేకపోయాను. అతడు జక్ స్వాతంత్ర్యాన్ని గురించి చెప్పిన కథల్ని.

౧౯౨౧ నేనతన్ని కలుసుకోటం అతడు జక్ విదేశాంగమంత్రి ఐన తరువాత. సెప్టెంబరు 27 వ తేదిన (193౮) ఛేంబర్లెన్‌గారు బ్రాడ్‌కాస్టుచేస్తూ "జెక్స్ అంటేఎవరో మనకు తెలీదు" అన్నాడు

విదేశాంగ కార్యాలయంలో నిపుణుల్ని అడిగినట్లయితే జెక్స్ గురించి; బెనెష్ సామ్రాజ్యములను గురించి ఎంతో తెలుసుకో కలిగే వాడు.

నానాజాతిసమితి వ్యవహారాలలో బెనెష్‌కృషి మరువరానిది ఎప్పుడు ఏ ఏ దేశాలమధ్య విషమసమస్యలు బయలుదేరినా అంతా బెనెష్‌వైపు చూసేవారు మధ్యవర్తిగా ఉండి పరిష్కారం చేయుమని. ఏవిషయంలోగాని బెనెష్ సలహాతీసుకోనిది అక్కడ ఏతీర్మానం ప్రాప్తు అయ్యేదికాదు. అతను తలపెట్టిన ప్రతికార్యములోను గెలుపునే పొందాడు. అపజయమును అసలు అంగీకరించేవాడే గాడు. ఇప్పటికి అదే ధోరణిలో ఉన్నాడనుకుంటా. ఫ్రాంకోజర్మన్ సఖ్యత ఇతని కృషిఫలితమే. కాని ఫ్రాన్స్ ఈనాడు ద్రోహంచేయ సాహసించింది. చేసిందికూడా.

జర్మనీలో ఇతన్నిగురించి పత్రికలుచేసిన దుష్ప్రచారానికి అంతులేదు. సెప్టెంబరులో బెనెష్‌నుగురించి తెలుసుకోనివ్యక్తి ప్రపంచంలో ఉంటాడా అన్నఅనుమానం ఉంది. అతని రాజీనామావలన యూరపుకే తీరనినష్టము కల్గింది.”

బెనెష్ అక్టోబరు మొదటివారంలో అధ్యక్షపదవికి రాజీనామా నిస్తూ ఇలావ్రాశాడు.

“నేను మూడుసంవత్సరాలు అధ్యక్షుడుగా ఉన్నాను. తుదకిట్టి విషాద సంఘటనములు సంప్రాప్తమైనవి. మనల నివి నిరుత్సాహ పరచినవి. హృదయావేదనకు కారణములైనవి. కాని మనఆదర్శకమును గాని, ఆదర్శములనుగాని ఏమీ చేయలేవు. మన నమ్మ

ములు పూర్వమువలెనే ఇప్పుడూ, ఇకముందూ ప్రజల ఉత్సాహ పరచగలవు. వారికి ధైర్యము నొసగగలవు చరిత్రాత్మకమైన ఈ సంఘటనములు మనజీవితా ధారములనే మార్చివేసినవి. మార్పుకు నేనెంతగానో తోడ్పడినందున ఈమారిన పరిస్థితులలో నేనేమి చేయాలో, నా విధిఏమిటో బాగాఆలోచించుకోవలసిన అవుసరంఉంది.

నేను అధ్యక్షస్థానమునకు వచ్చినపుడు పరిస్థితులు పూర్తిగా భిన్నముగా నుండినవి, అందుచేత నేను ఇంకా ఈ పదవియందున్న మన దేశము నెదుర్కొనుచున్న ఈ క్రొత్త పరిస్థితుల, సమస్యల పరిష్కారమునకు తీవ్ర ప్రతిబంధకముగా నుండగలదు ముందు క్రొత్త విధానమును అనుసరించి పరిసర దేశములతో క్రొత్త ఒడంబడికల నేర్పాటుచేసికొని అంతర్జాతీయ పరిస్థితులకు అనుకూలముగా ప్రభుత్వ విధానాన్ని నడపాలి.

మన మిప్పుడు నూతన ప్రభుత్వాన్ని నిర్మించినాము. శాంతియుతంగా వ్యవహారాలను నడుపుతుంది. సాంఘిక పునర్నిర్మాణము నకు, జాతీయాభివృద్ధికి, ఆర్థిక స్వయంపోషకతకు కృషి చేస్తుంది. ఈ ప్రయత్నములలో జయమొందగలదునని విశ్వసించుచున్నాను. ఈ క్రొత్త పరిస్థితులలో నేను అధ్యక్షస్థానమును వదలుట అవసరమని తలంచుచున్నాను. అందు మూలమున నేను నా బాధ్యతను వదలివేయుచున్నానని తలంపరాదు. తుపాన్‌లో చిక్కుకొన్న నావను వదలిపోయిన 'కెప్టెన్' లాగా ప్రవర్తించుచున్నానని తలంపరాదు. ప్రభుత్వం సరిగా నడచుటకు అనుకూల వాతావరణమును కల్గించుటకే నేనిట్లు చేయుచున్నాను.

కనుక నేను నా రాజీనామా లేఖను నీ (ప్రధానమంత్రి) చేతు లందిడుచున్నాను. పరిస్థితుల ననుసరించి సంచరించవలయునని కోరుచున్నాను.

నాతో సహకారము చేయుచున్న, చేసిన, మంత్రివర్గమునకు నా కృతజ్ఞత తెల్పుచున్నాను, మీరు మీ ప్రయత్నములందు విజయమును బడయుదురుగాక ! మంచి భవిష్యత్తు ఉందనే తలంచుచున్నాను''

# సుడేటను జర్మను సమస్య

జెకోస్లొవేకియా పుట్టుక, స్వాతంత్ర్య పోరాటము జాతీయనాయకులు—వీటిఅన్నింటిని గురించి కొంతవరకు తెలుసుకున్నాం ఆదర్శప్రాయమైన ప్రజారాజ్యమునకు ఇలాంటిస్థితి ఏమి వచ్చింది? ఇంక ముందు జకోస్లొవేకియా ఏమికానున్నది అన్న విషయాలు చూద్దాం. బ్రిటన్, ఫ్రాన్సు దేశాల ద్రోహంవల్ల జక్సు జర్మనీకి లొంగిపోయారు. హిట్లర్ స్వేచ్ఛగా, సునాయాసంగా సుడేటన్ ప్రాంతాలను ఆక్రమించుకున్నాడు.

హిట్లర్ కు జకోస్లొవేకియా ఆక్రమణ విషయమై ఇంత పట్టుదల దేనికి? ప్రపంచంలో ఎన్ని దేశాలు లేవు; ఆయనకు ఈ దేశమే ఎందుకు కావాల్సివచ్చింది? దీనికి తలకొక సమాధానం చెపుతూ ఉన్నారు. అసలు హిట్లర్ ఏమి చెపుతున్నాడో ముందుచూద్దాం. అదేగా ముఖ్యం.

జకోస్లొవేకియాలో, సరిహద్దుప్రాంతాల, జర్మన్ లుఉన్నారు. వారిని సుడేటన్ జర్మన్ లని అంటారు. సుడేటన్ పర్వత పరిసరాల్లో ఉంటున్నారు గనుక వీరిని చాలా హీనంగా చూస్తున్నట్లు

ఈ రొష్టుకంతకూ
కారకుడైన సుడేటన్
నాయకుడు



హెన్లీన్

బెనిష్‌ప్రభుత్వం. కుక్కలకంటె కనాకష్టంగా ఉంటున్నారట. సహింపలేని అవమానాలు; భరింపజాలని బాధలు...ఈ విధంగా ప్రచారంచేస్తూవచ్చాడు హిట్లర్. తన జర్మన్‌జాతికి ఇలాంటి అవమానాలు జరుగుతూఉంటే, వారి స్థితి ఇంత దారుణంగా ఉంటే ఏలాచూచి ఊరుకోటం అన్నాడు. కనుక వారున్న ప్రాంతాలను తక్షణం జర్మనీ వశంచేయాలన్నాడు. లేకపోతే యుద్ధం తప్పదని స్పష్టంచేసాడు. అది అసలు నేటి పరిస్థితులకు, కారణం.

హిట్లర్‌కు కావాల్సింది జకోస్లావేకియాగాని అందులోఉన్న జర్మన్‌లుగాదు. మొదట్లో చెప్పాను జకోస్లావేకియా మధ్య యూరప్‌లో ఎలాంటి స్థానం కలిగిఉంది. ఈ దేశాన్ని ఆక్రమించుకుంటే నిరాఘాటంగా నాజీ జెండా ఎగురవేయవచ్చు మధ్య యూరప్‌లో. ఒక దేశాన్ని ఆక్రమించటంఅంటే ఏదో కారణం ఉండాలి? ఎంత నియంతైనా ముందు కీచులాటకు దిగటానికి కొంత కథఉండాలి. దానికి ఉపయోగించాడు. సుడేటన్ జర్మన్ సమస్య నిజానికి ఇదొక సమస్యగాదు. సుడేటన్‌లు సుఖంగా ఉంటున్నారు. జక్ ప్రభుత్వం అల్ప సంఖ్యాకుల విషయమై ప్రత్యేక శ్రద్ధ తీసుకునే, మొదట్నుండీ పనిచేసికొంటూవచ్చింది. జర్మన్‌లే ప్రభుత్వంతో సహకారంచేయక క్రొత్త సమస్యలను తెచ్చిపెట్టుతూ మాజిరిక్‌ను సైతం విసిగించారు. అక్కడికీ జక్ ప్రభుత్వం ఎంతో సహనంతో అల్ప సంఖ్యాకులకు ప్రత్యేక రక్షణల నేర్పాటుచేసి, వారివారి జాతీయ వికాసమునకు, అభివృద్ధికి ఎన్నో అవకాశాలను కల్గించారు. స్విట్జర్లాండ్‌లో మాదిరిగానే ఇక్కడకూడా భిన్నజాతులవారి మధ్య సామరస్యం కుదిరింది. ఎవరికీ ఏమీ తక్కువలేదు.

సుడేటన్ జర్మన్‌లకు కావాల్సింది అదికాదు. అసలు జక్ ప్రభుత్వమే పనికిరాదన్నారు. జకోస్లొవేకియా అన్న పేరే ఉండకూడదన్నారు. జర్మన్ నాయకులు ఈ అభిప్రాయాలనే బహిరంగంగా ప్రచారంచేసారు. జకోస్లొవేకియాలో తిరుగుబాటు చేయకపోతే మహాపరాధమన్నాడు సుడేటన్ జర్మన్ నాయకుడు డాక్టర్ లాడ్‌మన్. ఇంతచేసినా 1926--38 వరకూ కూడా మంత్రి వర్గంలో వీరికి మూడు స్థానాలని ప్రత్యేకించుతూ వచ్చారు జక్స్. అంతే గాదు. అల్పసంఖ్యాకుల రక్షణ 'ఒడంబడిక'ను కూడా అంగీకరించింది జకోస్లొవేకియా. అందుకు భిన్నంగా ఎప్పుడూ నడవలేదు. నడిపించిఉంటే అల్పసంఖ్యాకుల రక్షణ ఒడంబడికలోని 14-వ క్లాజు ప్రకారం నానాజాతి సమితి ఎదుట ఫిర్యాదుచేయువచ్చు. అలాంటిదేమీ జరుగలేదు.

సుడేటన్ జర్మన్‌లు మారదూరంగా పోయి రాళ్లు విసురుతూ ఉన్నా జకోస్లొవేకియా అడుగడుక్కూ కూడా వారి సహకారాన్నే కోరుతూ వారికి అందరితోపాటు సమాన హక్కుల్ని ఇస్తూ, వారి విద్యాభివృద్ధికి, భాషాపోషణకు, అవసరమగు హామీలను అన్నింటినీ ఇచ్చారు.

అసలు జర్మన్స్‌కు బాతునే మ్రింగాలనిఉంటే బాతుపెట్టేగుడ్లు అన్నీ ఇస్తేమాత్రం సంతృప్తి కలుగుతుందా? 1930 వరకూ అభ్యంతరాలు కల్గించుతూఉన్నా విజృంభించలేదు. జర్మనీలోనాజీరాజ్యం ఏర్పడగానే వీరికికిసమెక్కింది. మొదట్నుండీకూడా అలాగే వస్తూవుంది జర్మనీకీసుడేటన్ జర్మనులకు గల సంబంధం. చంద్రునికళ వృద్ధి పొందినకొద్దీ సముద్రుడి ఉత్సాహం ఎక్కువైనట్లే.

దీనికంతకు జకోస్లోవేకియా మొత్తదనమే కారణం. అందరికీ వారిష్టమొచ్చిన ఆచారం చేసుకోటానికి పూర్తిస్వాతంత్ర్యం ఉంది. ఏజర్మనీ, ఇటలీదేశంలాంటి దాంట్లోనైనా ఐతే నేటి సుడేటన్ జర్మన్ నాయకుడు హిట్లర్ ప్రభుత్వం పైనచేసిన దుష్ప్రచారానికి ఎన్నడో ఉరకంబాన్ని కావలించుకోవల్సి వచ్చేది. కనుకనే హిట్లర్ అంతధైర్యంగా ఇంట్లోతిని ఇంటివాసాలను లెక్కపెట్ట కలిగాడు. నాజీలు క్రమేణా జోక్యం కలుగజేసుకోటం ప్రారంభించారు. దాంతో జక్స్ జర్మన్ల మధ్యవున్న సంబంధం మారిపోయింది. అంతకుముందు ఒకర్ని ఒకరు తిట్టుకొన్నా; కొట్టుకొన్నా చివరకు "భాయి, భాయి" అనుకుంటూ కాలం గడుపుకుంటూ ఉండేవాళ్లు. కావటి కుండల్లాగా ఉండేవి సఖ్యత, వైషమ్యాలు. నాజీవిజృంభణతో అది కప్పలతెక్కడి అయింది.

మాజిరిక్ కు ఉన్నశాంతం, సుహృద్భావం, సహనంలో సగం కూడ జర్మన్ నాయకుడికి ఒక్కడికిఉన్నా ఇలాంటిపరిస్థితులు ఏర్పడేవేకావు. కొంతకాలం జర్మన్లు లాభంలేదని ఏమీ చేయటం మానివేసారు. రిపబ్లిక్ ఏర్పడిన ఆరుసంవత్సరాలలో సామ, దాన దండోపాయాలను ఉపయోగించి జక్ ప్రభుత్వం జర్మన్లను ఒక వద్దుకు తెచ్చింది. కాని దాలిగుంటలో ఉన్నంతసేపేగా కుక్కబుద్ధి. ఐనా సుడేటన్ సమస్య పరిష్కారం కావల్సిఉంటే ? యితరదేశాల జోక్యము అవసరంలేదు. మొదట్లోనే చెప్పానుగా హిట్లరుకు కావాల్సింది జకోస్లోవేకియాగాని జర్మన్ సమస్యా పరిష్కారంగాదని. జకోస్లోవేకియా ఎందుకు కావాలో తరువాత విచారిద్దాం.

ప్రథమంలో అంటే 1920-21 ఆ ప్రాంతాల అప్పుడేగా మనదేశంలో గాంధిగారి నాయకత్వంక్రింద బ్రహ్మాండ

మైన సత్యాగ్రహసమరం సాగించుతూ ఉన్నాము–జకోస్లోవేకియాలో అనేక జర్మన్‌పార్టీలు ఉండేవి తరగతి భేదాలమీద ఆధారపడి కొన్ని, రాజకీయసిద్ధాంతాలమీద ఆధారపడి కొన్ని ...ఇలా బయద్దేరాయి వర్షంపడినాక పుట్టకుక్కలు బయద్దేరినట్లు. అప్పుడేవచ్చింది నాజీపార్టీ. ఆతరువాత హిట్లర్ వీళ్లనుచూచి కాపీకొట్టాడు. ఈ పార్టీకి క్రెబ్స్, జంగ్ అని ఇద్దరునాయకులు; డాక్టరు లాగ్‌మన్ జాతియ జర్మన్‌పార్టీకి నాయకుడు. 1923 ఆఖరువరకూ జక్ ప్రభుత్వాన్ని పడద్రోయటానికి అనేకవిధాలప్రయత్నాలు చేసాడు. లాభం లేకపోయింది. తుదకు 1926 లో జర్మనీ నానాజాతి సమితిలోచేరి లోకార్నో ఒడంబడిక నంగీకరించినపుడు సుడేటన్ జర్మన్‌లుకూడా మాజరిక్ ప్రభుత్వంతో రాజీపడి, కొయలిషన్ మంత్రివర్గంలో మూడు స్థానాలను పుచ్చుకున్నారు. 1935 వరకూ ప్రభుత్వంతో బాగా సహకారం చేస్తూనేవచ్చారు.

1929 తరువాతవచ్చిన ఆర్థికమాంద్యం పరిస్థితుల్ని తిరిగి తారుమారుచేసింది. జర్మన్ సోషల్ డిమోక్రాటిక్ పార్టీవారు మాత్రమే ప్రభుత్వంప్రక్కన ఉన్నారు. జాతియ, నాజీపక్షాలవారు ప్రభుత్వంమీద విపరీతమైన దుష్ప్రచారం సాగించుతూ వచ్చారు. హిట్లర్ సరిహద్దులను దాటివచ్చి తమ్ము రక్షింపనున్నాడని ప్రబోధం చేసారు. ప్రజల్లో నూతనసంచలనం బయలుదేరింది. 1933 లో హిట్లర్ పెత్తనానికిరాగానే సుడేటన్ జర్మన్లు విజృంభించారు. ప్రభుత్వం సహింపలేకపోయిందీ తిరుగుబాటును. జాతీయ, నాజీ పక్షాల్ని నిషేధించింది. 1933 అక్టోబరులో ఈరెండు పక్షాల్లోనూ చీలికలు ఏర్పడినాయి. ఆదేసమయంలో హెన్లీన్ "సుడేటన్ జర్మన్ హోమ్‌లాండ్ ఫ్రంట్" పార్టీనొకదాన్ని స్థాపించాడు. నేటి

జకోస్లోవేకియా పరిస్థితులకు ఈ మహానుభావుడే కారణం. కనుక ఈయన సంగతి కొద్దిగా విచారించుదాం.

మొదట్లో ఈయన ఒక ప్రైవేటుకంపెనీ లో గుమాస్తాగాఉండే వాడు. పదిమందితో కలసి తిరగటానికి భయపడుతూ ఏదో మూల కాలం గడుపుకునేవాడు. సరియైన దుస్తులేఉండేవికావు పాపం. 1933 వరకుఈయన జకోస్లోవేకియా వ్యవహారాలలో ఇంతటి ప్రధాన పాత్రను వహించునని ఎవ్వరూ ఊహించలేదు. జక్ పార్లమెం టులో సభ్యత్వంలేక రాజకీయ పరిజ్ఞానమేలేక, తెలివితేటలు మందంగాఉన్న ఇతడు 40 లక్షలమందికి నాయకుడు ఎలా ఐనాడా అని అందరకు ఆశ్చర్యంగానేఉంది. ముస్సోలినీకిఉన్న సైనిక స్వరూపంగాని, హిట్లర్ లోని అంతర్గర్భితమగు అగ్నిజ్వాలగాని, స్టాలిన్ లోఉన్న భీకర మొరటుతనముగాని, లేక కిండ్లర్డాలుగురించి లెక్కలమాష్టరులాగా కనపడుతూ, మాసినగుడ్డలతో ఏ మునిసిపల్ బిల్లుకలెక్టరుగానోఉండు ఇతడుమధ్య యూరప్ రాచకీయనాటకము నందు నాయకపాత్రను ఎట్లు ధరించకలిగాడు ?

దీనికంతకూ సమాధానం ఒక్కటే. మంచివక్త. ప్రచారం చేయటంలో అతన్నిమించినవాడు లేడనే చెప్పాలి. ఇదంతా చేయ టానికి తగినంతడబ్బుకూడా ఉంది. ఎక్కడ్నుంచి వస్తోందో మీరు ఊహించుకోలేరా? వీటికితోడు నక్కకున్న జిత్తులు, సమయ స్ఫూర్తి ఉంది. అన్నింటికంటె ముఖ్యం, నెపోలియన్ చెప్పినట్లు అదృష్టవంతుడు.

1933 అక్టోబరు 1 వ తేదీన రంగమునకువచ్చాడు. మొట్ట మొదట ఆనాడే ఒక దీర్ఘమైన ప్రణాళికను ప్రకటించాడు. జాతీయ

సంస్థలను, ఆర్థికస్థితిని, జర్మన్ గౌరవమును కాపాడుటకు తానొక ప్రత్యేకపక్షాన్ని ఏర్పాటు చేస్తూన్నానన్నాడు. ఇదంతా కూడా ఒక పారిశ్రామిక కర్మాగారంలో చిన్న ఉద్యోగంలో ఉండి సాగించిందే; ప్రజలు ఇతని ప్రకటనలను చదివి నవ్వుకుంటూ ఉండేవారు. కొంత కాలానికి ఈ చిన్న ఉద్యోగాన్ని మానేసి వ్యాయామశిక్షణ ఇవ్వటానికి కుదిరాడు. ప్రపంచంలో ఎక్కడ చేసినట్లే ఈ యనా వ్యాయామ శిక్షణ ద్వారా జర్మన్ నాజీ ప్రచారాన్ని సాగించాడు.

అకస్మాత్తుగా ఒకసారి చినిగిపోయిన గుడ్డలన్నిటినీ తగుల బెట్టేసి, 1921 లో మనం విదేశవస్త్రాలను తగులబెట్టినట్లే, ఏకాంత జీవితాన్ని వదిలేసి, పదిమందిలో కలవటం ప్రారంభించాడు. పార్ల మెంటులో అయనసక్షంగా 50 మంది సభ్యులు చేరారు. తరచు బెర్లిన్ లోని పెద్దపెద్ద హోటల్స్‌లో జీవితంగడుపుతూ వచ్చాడు, దోవ పోయే అల్లరిచిల్లరవాళ్లతో సంప్రదింపులు మానేసి ప్రభువులతో చెలిమి సాగించాడు.

హిట్లర్ లాగానే ఇతనికి సోషలిజం అంటేమంట. యూదులు అంటే అమితద్వేషం. కాని హిట్లర్ అధికారానికి రావటానికి లేబర్ రిపబ్లిక్ మీద ఏ అస్త్రములనైతే ఉపయోగించాడో వాటినే ఇతను తనపనిని సాధించుకోటానికి ఉపయోగించలేదు. అయినా తరచు బెర్లిన్ వెళ్లి హిట్లర్ తో సంప్రతించివస్తూ ఉండేవాడు. విసుకు విరామం లేకుండా నాజీప్రచారాన్ని సాగించుతూ ఉన్నా తనకు కుట్రలలో గాని రహస్యాలోచనలో గాని పనిలేదని ప్రకటించుతూ వచ్చాడు. హిట్లర్ అభిప్రాయాలతో చాలావరకు ఏకీభవించినా, అతనిమార్గాన్ని అనుసరించాలని ఉండేదిగాదు. ఇతనికి ఒక ప్రత్యేక వ్యక్తిత్వం

ఉండేది. జక్ సమస్య: తీవ్రరూపం దాల్చినపుడు హిట్లర్‌తో మాట్లాడ డానికిపోతే సరిగా ఆదరించలేదు. అంచేత ఇతనికి కోపంవచ్చి హిట్లర్ సంబంధాన్నే వదులుకుంటాడనికూడా అన్నారు. పూర్వం లాగానే ఏదో హోటలులోఉండి పోయాడట. అప్పటికి పరిస్థితులు ఇతని చేతుల్లోలేవు. లేకుంటే కథను కొంచెం అడ్డంగా తిప్పేవాడే.

ఇతని పార్టీ కార్యాలయం కూలీల కొంపల్లాగా ఉండేది. పాడుపడిన కొంప. విరిగిపోయిన కుర్చీలు, కొన్నింటికి మూడేకాళ్లు! జాన్‌సన్ కుర్చీలని కాబోలు అంటారు. హెన్లీన్ ఉండే ఇల్లుమాత్రం ప్రభువుల భవనాల్లాగాఉండేది, ఈభేదం పార్టీసభ్యుల్లో కొంత అసంతృప్తి కల్గించింది. పార్టీ కార్యనిర్వాహకవర్గాన్ని ఎన్నుకో టంలోకూడా తగుజాగ్రత్త వహించలేదని పార్టీసభ్యులు నిందించే వారు. హిట్లర్ చెప్పినట్లే ఇంతను సమాధానంచేస్తూ ఉండేవాడు. ఇంత అసంతృప్తిఉన్నా, హెన్లీన్‌అంటే అందరికీ ఇష్టమే. దానికి కారణం ఇతనంటే హిట్లర్‌కు మంచి నమ్మకం ఉండటమే. "హిట్లర్ దేవుడు; అతని అవతారము హెన్లీన్"; ఇదే ఇతర దేశాలలోఉన్న జర్మనుల అభిప్రాయం.

1938 సరికి హెన్లీన్‌లో విపరీతమైన మార్పువచ్చింది. 1934లో లిబరలిజం కావాలన్నాడు. ప్రజాస్వామ్య ప్రధాన సూత్రా లను అంగీకరించుతానన్నాడు. తరువాత 4 సంవత్సరాలను జాతీయ సామ్యవాదంకంటే జర్మన్‌లకు వేరుగత్యంతరం లేదన్నాడు. జర్మన్ ఆచారవ్యవహారాలు, మానసిక ప్రవృత్తికి తగింది అదేనన్నాడు.

జర్మనీలో నాజీరాజ్యంవచ్చాక ఇంక జర్మన్‌లకు పొత్తుకలప లేదు. సుడేటన్ జర్మన్‌నాయకుడు పూర్తిగా నాజీసిద్ధాంతాలనే

అంగీకరించాడు. జక్స్లను నాజీజంఅంటే అసహ్యంఉన్నా, జర్మన్లంటే కొంతసానుభూతిఉంది. జాలిపడేవారు. అంచేత వివిధదేశాలలో అవస్థలుపడుతూఉన్న జర్మనులంతా జకోస్లావేకియాలో చేరారు. శరణాలయం అయింది వారికి. ఆతిథ్యం విషయంలో ఇండియా తర్వాత, ముందు జకోస్లోవేకియాను చెప్పి ఆతరువాత ఇతరదేశాలను చెప్పాలి.

అలాగు హిట్లర్ వింతధోరణిని అవలంబించి జకోస్లోవేకియాను కబళించటానికి కారణాలను చూపెట్టుతాడు.

నిజానికి జకోస్లోవేకియాలో ఉన్న సౌకర్యాలు, స్వాతంత్ర్యం జర్మనీలోకూడా లేదు. ఈవిషయమై 1920 నుండి పారిస్‌లో జకోస్లావేకియా రాయబారిగా ఉంటూఉన్న ఓసోకీ 1936 లో ఇలావ్రాసాడు. ''జకోస్లావేకియా అల్పసంఖ్యాకులయెడ తనధర్మాన్ని నెరవేర్చకపోయి ఉంటే 1919 నుండి 1933 వరకు అంతర్జాతీయ సంఘానికి ఫిర్యాదులు పంపకుందురా ? జెక్ ప్రభుత్వాన్ని నిందించటానికి పోలెండ్, హంగరీ దేశాలుకూడా అట్లే చేసియుండవా ? అల్పసంఖ్యాకులకు అన్యాయం చేస్తోంది జకోస్లావేకియాఅని నిర్ధారణచేయటానికి. జర్మనీ నానాజాతి సమితిని ఉపయోగించుకొని ఉండేదేకదా ? అట్లుగాక పత్రికలను, రేడియోలను ఎందుకు పాడుచేయవలెను. ఈప్రచారమంతా బూటకమని ఈఅల్పసంఖ్యాకుల విషయమే వాదోపవాదముల సాగించుట ధర్మముగాదని యీస్వల్ప విషయమే రూఢిగా తెలియజేయు చున్నది. జకోస్లావేకియాలో ఉన్న సుడేటన్ జర్మనులను ఆర్థికంగా బలహీన మొనర్చుచున్నది జక్ ప్రభుత్వమని ఇటీవల విపరీతమైన ప్రచారంసాగుతూఉంది. ఈప్రచా

నానికి లెక్కల పూర్వకంగా సమాధానం చెప్పుతాను. పూర్వపు ఆస్ట్రియా-హంగరీయొక్క యంత్రాగారాల్లో మూడుభాగాలు ప్రస్తుతపుజకోస్లావేకియాకుచెందిన ప్రదేశాలలోఉన్నవి. ఈయంత్రాగారములందు తయారయ్యేవస్తువులన్నియు, పన్నులన్నమాటయే లేకుండా ఆసామ్రాజ్యమందున్న 5 కోట్ల ప్రజలకూ దొరుకుచున్నవి. ఆసామ్రాజ్యం చితికి పోయినతరువాత ఈవస్తువులను ఉపయోగించే వారి మొత్తం 5 నుండి 1½ కోట్లకు పడిపోయినది. తత్ఫలితంగా జకోస్లావేకియా వస్తువుత్పత్తిని చాలావరకు తగ్గించుకోవలసి వచ్చింది. అంచేత పారిశ్రామిక కేంద్రములకు కొంచెం దెబ్బతగిలింది. ఆప్రదేశాలలో విశేషంగా జర్మనులే ఉన్నారు. అదిదైవసంఘటనమేగాని, ఎవరు చేయాలని చేసిందికాదు.

"ఇవి ఇలాఉండగా జకోస్లావేకియాలో రిపబ్లిక్ ఏర్పడగానే, ప్రభుత్వంమీద నమ్మకంలేక సుడేటన్ జర్మనులు తమసొమ్మంతా తీసుకుపోయి జర్మన్ బ్యాంకులో దాచుకున్నారు. ఆర్థిక మాంద్యం వల్ల జర్మన్ "మార్కు" విలువ తగ్గిపోయింది. అందుచేత సుడేటన్ జర్మనులకు విపరీతంగా నష్టంవచ్చింది. దీనికి జకోస్లోవేకియా ప్రభుత్వమే కారణమా ?

"వీరికీ దూరదృష్టిలేదు. తరువాత ఆర్థిక పరిస్థితులు కొంచెం చక్కబడగానే, దురాశకుపోయి, తెలిసీ, తెలియక ఇష్టంవచ్చినట్లు అప్పులుచేసారు. కాని తరువాత పరిస్థితులు విషమించాయి, బ్యాంకులు వీరికి అప్పులివ్వటానికి భయపడినవి.

"జకోస్లావేకియా హెచ్చు ఇతరదేశములతో జరుపు వ్యాపారం మీద ఆధారపడి ఉండటంవలన, ప్రపంచ వ్యాపారదుస్థితిలో పెద్ద

దెబ్బతిన్నది. 1928 లో జకోస్లొవేకియా 2122 కోట్ల క్రౌనులు విలువగల వస్తువులను ఎగుమతిచేస్తే, 1933లో 592 కోట్ల క్రౌనుల కంటె ఎక్కువ వ్యాపారాన్ని చేయలేకపోయింది. పింగాణి, గాజు, నేత పరిశ్రమలకు అపారమైన నష్టం కలిగింది. ఈపరిశ్రమలున్న ప్రదేశాలలో నివసించిన జర్మనులకు,తదితరులకుకూడా నష్టం వచ్చింది.

జకోస్లొవేకియాలో ఉన్న సుడేటన్ జర్మనులు జక్ ప్రభుత్వం మీద గావించిన ఆరోపణలలో ఇదొకటి. కాని దీనికి బాధ్యులు ఎవరు? ప్రభుత్వంకాదని పైవిషయాలు స్పష్టము చేస్తున్నవిగదా."

పై విషయాన్ని 1936 లో వ్రాసాడు. అప్పటికింకా పరిస్థితు లంతగా విషమించలేదు. సుడేటన్ జర్మన్లంటేద్వేషంతో వ్రాసింది కాదు. ఉన్న నిజపరిస్థితులను తెలియజేసాడనుటకు ఇటీవల "యూరప్ అండ్ ది జక్స్" అనే పుస్తకంలో సుడేటన్ జర్మన్ల ఆర్థిక దుస్థితికి కారణములను పైవిధంగానే వివరించింది గ్రంథకర్త.


వీటన్నింటినీ బట్టిచూస్తే హిట్లర్ ఆక్రమణల ప్రయత్నానికి కారణాలు వేరేఉన్నవనీ, జాతీయాభివృద్ధే కాదని స్పష్టమవుతోంది. కేవలం ఈ సమస్యను తనపనిని సాధించుకోటానికి ఉపయోగించుకున్నాడు జర్మన్ నియంత. ప్రపంచంఅంతా ఎరిగికూడా కాదన లేదు.

# మధ్యయూరపులో హిట్లరు ఆశలు

హిట్లర్ జక్ ఆక్రమణకు కారణభూతమైన సుడేటన్ జర్మన్ సమస్య వట్టి బూటకం అని, హిట్లర్ చేసిన ప్రచారం అంతా పచ్చి అబద్ధాల పుట్టఅని తేలిపోయింది. హిట్లర్ వెళ్లి అక్కడ చేసేది ఏమీలేదు. ఇదివరకుచెప్పాను హిట్లర్‌కు కావాల్సింది జకోస్లోవేకియాగాని, అందులోఉన్న జర్మనులు కాదని. జకోస్లోవేకియా ఎందుకుకావాలో చెప్పతాను.

ఈ సంవత్సరం మే లో హిట్లర్, గోరింగులు కలిసి ఒక ప్రకటన చేసారు. అందులో ఉన్న ముఖ్యవిషయం ఏమిటంటే 1745 సరికి రైన్—డాన్యూబ్ కాలువ పూర్తికావాలి. అది కొత్తవిషయంకాదు. 1000 సంవత్సరాల క్రిందట షార్లమీన్ ప్రారంభించాడు, ఈరెండు నదులను కలపటానికి, కాలువను త్రవ్వటం. అప్పట్లో అతనికి అనేక ఆటంకాలు వచ్చాయి. ఇప్పుడు ఆస్ట్రియా జర్మనీ అధీనం అయిందిగనుక ఈపనిని పూర్తిచేయటం సులభమైంది. కాని దీని నిర్మాణానికి 62,500,000పౌన్లు కావాలి.

ఇంతడబ్బు ఖర్చుపెట్టి ఈకాలువను త్రవ్వకపోతేనేం అంటారు తెలియనివారు. రైన్‌నదికి దిగువున బొగ్గుగనులు ఉన్నాయి. ప్రపంచంలో ఎచ్చటాలేనన్ని సౌకర్యాలున్నాయి. పరిశ్రమాభివృద్ధికి ఇక్కడ ప్రస్తుతమున్న రహదారి సౌకర్యాలతో ఇచట తయారైన


డెన్మార్కు
బాల్టిక్ సముద్రము
లాటివియా
లిథుయేనియా
రష్యా
రష్యా
జర్మనీ
పోలాండు
యుక్రెయిన్
జెకోస్లోవాకియా
ఆస్ట్రియా
హంగేరి
రొమేనియా
స్విట్జర్లాండు
యూగోస్లేవియా
ఇటలీ
నల్ల సముద్రము
బల్గేరియా
సిరియా
మధ్యధరా సముద్రము

వస్తువుల్ని టర్కీ, బాల్కన్ రాజ్యాలకు పంపాలంటే చాలా కష్టంగా ఉంది. ఈకాలువ ఏర్పడిందంటే ఆరాజ్యాలకు చాలా చౌక ధరలకు సప్లయి చేయవచ్చు. ఇతరదేశాలేవి జర్మనీతో పోటీ చేయలేవు కూడా. పైనుండి ముడిపదార్థాలు వస్తవి. వాటిని తయారుచేసి క్రిందదేశాలకు పంపవచ్చు. 15,00 టన్నుల వస్తువులతో ఓడలు ఎలాంటి అపాయంలేకుండా ప్రయాణం చేయవచ్చు ఈ కాలువలో.

ప్రస్తుతం డాన్యూబ్ "అంతర్జాతీయ అధికారం" కిందఉంది, జర్మనీదేశం అవతలంతా. వర్సైలస్ సంధి ఫలితంగా ఎర్పడిన కమీషను దీని వ్యవహారాన్నంతా చూస్తూఉంటుంది.

రెండు సంవత్సరాల క్రితం జర్మనీ ఈ సంఘంలోనుండి విరమించుకుంది. ఆస్ట్రియాలో డాన్యూబ్ ప్రవహించినంత వరకు అంతర్జాతీయ కమీషన్‌ను హిట్లరు గుర్తించడు. ఆస్ట్రియా మరి జర్మనీ పెత్తనం క్రిందకు వచ్చేసిందిగా. డాన్యూబ్‌లో నౌకా వ్యాపారాన్ని తొమ్మిది దేశాలు పరిశీలించుతూ ఉంటవి. వాటికే దానిమీద పెత్తనం. బ్రిటన్, ఫ్రాన్సు దేశాలు ఈనది ద్వారా వ్యాపారాన్ని సాగించటం హిట్లరుకూ ఏమాత్రం ఇష్టంలేదు. వీలైనపుడల్లా ఏవో ప్రతిబంధకాలను కలిగించుతూ వచ్చాడు. ఇటీవల నౌకా వ్యాపారం ఎక్కువైంది కూడా. యుద్ధానికి పూర్వం ఉన్నదానికిప్పుడు అయిదురెట్లు ఐంది. బాల్కన్ రాజ్యాలలోగాని యూరప్ మధ్యదేశాలలోగాని సైనికసన్నాహాలు చేయటానికి బాగా ఉపయోగపడుతుంది.

ఈకాలువను పూర్తిచేసి వ్యవహారాన్ని సాగించటం అంత తేలికైన పనిగాదు. జర్మనీమాత్రం చాలా ధైర్యంగాఉంది. అంచేతనే

దానిపై అధికారంవల్ల ఉన్న దేశాలన్నింటిలోనూ తనకు అను కూలంగా ఉండే ప్రభుత్వాలను ఏర్పరచు కోటానికి ప్రయత్నం చేస్తున్నాడు. అట్టి ప్రయత్నాలలో మొదటిది ఆస్ట్రియా ఆక్రమణ; రెండవది జకోస్లోవేకియా ముట్టడి. మూడవది హంగరీతో నేస్తం; మిగిలిఉన్నవి. రుమేనియా, యుగోస్లేవియాలు. రుమేనియాతో రాయబారాలు జరుపుతూ ఉన్నాడు. వారి కవసరమగు ఆయుధ సామగ్రిని సప్లయి చేయటానికికూడా అంగీకరించాడు. యుగోస్లే వియా చాలాభాగం నాజీ అయిందనే చెప్పవచ్చు. కనుక హిట్లర్ మధ్యయూరప్‌లో పెత్తనం సంపాదించాడు. 1914 మాదిరిగా, హిట్లర్ యుద్ధానికి బయలుదేరితే 1938 లో చిన్నదేశాలు వ్యతి రేకంగా ఉండవు.

జకోస్లోవేకియా ఆక్రమణకు మరొక కారణంకూడా కనప డుతుంది. స్వీయచరిత్రలో హిట్లర్ జర్మన్ సమస్యను గురించి ఇలా వ్రాసాడు:

జర్మనీ జనాభా సంవత్సరానికి 9 లక్షలవంతున ఎక్కువవుతుంది. వీరందరకు తిండి, ఉండటానికి చోటు చూపాల్సిన భారం జర్మన్ ప్రభుత్వంపైన ఉంది. దీనికి మూడేమార్గాలు కనపడుతూ ఉన్నాయి. ప్రథమంలో జర్మనీలోని వస్తువుత్పత్తిని వృద్ధిచేసి వృథాగా ఉండి పోయిన ప్రదేశాన్ని నివాసయోగ్యంగా చేయటం. గొర్రె ఎంతపెరి గినా తోక బెత్తెడేగా. అంచేత జర్మనీ విస్తీర్ణం చాలదు. రెండవది యూరప్‌లోనే ఇతర ప్రదేశాలను ఆక్రమించుకోవాలి. మూడవది ఇతర ఖండములకుపోయి, నివాసయోగ్యమగు దేశాలను ఆక్రమించు కోవాలి. విదేశ వ్యాపారాన్ని వృద్ధిచేయాలి. ఆక్రమణ అనేసరికి యుద్ధం తప్పదు. ఎన్నో యుద్ధాలు చేస్తేగాని సామ్రాజ్య స్థాపన

సాధ్యంకాదని బ్రిటన్ మనకు చెపుతోంది. ఈవిధానాన్నే జర్మనీ అవలంబించితే బ్రిటన్‌కు కంటకంగా ఉంటుంది. (ఛేంబర్లేన్ ప్రభుత్వం ఏర్పడకముందు వ్రాసిన విషయాలెండివి.) భూమి ప్రజలది. బలంఉండి, స్వాధీనం చేసుకోగల ప్రజలదే భూదేవి. ప్రకృతికి సరిహద్దులనేవి లేవు.

"జర్మనీ విజృంభించటం మొదలెడితే ఇతరదేశాలు ఆత్మరక్షణకు దిగుతవి. సహజమే. హక్కులను, న్యాయాన్ని నిర్ణయించేది బలం, శక్తి, సామర్థ్యం. అమెరికాలాగా వ్యాపార సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకోటంలో నాకు నమ్మకంలేదు. కనుక యుద్ధం తప్పదు. అప్పుడింక రెండే ప్రశ్నలు ఉన్నవి. ఎక్కడ? ఎవరితో? యుద్ధం ఎందుకు? ఆక్రమణకా, అధీన మొనర్చుకొనుటకా?

"జర్మనీ యూరప్ వదలి వెళ్లటానికి సాధ్యంకాదు. డబ్బు చాలా కావాలి. అందేత యూరప్‌లోనే ఆక్రమణ సాగించాలి. దీనికి రష్యా అడ్డుతగులుతుంది. కనుక ఇంగ్లండ్‌తో మంచిగా ఉండి ఆదేశపు నైతిక బలాన్ని సంపాదించుకోవాలి."

ఈ ప్రయత్నంలో హిట్లర్ జయం పొందాడు. స్పెయినులో ఫ్రాంకో రాజ్య స్థాపనకు తోడ్పడకలుగుచున్నాడు. యూరప్‌లోని చిన్నదేశాలను వరుసగా ఆక్రమించుకో గలుగుతూ ఉన్నాడు.

1914 వ సంవత్సరంలో జర్మనీ ఓడిపోవటానికి గల కారణాలను కూడా హిట్లర్ ఆలోచించాడు. అప్పుడు జర్మనీకి రెండు వైపులా శత్రువులు ఉన్నారు. ఒకవైపు బ్రిటన్, ఫ్రాన్సులు; మరొకవైపున రష్యా. అప్పట్లో రష్యా క్రిందనే ఉన్నాయి జర్మనీ,

ఆస్ట్రియా, హంగరీవరకూ ఉన్న దేశాలు. జర్మన్లు జర్మనీకి ద్రోహం చేసారు. జర్మనీ ఓడిపోవటానికి గల కారణాలు ఇలాంటివే. ఆ కక్ష తీర్చుకోటంకూడా హిట్లర్ ఉద్దేశాలలో ఒకటి. అప్పుడొక ఆస్ట్రియా హంగరీ తప్ప మిగతా మధ్యయూరప్‌లో 'నా' అనేవాళ్లెవరూ లేకపోయారు జర్మనీకి. అంచేత ఓటమి తప్పిందికాదు. కనుకనే 1917, 1918 లో ఒడంబడికలుచేసి, ఉక్రెయిన్, పోలెండ్, లిథూనియా, ఫిన్‌లెండ్ దేశాలను రష్యానుండి విడదీసింది. యుద్ధంలో రష్యా ఓడిపోవుటవలన బుడాఫెస్ట్, బ్రెస్ట్-లిటోవ్స్క్ ఒడంబడికలను రష్యా అంగీకరించాల్సి వచ్చింది.


జర్మనీ దేనికో దానికోసరం, ఎప్పుడో ఒకప్పుడు యుద్ధం చేయక తప్పదు. అప్పుడు వెనుక కెయిజర్, అంతకుముందు బిస్‌మార్క్ చేసిన తప్పులే తాను చేయకూడదని హిట్లర్ ఉద్దేశం. నిజానికి ఇప్పుడు జర్మనీకి కొంత ఎక్కువ అవకాశాలున్నాయి యుద్ధంలో గెలవటానికి. మధ్యయూరప్‌లోని చిన్నదేశాలన్నీ హిట్లర్ ప లొంగినట్లే; పోలెండ్ ఒకటి మిగిలింది. రష్యాతో యుద్ధం చేయవలసి వస్తే జర్మనీకి ఈదేశం చాలా అవుసరం. అంచేతనే ఇటీవల జర్మనీలో ఉన్న పోలిష్‌యూదుల నందర్నీ తరిమివేయాలని ఉత్తరువులు జారీచేసీకూడా మళ్లీ కొంచెం తటపటాయించి పోలిష్ ప్రభుత్వంతో రాజీ సంభాషణలకు దిగాడు హిట్లర్.

హిట్లర్ ఇప్పటికి యుద్ధం చేయటానికి అవసరమైన ఏర్పాట్లన్నీ చేసుకున్నాడు. ముందు రాబోయే యుద్ధానికి జకోస్లోవేకియా చాలా అవసరం. ఆయుధాలు విపరీతంగా ఉత్పత్తిఅవుతవి. మంచివి కూడా. రుమేనియాలో కావాల్సిన నూనె వగైరాలు ఉన్నాయి. ఇంక లిథూనియా ఉంటే ఆహార పదార్థాలు అవీ దొరుకుతవి. వీట్ని సాధించటానికి హిట్లర్ ఏనాటకం ఆడాడో చూద్దాం.

# యుద్ధమా? బెదిరింపా?

వాడొక కుంటియోధుడు. కూర్చున్న చోటునుండి కదలలేడు. యుద్ధంలో కాబోలు కాలు పోయిందట. తిండికిలేదు. సంపాదించుకోటానికి సత్తాలేదు. బుర్ర ఉన్న మనిషి. 50 మంది కొయ్యమనుష్యుల్ని చేయించి వాళ్ల చేతుల్లో తుపాకులుంచి బాగా రాకపోకలు ఉన్నరోడ్డుకు 100 గజాలు దూరంలో ఉంచాడట. తాను 20 గజాల దూరంలో కూర్చొని వచ్చే పోయేవాళ్లను బెదిరించుతూ ఉండేవాడట. నేను లేచానంటేనా? నా మనుష్యుల్ని పంపానంటేనా అంటూ, అలా బెదిరించి డబ్బు సంపాదించుకునేవాడు.

హిట్లర్ మాట విన్నప్పుడల్లా నాకు చిన్నప్పుడు విన్న ఆ కథ జ్ఞాపకం వస్తూ ఉంటుంది. జర్మన్ నియంత ఏపనిచేసినా ఇలానే చేస్తూ ఉంటాడు. బూకరించి, దబాయించి కావాల్సిన వాటిని సాధించుకుంటూ ఉన్నాడు. అతనిమాట అలా చెలామణి అవుతోందికూడా. ఈవిషయంలో ముస్సోలినికంటె హిట్లరే అదృష్టవంతుడని చెప్పవచ్చు. 1935 లో 'సార్' ప్రవేశంతిరిగి ఆస్ట్రియా ఆక్రమణ, ఇటీవల గత అక్టోబరులో జకోస్లోవేకియాలో పెత్తనం అన్నీకూడా ఏమీ కష్టంలేకుండా సంపాదించుకున్నాడు. సెప్టెంబరు 23 వ తేదీన హిట్లర్ ఒకప్రకటన చేశాడు.



ఛండ శాసనుడు హిట్లరు!

"నాకు జకోస్లోవేకియా కావాలి; ఇస్తారా ఇవ్వండి. లేదా యుద్ధం తప్పదు, కావాల్సింటే మీకు మరొక హామీకూడా ఇస్తాను. ఇదే యూరపులో నా ఆఖరు కోరిక. దీన్ని అంగీకరించితే నేనింక ఎవరి జోలికి రాను. వారంరోజులు వ్యవధి ఇస్తున్నాను. ఆలోచించుకోండి."

ఆ వారంరోజులు ప్రపంచంఅంతా అట్టు ఉడికినట్లు ఉడికిపోయింది. పరిస్థితులు ఎప్పుడు విషమించుతవో, ఏనిమిషంలో యుద్ధం వస్తుందో.అని అందరూ గజ గజ లాడిపోయారు. ఛేంబర్‌లేన్ కుటిల రాజనీతి, ఫ్రాన్స్ పిరికితనం ధర్మమాఅంటూ మరొక ప్రపంచ సంగ్రామం రాకుండా పోయింది. తెల్ల కాగితంమీద అణా బిళ్ల అతికించి సంతకంచేసి ఆపైన నీఇష్టం వచ్చింది రాసుకోమన్నట్లు హిట్లర్‌కు లొంగిపోయారు ఛేంబర్‌లేన్, డలాడియర్లు. అక్టోబరు 1 వ తేదీన జయప్రదంగా హిట్లర్ జకోస్లోవేకియాలో ప్రవేశించాడు అనుకున్నపనిని అతితేలికగా సాధించాడు. అదే హిట్లర్ ధోరణి.

గత సంవత్సరము అక్టోబరులో సుడేటన్ జర్మన్ నాయకుడు హాన్లీన్ జక్ అధ్యక్షులు బెనిష్‌కు ఒక ఉత్తరం వ్రాసాడు. సుడేటన్‌లకు సంపూర్ణ స్వపరిపాలన ఇచ్చివేయాలని కోరాడు అందులో. ఆదేసమయంలో బెర్లిన్ పత్రికలు బెనిష్‌ను బెదిరించినవి. జర్మనీ బలహీనంగా ఉండి ప్రపంచానికి లొంగిఉండే రోజులు గడచిపోయిన సంగతి జకోస్లోవేకియా గుర్తించాలన్నవి. నిజానికి ఇలాంటి బెదరింపులకు అవకాశము, అవసరము లేదు. 1936 నవంబరులో జక్ ప్రధాని డా॥ హోడ్జా జర్మన్‌లను అడిగాడు, మీకేమి కావాలో చెప్పమని. వాళ్లిదివరకువలెనే సహాయనిరాకరణంచేసి ఇదమిద్ధమని ఏమీ

చెప్పలేదు. అప్పటికింకా ఆస్ట్రియా ఆక్రమణ పూర్తిగాకపోవటం వలనను సైనిక సన్నాహములు సరిగాలేవేమో అన్న అనుమానంతోను హిట్లర్ సుడేటన్‌లకు సలహా ఇవ్వలేదు. 1937 ఫిబ్రవరి 18 న సుడేటన్ జర్మన్‌ల కోరిక లన్నింటినీ అంగీకరించుతూ జక్ ప్రభుత్వం ఒక ప్రకటన చేసింది. జర్మన్ భాషలో పార్లమెంటు వ్యవహారాలను నడపటం పార్లమెంటరీ కమిటీలను ఏర్పాటుచేయటం మాత్రం సాధ్య కాదన్నది.

ఆ వ్యవహారం అంతటితో ముగిసింది. తిరిగి ఈ సంవత్సరం (1938) మార్చి 13 వ తేదీన నాజీసేనలు ఆస్ట్రియాను ఆక్రమించాయి. చాన్సెలర్ షూస్నిగ్‌ను అరెస్టుచేసారు. యూరప్ అంతా నిర్ఘాంతపోయింది. ఎప్పటిలాగానే ఎవరిమట్టుకువారు తమ ఆశ్చర్యాన్ని, దాంతోపాటు తమ నపుంసకత్వాన్ని ప్రదర్శించారు. జకోస్లొవేకియాకు మాత్రం అనుమానంగానే ఉంది. అలాంటి అనుమానాలు అందరికీ ఉన్నాయి. ఆ పరిస్థితులను గమనించి, కొంచెం ఏమరపాటులోకి నెట్టేసాడు జనరల్ గోరింగ్ మర్నాడొక ప్రకటన చేసి. జర్మనీ జకోస్లొవేకియా సరిహద్దుల్ని లొకదని హామీ ఇచ్చాడు. నిజమే-పాపం ఆతరువాతమాత్రం వాళ్లు జకోస్లొవేకియాలోనే ఆక్రమణ సాగించారు గదూ.

రష్యా ఫ్రాన్స్ దేశాలు జకోస్లొవేకియాకు ధైర్యం చెప్పినవి. జర్మనీయే యుద్ధానికి దిగితే తమ ఒడంబడికల ననుసరించి తప్పకుండా జర్మనీని ఎదిరించుతామని. రష్యామాత్రం చివరవరకూ ఆమాటమీదనే నిలబడింది. మార్చి 16 వ తేదీన బ్రిటిష్ విదేశాంగమంత్రి హాలిఫాక్స్‌కూడా కొంత మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శించాడు. జన

రల్ గోరింగ్ 14 వ తేదీన చేసిన ప్రకటనను జర్మన్ గౌరవించునట్లు చేస్తామని ప్రగల్భాలుకొట్టాడు. కాని, జకోస్లోవేకియాలో సుడెటన్ జర్మన్‌లు అల్లరచేయటం ప్రారంభించారు. స్వపరిపాలన కావాలి. ఇచ్చి తీరాల్సిందే అన్నారు హెన్లిన్ అనుచరులు. వారం రోజులతరువాత ఫ్రెంచి విదేశాంగమంత్రి పాల్ బాంకర్ తిరిగి జకోస్లోవేకియాను హామీఇస్తూ మరొకప్రకటన చేసాడు. ఆమర్నాడే మార్చి 24 వ తేదీన బ్రిటిష్ బేలతనమును తెలుపుతూ ప్రధాని ఛేంబర్లేను ఇలా మాట్లాడాడు.

"జకోస్లోవేకియాకు సైనికసహాయంచేయదు బ్రిటన్, కాని జర్మనీ యుద్ధానికిపోతేమాత్రం ఊరుకోము" ఎంత అసహ్యంగా ఉందో చూడండి ఈప్రకటన.

కథ అడ్డంతిరుగుతూఉందని గ్రహించాడు జక్ ప్రధానిహోడ్జా నిజంగా శాంతిప్రియులు కనుకనే అల్పసంఖ్యాకులకు ప్రత్యేక సౌకర్యాలను ఇవ్వటానికి ప్రభుత్వం తయారుగానే ఉందని తెలియచేసాడు. బంగారపుగుడ్లుపెట్టే బాతుమీద దృష్టిఉన్నవాళ్లకి గుడ్లలో ఉన్న బంగారం కనపడుతుందా! హెన్లిన్ "రక్షణం కాదు; మాకు కావలసింది రాజ్యం" అంటూ సమాధానమిచ్చాడు. దాంతో క్లిష్ట పరిస్థితులు ఏర్పడినవి. సుడెటన్ జర్మన్‌లు బహిరంగసభలు జరపటానికి, ప్రదర్శనములు చేయటానికి వీలులేదంటూ జక్ ప్రభుత్వం నిషేధపుటుత్తరువులను గావించింది. ఏప్రియల్ రెండవతారీఖున హెన్లిన్ హిట్లర్ దర్శనానికి పోయాడు, సలహా తీసుకోటానికి. ఈ సమావేశాన్నిగురించి ఇదివరకు కొంచెం వ్రాసాను. దాన్ని మర్చిపోకండి.

ఇంతకు జకోస్లొవేకియాకు రోజులు సరిలేవు. ఎప్రిల్ 10 వ తేదీన ఫ్రాన్స్‌లో మంత్రివర్గం మారింది.డలాడియర్ ప్రధానిఐనాడు. ఫ్రాన్స్‌దృక్పథం కొంతమార్పుచెందింది. 16 వ తేదీన ఆంగ్లో ఇటాలియన్ ఒడంబడిక జరిగింది.జకోస్లొవేకియా ప్రభుత్వం వెంటనే జర్మన్ ఖైదీలను విడుదలచేయాలని వీరిరువురు కోరారు.

పరిస్థితులు రోజులు గడచినకొద్దీ నారికేళపాకంలో పడుతూ వచ్చాయి. హిట్లర్‌ను చూచివచ్చినతరువాత హెన్లీన్ ఎప్రిల్ 24 వ తేదీన కార్ల్స్‌బాడ్‌వద్ద తమ కనీసపుకోర్కెలు వివరించాడు. అందులో ఏమితక్కువైనా సరే రాజీ కుదరదని స్పష్టపరిచాడు. ఆయనకోరినవేమిటో తెలుసుకోవాలి. ఎందుకంటే ముందు వ్యవహారాలన్నీ వీటిమీదనే ఆధారపడిఉన్నవి. పైగా ఇవి హిట్లర్ సలహామీద ఇచ్చినవి కనుక భారతీయ అల్పసంఖ్యాకుల విషయమై జిన్నాగారు 11 షరతులుకోరితే హెన్లీన్ 8 మాత్రమే కోరాడు. బుద్ధిమంతుడు ఆశకారికాదు !

సుడెటన్ జర్మన్‌లకుకూడా అన్నింట్లోనూ జక్స్‌తోపాటు సమానస్థానం ఇవ్వాలి.

సుడేటన్ జర్మన్‌లు ఏర్పరచుకున్నపార్టీ శాసనబద్ధమైనదేనని జక్ ప్రభుత్వం అంగీకరించి, ఇతర రాచకీయపార్టీలలాగానే వీరి పార్టీని గుర్తించాలి.

జర్మన్‌లు నివసించుచున్న ప్రాంతాలకు సరిహద్దుల నిర్ణయించుట అవసరము.

ఆతరువాత అట్టి ప్రాంతములో జర్మన్‌లకు సంపూర్ణ స్వాతంత్ర్యం, సర్వాధికారాలు ఇచ్చివేయాలి.

అప్పటికీ ఇతరచోట్ల మిగిలిఉన్న జర్మన్‌లకు శాసనబద్ధమైన రక్షణాలు ఇవ్వాలి.

1918 లో నష్టపడిన సుడేటన్‌లందరికీ పరిహార మివ్వాలి.

జర్మన్‌భాగములలో జర్మన్‌లుతక్క ఇతరులెవ్వరికి ఎలాంటి ఉద్యోగాలు ఉండకూడదు.

జర్మన్ జాతీయప్రచారమును చేసుకోటానికి, వారి జాతిస్వచ్ఛతను ప్రకటించుకోటానికి ఎలాంటి ఆటంకములు ఉండకూడదు.

హోసరు యింకో మాటకూడా చెప్పాడు. అదే అసలు భావి యూరప్ రాచకీయపరిణామమునకు ముఖ్యమైంది. జక్ ప్రభుత్వం నేటి విదేశాంగ రాజనీతిని మార్చుకోవాలి. అంటే రష్యాతో ఎలాంటి సంబంధాన్ని పెట్టుకోకూడదు. తరువాత సెప్టెంబరు 29 వ తేదీన మ్యూనిక్ ఒడంబడిక రహస్యంకూడా ఇదే. రష్యాను మూలకుత్రోసి, ఎవ్వరితోనూ సంబంధంలేకుండా చేయాలని.

వీటికి ప్రధాని హోడ్జా 26 వ తేదీన సమాధానం ఇచ్చాడు. ఫ్రాన్స్ బ్రిటన్‌ల వత్తిడివలన కొన్నింటిని అంగీకరించాడు.

జాతిభేదములేకుండా అందరు ప్రజల్ని సమానంగా చూస్తాము.

జాతి జనసంఖ్యనుబట్టి ప్రభుత్వోద్యోగాలలో ప్రాతినిధ్యం ఇస్తాం.

అలాగే ప్రభుత్వము చేయు నిర్మాణకార్యక్రమములకు సంబంధించిన కంట్రాక్టులు మున్నగువాటినికూడ పంచుటకు అభ్యంతరము లేదు.

ఇంక జాతులను ఇలా విభజించుతాము, నాలుగురాష్ట్రముల క్రింద:

(i) బొహీమియా:-జక్స్, జర్మన్స్

(ii) మొరేవియా-సిలీషియా, జక్స్, జర్మన్స్, పోల్స్.

(iii) స్లావేకియా-స్లోవక్స్, హంగేరియన్స్.

(iv) రుథేనియా-రుథేనియన్స్, రషియన్స్.

ఈ సందర్భంలో జకోస్లావేకియాలో ఏఏజాతివా రెందరెండ రున్నారో తెలుసుకుందాం. మంచిది. అవసరంకూడా, అసలు జకస్లావేకియా మొత్తం జనాభా 1,47,30,009 ఇందులో జక్స్ 7340000, స్లోవక్స్, 2350000, జర్మన్స్ 323,0000, మాగిట్స్ 69,0000, రుథేనియన్స్ 550,000 యూదులు 550000, పోల్స్ 80,000 ఇతరులు 50,000 విదేశీయులు 250,000.

# హెన్లీను ఆడిన నాటకం

జెకోస్లోవేకియాను బలవంతంచేసి సుడేటన్స్‌కు మరికొన్ని ప్రత్యేక రక్షణల నిప్పించుటతో బ్రిటిన్, ఫ్రాన్స్‌ల వైఖరి స్పష్టపడింది. వాతావరణం కొంత అనుకూలంగా ఉందని గ్రహించి హెన్లిన్ మే 12 వ తేదీన బెల్జియన్ విమానంలో క్రాయిడన్ విమానాశ్రయందగ్గర దిగాడు. ఇద్దరు మిత్రులువచ్చి నాజీ నమస్కారాలతో స్వాగతమిచ్చి ఒక లండన్ హోటల్‌కు తీసుకుపోయారు. మర్నాడు విన్‌స్టన్ చర్చిల్ ఇతనికి విందు ఇచ్చాడు. ఆ సందర్భంలో విదేశాంగ వ్యవహారాలపై బ్రిటిష్ ప్రధానికి సలహాదారుగా ఉండే వాన్సిటార్టును కలుసుకున్నాడు హెన్లిన్. అ తరువాత మితవాదనాయకులైన ఆర్చిబాల్డ్ సిన్‌క్లెయిర్‌ను, మరికొందరు పార్లమెంటరీ సభ్యుల్ని కలుసుకొని సుడేటన్ సమస్యను గురించి సంప్రతించాడు. హెన్లిన్‌కు ఇంగ్లీషు మాట్లాడటం సరిగా రాదు. అంచేత వాన్‌సిటార్టు తిరిగి క్లారిడ్జ్ హోటలుకు ఒక జర్మన్ భాష తెలిసిన వైమానికోద్యోగుని తీసుకుపోయి హెన్లిన్‌ను కలుసుకున్నాడు. మాల్కొం మాక్డొనాల్డును కూడా ఇతను కలుసుకొన్నాడని వదంతులు బయల్దేరినవి గాని అవన్నీ కల్పనలేనని అధికారులు ప్రకటించారు. హెన్లిన్ లండన్ ఎందుకు వచ్చాడో, కారణాలేమిటో ఎవ్వరికీ తెలియలేదు. కాని బ్రిటిష్ సహకారముతో జకస్లోవేకియా రష్యా దేశాలమధ్య ఉన్న సైనిక ఒడంబడికను రద్దుచేయించటానికి వచ్చాడని చాలామంది అభిప్రాయం అసలు హిట్లర్‌కు జకో

స్లోవేకియామీద 'కోపం' రావటానికి కారణం అదొకటి. హిట్లర్‌కు ఎర్రజండా అంటే భయం. పోలెండ్, జకోస్లోవేకియా దేశాలతో చేరి ఏనాటికైనా రష్యా మధ్యయూరప్‌లో పెత్తనం చేస్తుందేమోనని అతని బెంగ. అలాంటి పరిస్థితులు ఏర్పడితే నాజిజం నాశనమౌతుందని భీతి. పైగా ఉక్రేనియా ఆక్రమణకు రష్యాతో యుద్ధమే చేయాల్సివస్తే, ఈ రెండు దేశాలు రష్యా ప్రక్కన ఉన్నంతకాలం జర్మనీ విజయం 'గగనకుసుమమే !'

హెన్లిన్ లండన్ కార్యక్రమాన్ని పూర్తిచేసికొని ఇంటికి పోతూ మధ్య బెర్లిన్‌లో దిగి విషయాలను హిట్లర్‌కు నివేదించాడు. మరి ఆస్ట్రియాలో నాజీలు తిరుగుబాటుచేసినా, జకోస్లోవేకియాలో సుడేటన్‌లు ప్రభుత్వమును ధిక్కరించినా, మెమెల్ ఎన్నికల్లో అల్లరిచేసినా హిట్లర్ ఆజ్ఞానుసారమేగా అంచేత ఎప్పటికిప్పుడు ఆయన సలహాలను తీసుకోవటం ఆయా దేశాలలోని నాయకులకు అవసరమయింది.

హెన్లిన్ బెర్లిన్‌నుండి తిరిగిరాగానే దేశంలో కొంత అలజడి ప్రారంభమయింది. జక్ ప్రభుత్వం సైనిక సన్నాహాలను చేసింది. ఏ నిమిషంలో యుద్ధం ప్రారంభమౌతుందో అన్న భయమే ప్రపంచమంతటా. మే 21 వ తేదీన నాజీసేనలు కదలడం ప్రారంభించినవి. అసలు ఏప్రిల్ రెండవవారంలోనే కొన్ని సైనిక దళాలను సుడేటన్ ప్రాంతాలకు చేర్చి చుట్టూ ఉన్న అడవుల్లో ఉంచారు. బొహిమియా అడవులను టాయ్‌లతో నింపారు. అది గ్రహించి జకోస్లోవేకియా ప్రభుత్వం అడిగితే ఏమీలేదని బొంకారు. నిజమేననుకున్నారు జక్ మంత్రులు. అంచేతనే సైనికశాఖవారు సన్నాహాలకు అనుమతియిమ్మని ఎంత అడిగినా నిరాకరించారు మంత్రివర్గంవారు. 20 వ

తేదిన మంత్రివర్గం సమావేశమై పరిస్థితులను పరిశీలించి, అంతా 23 వ తేదీని జరుగబోయే ఎన్నికల హడావుడేనని నిర్ణయించుకొన్నారు. జర్మనీని అనవసరంగా రెచ్చకొట్టటం దేని కనేభావమే బెనిష్ ప్రభుత్వం మొదట్నుండి. కాని జర్మన్లుమాత్రం ఆదినుండి అంతర్నాటకం ఆడుతూ నేఉన్నారు. హెన్లిన్ 20,000 మంది సైనికులను ఆయత్తపరిచారు.

మే 23 ఎన్నికల సందర్భంలో సంఘర్షణలు జరిగినవి. కాని త్వరగానే శాంతి ఏర్పడింది. అయినాకూడా జర్మన్ సేనలు జక్ సరిహద్దులను అంటిపట్టుకునె ఉన్నవి-

ఎన్నికలు శాంతంగానే గడచిపోయినా జర్మన్ సేనలు కదలకుండుట అనుమానానికి కారణమైంది. ఉపేక్షించితే విఘమించుతుందని జక్ ప్రభుత్వం సైనిక సన్నాహాలు చేయాల్సిందని ఉత్తరువుచేసింది. ఒక్కపూటలో వచ్చి అంతా సైన్యంలో చేరుకున్నారు. సుడేటక్ ప్రాంతాలలోని సోషలిస్టులు, డెమోక్రాట్స్, కమ్యూనిస్టులు, జక్ ప్రభుత్వంను కొనియాడారు. నాజీపక్షీయులుమాత్రం ప్రతిసన్నాహాలు సాగించారు. దీని భావమేమని జర్మన్ విదేశాంగమంత్రి రిబెన్ ట్రాప్‌ను బ్రిటిష్ రాయబారి అడిగితే '.అనవసరంగా జక్ ప్రభుత్వం బెదురుతున్నది. ప్రజల్లో దురభిప్రాయాలను ప్రచారం చేస్తోందే కాని మరేమి లేదు. ఈ సైనిక సన్నాహాలన్నీ మామూలు ధోరణిలోవే,' అని సమాధానం ఇచ్చాడు.

హిట్లర్ సైనికసన్నాహాలుచేసి యుద్ధానికి దిగిన సందర్భం ఇంతవరకూ ఒక్కటిలేదు. పైగా అవసరం లేకపోయింది. కొడతానని బెదిరించేసరికే కాళ్లదగ్గరకు వచ్చేవారు. ఈదఫా ఆ పప్పులు ఉడకలేదు. కొడితే తిరిగి కొడతామని ధైర్యంగా జవాబిచ్చారు

జక్స్. అవసరం ఐతే ప్రజలందరూకూడా స్త్రీ పురుష భేదం లేక, చిన్న పెద్దల తారతమ్యంలేక దేశాన్ని రక్షించటానికి ప్రాణాన్ని అర్పించుతామన్నారు. హిట్లర్ తటపటాయించాడు. ఆలోచనలోకి దిగాడు. జక్సు తిరగబడితే ఫలితం ఏలా ఉంటుందో. ఐరోపామహా సంగ్రామం తెల్పినందువల్ల చెప్పకింద తేలులాగా కిక్కురమనలేదు. హిట్లరే యుద్ధంచేయాల్సివస్తే ఎలా ఉండేదో ముందు చర్చించుదాం వివరంగా.

మే 14 వ తేదిన ఎగర్ వద్ద ఇద్దరు సుడేటన్ జర్మన్‌లు మోటారుసైకిలుమీద జర్మన్ సరిహద్దు ప్రాంతంలో పోతూఉంటే జక్ పోలీసు ఉద్యోగి "ఎవరు వారు" అని అడిగాడు. వారు సమాధానం చెప్పకుండా అలాగేవెళ్లిపోతుంటే జక్ పోలీసు వాళ్లను కాల్చాడు. ఒక దెబ్బకే ఇద్దరూ చనిపోయారు,

ఇంక చూడండి జర్మన్ ఆగ్రహం. యుద్ధానికి దిగడానికి మంచి అవకాశం కలదా? వెంటనే హిట్లర్ వాళ్లని బ్రహ్మాండంగా గౌరవించాలని,జాతీయవీరుల లాగా అంత్యక్రియలు జరపాలని ఏమేమోకోరారు. జక్ ప్రభుత్వం సరేనంది. అత్యంతవైభవంగా జరిపారు. అంత్యక్రియలను, జక్ దేశంలో నాజీ ఉత్సవాలు! ఇది సుడేటన్ జర్మన్‌ల ఉత్సాహాన్ని ఇనుమడింపచేసింది. జక్ ప్రభుత్వం ఇందుకు అనుమతించటంలో పొరబాటేచేసింది. అంగీకరించకపోతే యుద్ధమే గాబోలు పర్యవసానం అని బెనిష్ అభిప్రాయపడ్డాడు. ఈ కాస్త దానికొరకు పెద్దరాద్ధాంతం దేనికనుకున్నాడు. ఆ అవకాశమే సుడేటన్స్‌కు లాభించింది.

ఆరురోజులు ప్రపంచంల్లో అంతా అట్టుడికినట్లు ఉడికిపోయింది. ఏ నిమిషంలో యుద్ధం వస్తుందో...

మే 25 నాటికి పరిస్థితులు కొంత శాంతించినవి. ఆ రాత్రే జర్మన్ ప్రభుత్వ సభ్యులు, సైనికోద్యోగులు ఇతర పారిశ్రామికులు సమావేశమై యుద్ధానికి దిగితే లాభంలేదని తేల్చుకున్నారు. కాని పోలీసుశాఖాధికారి హిట్లర్ కత్తిదూస్తూనే ఉన్నాడు. ఆస్ట్రియా ఆక్రమణలో ఈయన ప్రముఖపాత్ర వహించాడు. హిట్లర్‌కు నమ్మిన బంటు. హిట్లర్ ప్రాణాలనే ఇతడు కాపాడాలి. అంచేత ఇతని మాటంటే జర్మన్ నియంత త్రోసివేయడు. బ్రిటను జకస్లోవేకియాతో కలిసి యుద్ధానికి దిగుతుందనుకోటం వట్టిభ్రమేననికూడా తేల్చి చెప్పాడు. యుద్ధం చాలా తేలికగా. పోతుందని హిట్లరుకు ధైర్యం చెప్పాడు. కాని యుద్ధానికి దిగటంగూర్చి తీవ్ర అభిప్రాయ భేదాలు న్నాయి. అంచేతనే హిట్లర్ సాహసించలేదు. కొద్దిలో ప్రపంచ యుద్ధం తప్పింది.

# యుద్ధం యుద్ధమన్న రోజులు

జర్మన్లు ఇంత అల్లరచేసినా జెకొస్లొవేకియా ప్రభుత్వం ఎంతో సహనముతో ప్రవర్తిస్తూవచ్చింది. యుద్ధము నివారించుటకు ఎంతటి త్యాగాన్నైనా చేయటానికి సంసిద్ధంగా ఉన్నానని ప్రకటించింది. కనుకనే ప్రధాని హోడ్జా తిరిగి జూన్ 1 వ తేదీన హెన్లీన్ పక్షీయులతో రాజీపడుటకు సమ్మతము తెల్పుచు రాయబారములు సాగింప సంసిద్ధుడైనాడు. 12 వ తేదీన 350 లక్షల పౌన్లను మంజూరు చేసారు సుడేటన్ ప్రాంతములలో వ్యావసాయిక, పారిశ్రామిక అభివృద్ధికోసరం. 14 వ తేదీన అల్పసంఖ్యాకుల రక్షణ చట్టమును ఆధారముగ చేసుకొని హెన్లిన్ సూచించునట్లు రాజీ సంభాషణలు సాగించుటకు అభ్యంతరంలేదని జెక్ ప్రభుత్వం మరొక ప్రకటనగావించింది.

జకోస్లోవేకియాలో పరిస్థితులు ఇలాఉంటే హిట్లర్ అంతరంగికుల్లో ముఖ్యుడైన వీడ్‌మన్ లండన్ వెళ్లాడు. అంటే బ్రిటిష్ వైఖరి ఎలా ఉంటుందో హిట్లర్‌కు గట్టిగా తెలియలేదు. రిబెన్‌ట్రాప్ సలహాలో నమ్మకంలేదు. "జర్మనీ జకోస్లోవేకియాలో యుద్ధానికే దిగితే, ఆ యుద్ధం త్వరలోనే జర్మనీ బ్రిటన్ దేశాల మధ్య యుద్ధంగా మారుతుందని" హాలిఫాక్స్ బ్రిటన్ వైఖరిని స్పష్టీకరించటంతో హిట్లర్ గాభరాచేశాడు. తనకి తగ్గట్టుగా ప్రధాని ఛేంబర్లేన్ కూడా "బ్రిటన్ తటస్థంగా ఉంటుందని జర్మనీ భ్రమపడరాదు" అని

హెచ్చరించాడు. ఇదంతా వట్టికోతలేనో, ఇందులో ఏమైనా సత్యం ఉందో తెలుసుకోటానికి హిట్లర్ తరఫున వీడ్ మన్ లండన్ పోయాడు. మాట్లాడాల్సినవారందరితో సంప్రతించాడు. చేంబర్లేన్ అసలు సంగతిని బయటపెట్టాడు "ఒక్క జకోస్లొవేకియా కోసరం బ్రిటిష్ సామ్రాజ్యాన్నంతా యుద్ధంలోకి దింపుతానా" అన్నాడు. హిట్లర్ కు కావాల్సిందేముంది. ఇక ఫ్రాన్స్ సంగతా? ఆ అవస్థ బ్రిటిష్ విదేశాంగమంత్రి హాలిఫాక్స్ పడ్డాడు. ఫ్రాన్స్ కు ఎక్కువ సంబంధముంది జకోస్లొవేకియాతో. అంచేత ప్రేగ్ ప్రభుత్వంతో మాట్లాడి జర్మన్ కోర్కెలు అంగీకరించేలా చేయమన్నాడు ఫ్రాన్స్ కూడా తల వొగ్గింది.

వీడ్ మన్ ఇంటికిపోయి 'బ్రిటిష్ ప్రభుత్వం ఒక రాయబారిని యుద్ధంరాకుండా చేయటానికి ఏమి చేయటానికైనా సిద్ధంగా ఉన్నారని తెలిపాడు. 26 వ తేదీన చేంబర్లేన్ శాంతియుతంగానే ఈ సమస్య పరిష్కారం కావాల్సిందంటూ ఒక ప్రకటన చేసాడు.

'ఆగస్టు 3 వ తేదిన రన్సిమన్ ను పంపించారు బ్రిటిస్ మంత్రివర్గం. ఈయనకు జకోస్లొవేకియాను గురించి ఏమీ తెలియదు. అంచేత విచారణలుజరిపి నిష్పాక్షికంగా పరిష్కారం చేస్తాడని అందరూ నమ్మారు. జక్ ప్రభుత్వంకూడా సమ్మతించింది. జక్ పత్రికలు అల్పసంఖ్యాకుల రక్షణచట్టస్వరూపాన్ని ప్రకటించాయి.

జాతి, మత వివక్షతలేక అందరికి సమాన పౌరస్వత్వపుహక్కులుంటవి.

మేజరు అయిన ప్రతివ్యక్తీ తానే జాతికి సంబంధించినవాడో తెల్పవచ్చు. కాని ఆ జాతి మాట్లాడే భాషనే అతడూ మాట్లాడాలి.

ఏ తెగకుచెందింది నిర్ణయించటంలో మాట్లాడు భాషకే ప్రాధాన్యం ఇస్తారు. జర్మను భాషమాట్లాడే యూదులందరూ సుడేటను జర్మనులనే పరిగణింపబడతారు.

సివిల్ సర్వీసులో ఉద్యోగాల పంపకం, బడ్జెట్‌లో అభివృద్ధి కొరకు ధనాన్ని ప్రత్యేకించటం, ఇవన్నీ ఆయా ప్రాంతాలలోని జనాభా ననుసరించే చేస్తారు.

ప్రతి జాతి, వాళ్ల జనాభాననుసరించి పాఠశాలలనుకోరవచ్చు. అల్పసంఖ్యాకుల భాషను ప్రభుత్వంగుర్తించుతుంది కనుక కోర్టుల్లో తదితర రాజకీయ వ్యవహారాల్లో ఆ భాషనే ఉపయోగింపవచ్చు.

ఈ రక్షణలు ఏమీ చాలవన్నారు సుడేటను జర్మనులు. జక్ ప్రభుత్వం రాజకీయ వ్యవహారాల విషయంలో క్రొత్త విధానాన్ని వివరించుతూ సుడేటను జర్మన్ నాయకులకు ఉత్తరం పంపింది. అందులో ఉన్న సూచనలు ఏమిటంటే నాలుగు ప్రత్యేక శాసనసభల నిర్మించటం. ఆర్థికరక్షణ, విదేశాంగ వ్యవహారాలలో తక్క ఇతర విషయాలలో ఈ సభలకే సంపూర్ణాధికారం ఉంటుంది. వీటిలోమాత్రం పార్లమెంటుదే అంత్య నిర్ణయం. నాజీలు ఈ సూచనలను అంగీకరించుతారని జక్ ప్రభుత్వానికి నమ్మకంలేదు. ఐనప్పటికీ తప్పు తమమీద లేకుండా చేసికొన్నారు.

ఈ సమయంలో ఇతర దేశాల వైఖరి ఎలాఉందో తెలుసుకోవాలి.

సరిగా 1914 వ సంవత్సరం ఆగస్టు 4 వ తేదినే విల్ హెమ్ యుద్ధాన్ని ఆపటానికి యుద్ధాన్ని ప్రారంభించాడు. సరిగా అదే రోజున 1938లో ప్రపంచ రాజకీయవేత్తలంతా శాంతిని నిర్మూలించే శాంతిని స్థాపించటంకోసరం ప్రయత్నించుతూఉన్నారు.

బ్రిటన్‌లో రెండు కక్షలు ఏర్పడినవి. నియంతల తృష్ణను సంతృప్తిపరచటానికి ఛేంబర్లేన్ అనుసరించుతూఉన్న విధానాన్ని ఖండించేవారి సంఖ్య ఎక్కువైంది. ఫాసిస్టు విజృంభణాన్ని అరికట్టటానికితగిన చర్య తీసుకోవాలంటారు విన్స్టన్‌చర్చిల్, లాయిడ్ జార్జి, అంటోనిఈడెన్, మితవాదనాయకుడు ఆర్చిబాల్డ్ సిన్ క్లర్కు. ఇంతకంటె తీవ్రంగాఉండే సోషలిస్టులు, కమ్యూనిస్టులు, అర్లే మొ॥ స్వతంత్ర కార్మిక పక్షంవారి వైఖరి చెప్పనవసరమేలేదుగదా! ఐనా ఛేంబర్లేన్ తన పంథానే పోతూ ఉన్నాడు.

ఫ్రాన్సుస్థితి ఇండియాలోని స్థితిలాఉంది. బ్రిటన్ ఎలా చేయమంటే అలా చేయాలి. స్వతంత్రం తక్కువ. డలాడియర్ (ప్రధాని) డౌనింగ్‌స్ట్రీట్ సలహాలను త్రోసివేయడు. ప్రజల్లోమాత్రం తీవ్రమైన అసంతృప్తిఉంది. అంచేత ఛేంబర్లేన్ ఎంతచెప్పినా రష్యా నేస్తాన్ని డలాడియర్ వదులుకుంటాడని చెప్ప వీలులేదు. కాని జక్ సమస్య విషయంలో బ్రిటన్‌కే "పవర్ ఆఫ్ అటార్నీ" ఇచ్చి వేసాడు.

ఇటలీలో సామ్రాజ్య విస్తరణను గురించి తీవ్రమైన ప్రచారం జరుగుతూఉంది. అంచేత ఆంగ్లో-ఇటాలియన్ ఒడంబడికగతి ఏమానో అన్న బెంగ బ్రిటన్‌కు ఇటలీకీకూడా ఉంది (నవంబరు 17-వ తేదీ వార్తలవల్ల దీనికేమీ భంగంరాలేదని అబిసీనియా ఆక్ర

మణను (బ్రిటన్ అంగీకరించిందని తెలిసింది) ముస్సోలినీ కూడా బ్రిటన్ అంటే అంత భయంలేదు. బ్రెన్నర్‌పాస్ విషయమై జర్మన్ వైఖరి ఎలా ఉంటుందో అని భయం.

యుగస్లోవియా, రుమేనియా, గ్రీస్‌దేశాలు 1914 లో జర్మనీకి వ్యతిరేకంగానే పోరాడినవి. ఇప్పటికీ వారి వైఖరి అలాగే ఉందని చెప్పవచ్చు. కాని యుగస్లోవియా, రుమేనియా దేశాలు జర్మనీలో చేరటమే ప్రస్తుత పరిస్థితుల్లో మంచిదని తలంచకపోలేదు. గాలివాన చూచుకొని తెరచాప ఎత్తవచ్చు అనే లెక్కలో ఉన్నవి. గ్రీసు ప్రధాని మెటాక్సస్ బహిరంగంగానే జర్మన్ విజృంభణమును కోరుతూఉన్నాడు.

బల్గేరియాలో ప్రజలు జర్మన్ వలలో పడకుండా ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వం మాత్రం ఇంకేమీ స్పష్టపరచలేదు. (ఆగస్టు 4). టర్కీ బ్రిటన్‌ను అనుసరించి ఉండే సూచనలే కన్పడుతూఉన్నవి. పైగా రష్యాతో స్నేహం ఎక్కువ. జపాను-రష్యాలమధ్య సంఘర్షణలు ప్రారంభమైనపుడు జపాను రష్యామీదకుదూకితే టర్కీ ఊరుకోదని స్పష్టంచేసాడు కెమాల్.

హంగరీ నాజీ నాయకత్వాన్ని కోరుతూఉంది. జకొస్లోవేకియాలో జర్మనీకి పెత్తనంవస్తే మంచిమీద తానుకూడా కొన్ని ప్రాంతాలను సంపాదించుకోవచ్చునన్న దురాశే ఇందుకు కారణం. ముస్సోలినీ హంగరీ ప్రధాని ఇమ్రెడీని తన అదుపు ఆజ్ఞల్లోనే ఉంచుకుంటూ ఉన్నాడు.

పోలెండ్‌కూడా హంగరీవిధానాన్నే అనుసరించుతూ ఉంది. పోలెండ్‌ను సంతృప్తిపరచాల్సిన అవుసరం చాలాఉంది జర్మనీకి.

కనుకనే గత అక్టోబరులో జర్మన్ విదేశాంగమంత్రి రిబెన్‌ట్రాప్, ఇటలీ విదేశాంగమంత్రి కౌంట్ షినోలు కలిసి మరికొన్ని ప్రాంతాలను పోలెండ్, హంగరీలకు పంపకంచేసారు.

సోవియట్‌రష్యా మొదట్నుండీ 1936 వ సంవత్సరపు ఒడంబడికను గౌరవించి జక్‌పక్షాన్నే ఉంటానని స్పష్టంచేసింది. లిట్వినో లెఖ్ఖలతోకూడా చెప్పాడు జర్మనీ జకొస్లోవేకియామీదకు యుద్ధానికివస్తే రష్యా జోక్యంకలుగచేసుకోక తప్పదని, ఇంక అప్పుడు జర్మనీ పతనం ఖాయమేనని.

బెల్జియం, హాలెండ్, స్విట్జర్లండు స్కాండనేవియాలు తటస్థంగా ఉన్నవి. అమెరికాకూడా నాజీ రాజ్యవ్యాప్తిని అరికట్టాల్సిన అవసరం ఉందని హెచ్చరించింది. ఇంకా బానిసదేశాల నైతికబలం ఉంది కూడా జక్‌స్ కు.

బ్రిటన్ జోక్యంకలుగచేసుకోకుండా ఉంటే యుద్ధం తప్పేది కాదు. యుద్ధంవస్తే వివిధదేశాలు ఇలా ప్రవర్తించేవి. ఫలితం ముందు వేరే వివరంగా చర్చించుతాం.

రన్సిమన్ పాపం మధ్యంలో కండెలాగా అటూ ఇటూ తిరుగుతూ రాజీపరిష్కారానికి మహా ప్రయత్నించాడు. కాని అగస్టు 13 వ తేదీన హిట్లర్ 1,500,000 సైనికులను తయారుగా ఉంచాడు. తరువాత నాలుగురోజులకు సుడేటన్ జర్మన్లు "హెన్లిన్ చెప్పిందే మా మాట. అంతకు ఎంత తక్కువైనా మేము రాజీని అంగీకరించం" అని ఘోషపెట్టారు.

19 వ తేదీన ప్రధాని హోడ్జా విభజింపబడు నాలుగు రాష్ట్రాలకు జర్మనులనే గవర్నరులుగా నియమించుతానన్నాడు 23 వ తేదీ రన్సిమన్‌కు సుడేటన్ జర్మనులు "రాష్ట్రస్వాతంత్ర్యమే మాకు కావాలి" అని తెలిపారు.

తిరిగి 27 వ తేదీన సర్ జాన్ సైమన్ బ్రిటిష్ వైఖరిని స్పష్టం చేసాడు. జకోస్లోవేకియాపై దండెత్తితే బ్రిటను చూస్తూ ఊరుకోదన్నాడు.

30 వ తేదీన బెనిష్‌ప్రభుత్వం స్విట్జర్లండులో మాదిరిగా జిల్లాలకు ఎక్కువ అధికారం ఇస్తామని ప్రకటించింది. జర్మను ప్రకటనశాఖామంత్రి గోబెల్స్ "సుడేటన్ జర్మనీ విపత్తులో ఉంది. జక్‌ప్రజలు రక్తపాతం చేయుచున్నారు" అని ప్రకటించాడు మర్నాడే బెనిష్ సుడేటన్సుకు విస్తారమైన స్వాతంత్ర్యాన్ని ఇస్తూ ఉన్నామని ప్రకటించాడు. వీరిమాటలను వినేవారే లేకపోయారు.

ఈ క్రొత్తపరిస్థితుల్లో హిట్లర్ ఏమంటాడో కనుక్కోవలసిందని రన్సిమను హెన్లిన్‌ను బెర్లిను పంపాడు సెప్టెంబరు 1వ తేదీన తరువాత నాలుగురోజులకు సుడేటన్ జర్మన్లు తిరిగి ఆందోళన ప్రారంభించారు. "హిట్లరే మాకు కావాలి. ప్లెబిసైట్‌ద్వారానే భవిష్యత్తును నిర్ణయించాలి" అని ఆందోళన. సరిహద్దుల్లో సైనికసన్నాహాలు జరిగాయి మర్నాడు లండన్ టైమ్సుపత్రిక-ఈపత్రిక ప్రభుత్వాభిప్రాయాన్నే తెలుపుతూ ఉంటుందని ప్రతీతి. సుడేటన్ ప్రాంతాలను వదలుకోవటమే అవసరమూ.మంచిదని జక్‌ప్రభుత్వానికి సలహాఇచ్చింది. ఐతే వెంటనే విదేశాంగ కార్యాలయంవారు అది ప్రభుత్వాభిప్రాయం కాదని సవరించారు.

సెప్టెంబరు 8 వ తేదీన బ్రిటిష్, ఫ్రాన్సుమంత్రులు సంప్రదించుకున్నారు. యుద్ధానికి దిగాల్సివస్తే ఫ్రాన్సు వెనుకాడదన్నారు ఫ్రాన్సు మంత్రులు.

అందరు ఎదురుచూస్తూఉన్న సెప్టెంబరు 12 వచ్చింది. ఆనాడు హిట్లర్ న్యూరెంబర్గ్‌లో తన కార్యక్రమమును వివరించుతు ఒక దీర్ఘమైన ఉపన్యాసం చేసాడు.

# హిట్లరు యుద్ధ శంఖారావం

జెకోస్లోవేకియాలోని ప్రజాస్వామ్యప్రభుత్వం అచటిఅధికసంఖ్యాకులనే హింసించుచున్నది. అట్టి హింసలకు పాల్పబడిన వారెవరైనా అట్టి అవమానాలను సహింపక అధిక్షేపించితే వారిని చావగొట్టి హతమొనర్చుచున్నారు. జర్మనులమగు మనము దీనినిచూచి సహింపజాలము. తగిన ప్రతీకారము చేయకతప్పదు. ఈ విషయమును ఇతర దేశాలలోని రాజకీయవేత్తలు గ్రహింతురని తలుస్తాను.

“జెక్ అధ్యక్షుడు బెనిష్ అబద్ధాలను ప్రచారంచేస్తూ ఉన్నాడు. ఇటువంటి దురాగత ప్రలాపాలను ఉత్కృష్టమైన జర్మన్ ప్రభుత్వం, సహించి, మ్రింగి యూరకుండజాలదు. అ కారణంచేత మే 29 తేదిన తీవ్రమైన కొన్ని చర్యలను పూనుకున్నాను. పటాలముల బలాన్ని వృద్ధిచేశాను. జర్మనీ పశ్చిమ సరిహద్దుల్లో కోటలను, దుర్గాలను విస్తరింపచేసాను.

“డాక్టర్ బెనిష్ తంత్రోపాయాలతోనూ, రాయబారాలతోనూ కాలం పుచ్చుచున్నారు. ఈ ఆట ఇక సాగనేరదు. అచటి జర్మన్‌లకు స్వయంనిర్ణయాధికారం కావాలి. పాలస్తీనావలె జకోస్లోవేకియా తయారు కాజాలదు. అచట అరబ్బులమాదిరి మన సుడెటన్ జర్మన్లు అనాధలుకారు వీరిని రక్షించువారున్నారు. ఆ సంగతిని ప్రపంచం గ్రహించాలి.”

ఈ ఉపన్యాసం విన్నవారు ఇంకేముంది, హిట్లర్ యుద్ధానికి దిగుతాడని అనుకున్నారు. ఛేంబర్లేన్‌కు ప్రత్యేకంగా పెద్ద ఆశా భంగమే. సంవత్సర కష్టం ఊరికే నే పోయిందేఅని చాలా విచారించాడు. ఎప్పటిమాదిరిగా ఈ సారి హిట్లర్ ధిక్కరించుతూనే ఉన్నాడని 12 వ తేదిరాత్రి బ్రిటిష్ మంత్రివర్గ సమావేశములో ఎవరో అంటే ఛేంబర్లేన్ గట్టిగా మందలించాడు.

బ్రిటిష్ విదేశాంగ కార్యాలయంవారు మాత్రం సుడేటన్ ప్రాంతాలను ఆక్రమించుకోటానికి జర్మన్ నియంత నిశ్చయించుకున్నాడని అభిప్రాయపడ్డారు. అందరూ విపులంగా సైనికసన్నాహాలు సాగించారు. అలాగన్నా బెదరుతాడేమోనని ఛేంబర్లేన్ అందరికీ తెలిసేలాగా లండన్‌లో వైమానికదాడి రక్షణ మార్గాలను ఆలోచించేడు. అమలుజరిపాడు. జార్జిచక్రవర్తి నావికాదళాలన్నీ సిద్ధంగా ఉండాలని ఉత్తరువు చేసాడు. ఫ్రాన్స్ సరిహద్దుల్ని కాపుదలగా ఉంచుకొంది, బ్రిటన్ నిజంగా యుద్ధానికి దిగదనీ ఇదంతా వట్టి డాబులని రిబెన్‌ట్రాప్ హిట్లర్‌కు ధైర్యం చెప్పాడు.

న్యూరంబర్గులో హిట్లర్ ఉపన్యాసం కాగానే సుడేటనులు అల్లరులు ప్రారంభించారు. అసలు ప్లానే అది. దేశమంతటా నాజీ పతాకాలను ఎగురవేశారు. పోస్టాఫీసులమీదను, పోలీసుస్టేషనులమీదను దాడి బయలుదేరారు. జెక్ రక్షక భటులు దీనిని సహింపలేకపోయారు. కాల్పులు సాగినవి. 8 మంది సుడేటన్లు, ఒక జెక్ పౌరుడు మరణించారు. వెంటనే ప్రభుత్వం ఎనిమిది సుడేటన్ జిల్లాలలో "అవుసర పరిస్థితులు ఏర్పడినట్లు" ప్రకటించింది "ఆరుగంటల లోపుగా ఈ ఉత్తరువును రద్దుచేయాలి" అని సుడేటన్

జర్మన్ ప్రతినిధులు ప్రభుత్వానికి హెచ్చరిక పంపారు. ప్రధాని హోడ్జా ఏలాగైనా రాజీ చేసుకొంటామని, మరికొన్ని ప్రత్యేక రక్షణలనిస్తామని తెలిపారు. సుడెటన్లు వినే ధోరణిలో లేరు. ఎక్కడో తమ పార్టీ సభ్యుల్ని పోలీసులు అమానుషంగా కొరడాలతో కొట్టారని ప్రారంభించిన రాజీ సంభాషణను ఆపివేశారు.

ట్రమ్‌లో పట్టణం పరిసరాల్లో 5000 సుడెటన్లు సమావేశమై ''జకోరాజ్యం, ఒకేజాతి, ఒకే నాయకుడు'' అంటూ ఆస్ట్రియా ఆక్రమణ సందర్భంలో అచటి నాజీలు వేసిన కేకలను వేయటం సాగించారు. 15 మంది జెక్ పోలీసులు వాళ్లను నివారించటానికి ప్రయత్నించితే, జెక్ పోలీసులను తన్ని పట్టుకొని మూతుపళ్లు ఊడగొట్టారు.

సుడేటన్లు పోలీసుఅధికారిని క్రిందపడేసి నానాబాధలు పెట్టారు. కొందరు సుడేటన్ సోషలిస్టులు జకస్లోవేకియాపట్ల తమ సానుభూతిని తెలుపటానికి గాబ్లాన్జ్ వద్ద మీటింగు పెట్టటానికి ఏర్పాట్లు చేస్తూఉంటే హెన్లిన్ పక్షంవారు అల్లరిచేసి మీటింగ్ జరుగకుండా చేసారు. హల్బిన్ వద్ద ఉన్న జెక్ పాఠశాలలలోకి బాంబులను విసిరారు. రీషన్‌బర్గ్ వద్ద 3000 మంది హెన్లిన్‌లు పోలీసులమీద రాళ్లు రువ్వి కత్తులతో తిరగబడి ఎనిమిదిమందిని గాయపరచారు.


బెనిష్ ప్రజలను ఉత్సాహపరచుచు, ఆస్ట్రియా ఆహుతి యగుటకుపూర్వం షూస్నిగ్ చేసినధోరణిని, గద్గదస్వరంతో బ్రాడ్‌కాస్ట్ చేసాడు భావికార్యక్రమాన్ని గురించి. దేశమంతటా ప్రార్థనలు జరిగాయి. హెన్లిన్ మాటచెరిచాడు. ''ప్లెబిసైట్ కావాల్సిందే; సుడేటన్ ప్రాంతాలన్నీ జర్మనీలో చేరాల్సిందే.'' అని ప్రకటించాడు. 14 వ తేదిన తిరిగి హిట్లర్‌ను కలుసుకున్నాడు.

# శాంతి రాయబారాలు

ఇదంతా చూచేసరికి ఛేంబర్లేన్‌కు గాభరా పుట్టింది. ఏమిచేయటానికీ తోచక 15 వ తేదీన స్వయంగా, తన్ను తానే ఆహ్వానించుకొని హిట్లర్‌ను చూడటానికి పోయాడు. ఇంతకుముందు బ్రిటిష్ ప్రధాని ఎవ్వరుకూడా ఇలా ఆత్మగౌరవాన్ని అణచుకొని శాంతి భిక్షకు దేహీ అంటూ ఇతరుల గుమ్మాలకు పోలేదు. అందరూ అసహ్యించుకున్నారు. తన ప్రయత్నంవల్ల శాంతి ఏర్పడితే కన్సర్వేటివ్ మంత్రివర్గపు జీవితపరిమితి ఎక్కువవుతుందన్న ఆశ ఛేంబర్లేన్‌కు. పైగా అతడు పెత్తనంలోవుండగా రక్షణకొరకు చేసిన ఏర్పాట్లుకూడా తక్కువ. బ్రిటన్ యుద్ధానికి పోతే తన అసమర్థత బయల్పడుతుందేమోనని భయపడ్డాడు.

హిట్లర్‌తో సంప్రతించి అతని ఆశయాలను కనుక్కొని లండన్ వచ్చాడు. శాంతి ఏర్పడుతుందని ప్రకటించాడు. కాని ఆమర్నాడే హిట్లర్ సైన్యాన్ని తయారుచేయటం ప్రారంభించాడు.

ఫ్రెంచిప్రధాని దలాడియర్, విదేశాంగమంత్రి బానెట్ ఛేంబర్లేన్‌ను కలుసుకోటానికి లండన్ వచ్చారు. ఛేంబర్లేన్ హిట్లర్‌కు తనకు మధ్య జరిగిన సంభాషణలను వివరించాడు. యుద్ధానికి దిగటానికి తయారుగా ఉన్నాడు సుమా అని భయపెట్టాడు. దాంతో ఇద్దరు ప్రధానులుకలిసి ఒక రాజీమార్గాన్ని ఆలోచించారు.



బ్రిటిష్ ప్రధాని నెవిల్ ఛేంబర్లేన్

(1) నానాజాతి సమితి అధ్వర్యంక్రింద, నూటికి 50 మందికి పైగా జర్మన్లు ఉన్న సుడేటన్ ప్రాంతాలను జర్మనువశము చేయాలి.


(2) క్రొత్తగా ఏర్పాటుచేయు సరిహద్దుల్ని బ్రిటన్, ఫ్రాన్సు, ఇటలీ, జర్మనీదేశాలు నిర్ణయించాలి.

(3) జకోస్లోవేకియా ఇదివరకు ఇతర దేశాలతో చేసుకున్న సైనిక ఒడంబడికలను రద్దుచేసుకోవాలి. ఈమూడవషరతు ఉద్దేశ్యం ఏమిటంటే రష్యా సంబంధాన్ని జకోస్లోవేకియా పూర్తిగా వదులుకోవాలి.

ఫ్రాన్సుసంగతి గ్రహించే స్టాలిను ఒక క్రొత్తమార్గాన్ని అనుసరించుతాడని అనుకున్నారు చాలామంది. హిట్లర్‌తో ఒడంబడికచేసుకుంటే ఫ్రాన్సునిజంగా దిక్కులేని దేశమౌతుంది; అప్పుడుగాని సంగతులు తెలిసిరావని రష్యా అభిప్రాయపడిందని కొన్ని పత్రికలు ప్రకటించాయి. కాని ఇలా ఏమీ జరుగలేదు.

ఫ్రెంచి మంత్రులు ఛేంబర్లేన్ ఒత్తిడికి ఆగలేక ఒడంబడికను అంగీకరించారేగాని, తిరిగి ఇంటికివచ్చి మంత్రుల సమావేశంలో నివేదించేసరికి అందరూ మండిపడ్డారు. బ్రిటన్‌వస్తే వచ్చింది, లేకపోతేలేదు ఫ్రాన్సు జకోస్లోవేకియాలో నిలబడుతుందా లేదా అనినిలవదీసి అడిగాడు ఒకమంత్రి. డలడియర్ తెల్లబోయి, ఎటుచూచినా ఎర్రటికళ్లు కనపడేసరికి 'జకోస్లోవేకియాను ద్రోహంచేయం' అన్నాడు.

అధ్యక్షులు బెనిష్ "మీరు పునరాలోచించుకోటం మంచిది; అవసరం" అనిఫ్రాన్సు, బ్రిటనుదేశాలను హెచ్చరించాడు. ఛేంబర్లేన్




ఫ్రెంచి ప్రధాని డలాడియర్

ఒక్క దేశం కోసరం బ్రిటిష్ సామ్రాజ్యాన్ని యుద్ధంలోకి దింపకూడదన్న ధోరణిలోనే ఉన్నాడు. ఇదే సమయం అనుకొని 20వ (సెప్టెంబరు) తేదీన హంగరీ, పోలెండ్ దేశాలు వాళ్ల జాతివారున్న దేశాలను వాళ్లపరం చేయాలని కోరారు.

పోలెండ్‌తో రాజీపడితే, జర్మన్ సంధిప్రయత్నాలు విఫలమై యుద్ధం ప్రారంభమైతే రష్యాసేనలు రానటానికి అనుకూలంగా ఉంటాయి కదా అని బెనిష్ పోలిష్ కోర్కెలను తప్పకుండా మన్నించుతామన్నాడు. అంతేగాకుండా ఫ్రాన్స్, బ్రిటన్‌లు గావించిన సూచనలనుకూడా అంగీకరించుతానన్నాడు. కాని మిగిలిన జక్ దేశపు సరిహద్దుల కాపుదల విషయమై హామీ ఇవ్వాలని కోరాడు.

ఇంత శాంతిప్రయత్నం జరుగుతూఉన్నా యుద్ధభయం తగ్గలేదు. బెనిష్ 21 వ తేదిన ప్రధాని హోడ్జాను తొలగించి అంతకు పూర్వం సర్వసేనానిగా ఉన్న సిరోవీని ప్రధానమంత్రిగా ఏర్పాటు చేసాడు.

ఛేంబర్లెన్ రెండవసారి హిట్లర్‌ను కలుసుకున్నాడు. ఈసారి గాడెస్‌బర్గ్ వద్ద 21 వ తేదీన ఛేంబర్లెన్‌కు ఆశాభంగం. హిట్లర్ క్రొత్త కోర్కెలను కోరాడు. వృద్ధాప్యంలో ఉన్న ఛేంబర్లెన్‌ను అవస్థపెట్టడం దేనికని కొంచెం దగ్గరసా వచ్చాడేగాని, అసలు కోర్కెలను మాత్రం బిగించాడు. జకోస్లోవేకియా సరిహద్దుల రక్షణ గురించి ఏమీ మాట్లాడలేదు. పైగా హిరణ్యాక్షవరాలను కోరాడు. ఛేంబర్లెన్‌కు చాలా కోపం వచ్చిందట. ఆంగ్లో-ఫ్రెంచి సూచనల మీదనే రాజీ సంభాషణలు జరగాలని స్పష్టపరిస్తే, "నాకవన్నీ



జెక్కు ప్రధాని జనరల్ సిరోవి

ఏమీ తెలియవు. నాకు కావాల్సిందల్లా వెంటనే సుడేటన్ జర్మన్లందరినీ జర్మనీలో చేర్చాలి. నిర్బంధంలో ఉన్నవారందరిని ఏ షరతులూ లేక విడుదలచేయాలి. సరిహద్దు ప్రాంతాలను కాపలాకాస్తూఉన్న సైనికుల్నందర్నీ మామూలుగా జెక్ ప్రభుత్వం పిలిపించుకోవాలి"అని ఛేంబర్లన్‌ను హడలగొట్టాడు హిట్లర్. నయాన, భయాన, ప్రతిమాలి, బెదిరించి చెప్పిచూచాడు. మొత్తంమీద 7½ గంటలు ప్రసంగం జరిగింది, హిట్లర్‌తో నైతేనేమి, జర్మనీ విదేశాంగమంత్రి రిబెన్ ట్రాప్‌తో నైతేనేమి. కాని హిట్లర్ మెట్టుదిగేలా కన్పించలేదు. హిట్లర్ పంపిన 'జర్మన్ కోర్కెల' కాగితాన్ని తీసుకొని, "దాన్ని అలాగే బెనిష్‌కు పంపుతాను. వారు అంగీకరించితే సరే; లేకపోతే పర్యవసానానికి నేను బాధ్యుణ్ణిగాదు" అని ఛేంబర్లేన్ హిట్లర్‌కు చెప్పి మిగతా సలహాదారులతో లండన్ వచ్చేసాడు.

వెంటనే మంత్రివర్గాన్ని సమావేశపరచి, బాల్డ్విన్ సలహా మీద ప్రత్యేకశాఖలను ఏర్పాటుచేసి యుద్ధానికి తయారుగా కూర్చున్నట్లు కనబరచాడు. ఫ్రెంచిమంత్రులకు కబురంపాడు. వారితో సంప్రదించి హిట్లర్ కోర్కెల కాగితాన్ని బ్రిటన్‌లోని జెక్ రాయబారి మేజరిక్ ద్వారా బెనిష్‌కు పంపాడు.

అసలు జర్మనీనుండే ఒక ప్రకటనచేయదల్చుకున్నాడు, సంప్రదింపుల ఫలితాన్ని వివరిస్తూ. హిట్లర్‌నుకూడా దానిమీద సంతకం చేయుమని అడిగితే వీల్లేదనేసరికి, అలానే విడుదలచేసాడు. తిరిగి లండననుండి మరొక ప్రకటన చేసాడు. ఫ్రాన్సు యుద్ధానికి దిగితే బ్రిటన్ ఫ్రాన్సును బలపరచక తప్పదని, రెండుదేశాల సేనలను నడి


పేందుకుగాను ఫ్రెంచి సేనాపతిని బ్రిటను రప్పించి వ్యవహారాలన్నీ ముచ్చటించారు. ఫ్రాన్సుకూడా పట్టుదలగానే ఉన్నట్లు అగుపించింది. జకోస్లోవేకియాను జారవిడిచితే మంత్రులు కొందరు రాజీనామా ఇస్తామనికూడా ప్రధానికి తెలిపారు. ఈ సమయంలోనే రష్యా తన సంసిద్ధతను తెలిపింది. జక్ రక్షణకు ఫ్రాన్సు తయారుగా ఉంటే రష్యా ఎప్పటికీ వెనుకాడదని స్పష్టంచేసారు. దానికి తగినట్లుగానే పోలిష్ సైనికులు జెక్ సైనికులమీద తిరగబడేసరికి రష్యా గట్టిగా మందలించింది.

# యుద్ధం - యుద్ధం - శాంతి - శాంతి

అమెరికా, ప్రజాస్వామ్య ప్రభుత్వాలకు అపాయంకలిగే పరిస్థితులు ఏర్పడితే, చూస్తూ ఊరుకోదని కార్డెల్ హల్ ప్రకటించాడు. ఈహడావుడిఅంతా చూచే జర్మన్ సర్వసేనాని హెర్ హిట్లర్ కో సలహా ఇచ్చాడు. ఫ్రాన్సు, రష్యా, బ్రిటన్ దేశాలుకలిస్తే జర్మన్ సైన్యం ఆరు వారాల్లో నామరూపాలు లేకుండా పోతుందని. హిట్లర్ అంగీకరించకపోయేసరికి రాజీనామా ఇస్తామన్నాడు. ఇవ్వటానికి వీలు లేదన్నాడు హిట్లర్.

ఇదంతా చూచేవాళ్లకు యుద్ధంవచ్చిందనిపించింది. 1914 ఇంతకంటే చాలాసాధారణమైన పరిస్థితుల్లో యుద్ధం ప్రారంభమైంది. ఆసంగతి సందర్భాలు తెలిసినవారంతా యుద్ధం ప్రారంభమైందనే అనుకున్నారు.

24వ తేదీన హిట్లర్ మరొక ఉపన్యాసంచేస్తూ "అక్టోబరు 1వ తేదీలోగా బెనిష్ లొంగిపోవాలి. లేదా మేము వెళ్లి మా జర్మన్లను విడుదలచేస్తాము. నేనే ముందుండి, నాయకత్వంవహించి సైన్యాన్ని నడుపుతాను. మేము అన్నింటికీ సిద్ధంగా ఉన్నాము. ఇంక ఇప్పుడు తెల్సుకోవాల్సింది బెనిష్ అనికూడ హడలుకొట్టాడు జక్ ప్రభుత్వం మర్నాడే నిర్ణయం ప్రకటించింది హిట్లర్ కోర్కెలను అంగీకరించటానికి వీలు లేదని." పరీక్షాసమయంవచ్చింది. మీరంతా సిద్ధంగా


CZECH
MADE IN
BIRMINGHAM

ఉండాలి. మీపోరాటం న్యాయంకోసరం, ధర్మకోసరం, స్వాతంత్ర్యంకోసరం. జకోస్లోవేకియా చిరస్థాయిగా ఉండుగాక" అని హెచ్చరించాడు అధ్యక్షుడు. ఆరుగంటల్లో అందరూ సిద్ధమయ్యారు ఫ్రెంచిసైన్యాధికారి జనరల్ యూజీన్ ఫాషర్ జక్ సైన్యంలో చేరాడు.

అంతా తయారుగా ఉంది. రవ్వపడటమే తరువాయిగప్పన అంటుకుపోతుంది. ఫ్రాన్స్ బ్రిటనుదేశాలు ఆశలు వదులుకున్నాయి యుద్ధం ప్రారంభమైనట్లే అనుకున్నారు.

యుద్ధం...యుద్ధం...అంటూ మోగిపోతూ ఉంది ప్రపంచమంతటా. పనులు అతిత్వరితంగా జరుగుతూ ఉన్నవి. 25 వ తేదీన జక్స్ తమ అభిప్రాయాన్ని ప్రకటించంగానే 26 వ తేదిన మరొక ఉపన్యాసంచేసాడు హిట్లర్. బెనిష్‌ను ఇష్టంవచ్చినట్లు ఘూషించుతూ. నిజంగా ఆరోజుల్లో గోబెల్స్ (ప్రకటనశాఖా మంత్రిచేసిన దుష్ప్రచారానికి ఒక హద్దుపద్దూ లేదంటే నమ్మండి. ఛేంబర్లేన్ కొంచెం ధైర్యం చేసాడు. "మేము జకొస్లావేకియాకు సాయం చేస్తాం. అందులో ఏమీ అనుమానంలేదు." అని అధికారలీత్యా ఒక ప్రకటన చేయించాడు.

27 వ తేదీన ఛేంబర్లేన్ మరొక ఉపన్యాసంచేసాడు: "ఏమైనా ఉపయోగం ఉంటుందంటే మరొకసారి హిట్లర్‌ను చూడటానికి నాకేలాంటి అభ్యంతరంగానిలేదు. ఒక్క మనిషి చేయకలిగిన పనినంతా చేసాను. శాంతికొరకు చివరవరకూ కృషి చేస్తూనే ఉంటాను." ఛేంబర్లేన్ ఉపన్యాససారాంశం ఇది.

పార్లమెంటు సమావేశం జరిగింది. అన్ని వ్యవహారాలు చర్చించి తగిన ఏర్పాట్లను చేసింది బ్రిటన్. అమెరికన్ అధ్యక్షులు రూజువెల్టు హిట్లర్ కో సందేశాన్ని పంపాడు. శాంతియుతంగా సమస్యను పరిష్కరించుకోటానికే ప్రయత్నం చేయమని సైనిక సన్నాహాలను మాత్రం హిట్లర్ ఆపలేదు.

పరిస్థితులు కొంచెం మారినవి. 28 తేదీన హిట్లర్ ఒక సమావేశాన్ని ఏర్పాటు చెసాడు. మ్యూనిక్ లో ఇటలీ, బ్రిటన్, ఫ్రాన్సు దేశాలను ఆహ్వానించాడు. సైనిక సన్నాహాలను ఒక రోజుకు వాయిదా వేశాడు. శాంతి స్థాపించమంటూ రూజ్ వెల్ట్ బ్రాడ్ కాస్ట్ చేసాడు. బెనిష్ ఒడంబడికకు సిద్ధంగా ఉన్నానని సమాధానం ఇచ్చాడు.

29 వ తేది జక్ చరిత్రలో ఒక ముఖ్యదినము. ప్రపంచ చరిత్రలో నే ఒక ముఖ్యదినము. హిట్లర్, ముస్సొలోని, ఛేంబర్లీన్, డలాడియర్ లు కలసి జకస్లొవేకియా భవిష్యత్తును నిర్ణయించారు.

# నాలుగు రాజ్యాల సమావేశం

ఈ సమావేశానికి జకోస్లోవేకియా ప్రతినిధిని పిలువలేదు. వారి ఉద్దేశ్యాన్ని కనుక్కోలేదు. భారతదేశానికి 1935వ సంవత్సరపు చట్టాన్ని తయారుచేసినట్లే చేశారు. అది కొంచెం నయమే దీనికంటే కనీసం. రౌండ్ టేబిల్ సమావేశాలకు కొంతమంది భారతీయులనన్నా పిలిచారు.

ఛేంబర్లేన్ ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని జర్మనీతో ఒక ఒడంబడిక చేసుకున్నాడు జర్మనీ బ్రిటన్‌తో యుద్ధానికి రాదని. దీంతో బ్రిటన్ ఫ్రాన్స్‌లమధ్య ఇంతకుపూర్వం ఉన్న సఖ్యత కొంచెం తగ్గిందనే చెప్పాలి. కనుకనే డలాడియర్ హిట్లర్‌తో అలాంటి ఒడంబడికనే చేసుకుంటానికి ప్రయత్నం చేస్తున్నాడు. కాని హిట్లర్ అందుకు అంగీకరించటములేదు.

ఈ మ్యూనిక్ ఒడంబడిక హిట్లర్‌కు సర్వాధికారాలను ఇచ్చివేసింది మధ్యయూరప్ రాచకీయాలకు సంబంధించినంతవరకు. ఆ సమయంలోనే నానాజాతిసమితి సంఘం ఇలా తీర్మానించింది. "ఎలాగైనా శాంతిని స్థాపించి ప్రపంచాన్ని కాపాడండి."

బెనిష్‌కు ఎటుచూచినా అంధకారంలాగా ఉంది. నమ్మించి బ్రిటన్, ఫ్రాన్స్‌లు ద్రోహంచేసాయి. ఇంక యుద్ధానికి దిగితే ఒక్క రష్యామీద ఆధారపడి దిగాలి. ఫ్రాన్స్ ఇలా చేసిందంటే రష్యా బహిరంగంగా మనస్ఫూర్తిగా సహాయం చేస్తుందన్న నమ్మకం

లేదు. జక్ ప్రభుత్వం పరిస్థితుల నన్నింటినీ బాగా ఆలోచించి, వేరు గత్యంతరం లేదని నాలుగు దేశాలవారు కలిసిపెట్టిందే భిక్షగా అంగీకరించింది. యుద్ధంతెచ్చి ప్రపంచక్షోభ కల్గించేకంటే నష్టాన్ని అవమానాన్ని భరించటమే ఉత్తమం అని బెనిష్ నిశ్చయించాడు.

సెప్టెంబరు 30 వ తేదీ అర్ధరాత్రివేళ జర్మన్ సేనలు సరిహద్దులను దాటి జకోస్లోవేకియాలో ప్రవేశించాయి. జర్మన్ సోషల్ డెమోక్రాట్స్ దాదాపు 50,000 మంది జక్ ప్రాంతాలలోకి పారిపోయారు. ఒక్క తుపాకీఐనా పేల్చకుండా హిట్లర్ జక్స్‌ను జయించాడు.

“చారిత్రాత్మకమైన” ఈ మ్యూనిక్ ఒడంబడికలోని విశేషములు ఏమిటో తెలుసుకోటం చాలా అవసరం.


జర్మనీ, బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ దేశాలమధ్య 1938 వ సంవత్సరం సెప్టెంబరు 29 వ తేదీన ఒడంబడిక కుదిరినది.

ఈ ఒడంబడిక షరతులు వెంటనే జక్ ప్రభుత్వానికి పంపబడెను.

ఈ ఒడంబడిక షరతులన్నీ అమలులోనికి వచ్చునట్లు చూచే బాధ్యత నాలుగు దేశాలమీదా ఉంది.

1. సుడేటన్ ప్రాంతాలను ఖాళీ చెయ్యటము అక్టోబరు 1 వ తేదీనుండీ జరుగుతుంది.

2. ప్రస్తుతమున్న సంస్థలనుగాని, తదితరములనుగాని నాశనము చేయకుండా అక్టోబరు 10 లోగా ఖాళీచేయుడం పూర్తి అయ్యేలాగా



సరిహద్దులలో సుడేటన్ జర్మన్ల బందోబస్తు

జక్ ప్రభుత్వం పూచీపడాలి. ముగింపు విషయమై బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ దేశాలు చూడాలి.

3. ఖాళీచేయడానికి సంబంధించిన షరతులను ఒకఅంతర్జాతీయ కమిషన్ నిర్ణయిస్తుంది. ఇందులో బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ జర్మనీల ప్రతినిధులు ఉంటారు.

4. జర్మనులు అధికసంఖ్యాకులుగా ఉన్న భాగాలను జర్మన్ సైన్యములు ఆక్రమించడం అక్టోబరు 1 వ తేదీనుండీ ప్రారంభమవు తుంది. జర్మన్‌లు అధికంగాగల మిగిలిన భాగాలు పై అంతర్జాతీయ కమిషన్ నిర్ణయిస్తుంది. వాటినికూడా జర్మన్ సైన్యాలు అక్టోబరు 10 వ తేదీలోగానే ఆక్రమించుతవి.

5. ప్లెబిసైట్ జరగాల్సిన భాగాలనుకూడా ఈ అంతర్జాతీయ కమిషనే నిర్ణయిస్తుంది. అంతవరకూ అంతర్జాతీయ సైన్యాలు ఆక్ర మించి ఉంటవి ఆ ప్రాంతాలను. నవంబరు ఆఖరులోగా ఇదంతా జరగాలి.

6. సరిహద్దులను చివరకు నిర్ణయిస్తుంది. ప్లెబిసైటు లేకుండా ట్రాన్స్ఫరు చేయాలిసిన భాగాలను ఈ కమిషన్ జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీదేశాలకు సిఫార్సు చేస్తుంది.

7. ట్రాన్స్ఫరు పొందడం, మానడం నిశ్చయించుకునే హక్కు ప్రజలకు ఉంటుంది. ఇది ఆరు నెలలలోగా నిర్ణయంకావాలి. ఈ విష యమై జక్, జర్మన్ కమిషన్ పర్యాలోచిస్తుంది. ట్రాన్స్ఫరుకు అనువైన మార్గాలను, దానిపై బయలుదేరే సమస్యల పరిష్కారమునే నిర్ణయిస్తుంది ఈ కమిషన్.

8. ఈ ఒడంబడిక తారీఖునుండి నాలుగు వారాలలోపుగా విడుదల పొందదలచుకొన్న సుడేటను జర్మనులను జక్ ప్రభుత్వం తమ సైనిక రాజకీయ దళాలనుండి విడుదలచేయాలి. రాచకీయ నేరాలకు శిక్షను అనుభవించుతూఉన్న సుడేటను జర్మనులనుకూడా ఈ వ్యవధిలోపుననే విడుదలచేయాలి.

అనుబంధంగా మరినాలుగు షరతులున్నవి.

1. బ్రిటను ఫ్రెంచి ప్రభుత్వాలు ఈ ఒడంబడికకు బాధ్యులు కావటానికి 19 వ తేదీన తాము చేసిన సూచనల ప్రకారం క్రొత్త జక్కోస్లావేకియా సరిహద్దులకు కారణం లేక భంగం కలుగనట్లు అంతర్జాతీయ రక్షణ జరగాలి.

2 ట్రాన్సుఫరుకు సంబంధించిన సమస్యలన్నీ అంతర్జాతీయ కమీషను చూసుకోటానికే అవకాశం ఉండాలి.

3. జక్కోస్లావేకియాలోని పోలిష్ హంగేరియను అల్పసంఖ్యాకుల సమస్యకూడా త్వ స్త్రికరంగా పరిష్కారం అయినపిమ్మట జర్మనీ, ఇటలీలు జక్కోస్లావేకియాకు హామీ ఇస్తవి.

4. ఆయా ప్రభుత్వాల సమ్మతిమీద పోలిష్ హంగేరియను అల్పసంఖ్యాకుల సమస్య మూడు నెలలలోగా పరిష్కారం కాకపోతే మళ్లీ ఈవిషయమై ఇప్పటివలె నాలుగు రాజ్యాల సమావేశం జరుగుతుంది.

హంగేరియను సమస్య నాలుగు రాజ్యాల సమావేశం అనంతరం పరిష్కారం అయింది. కౌంట్ షియానో (ఇటలీ విదేశాంగమంత్రి)

వాన్ రిబెన్‌ట్రాప్ (జర్మనీ విదేశాంగమంత్రి) వీరిద్దరు కలసి జకోస్లో వేకియాలోని మరికొంత భాగాన్ని హంగరీకి కట్టబెట్టారు. 10 లక్షల జనాభా, స్లోవేకియాకు దక్షిణంగా ఉన్న ప్రాంతంలో 260 మైళ్ల పొడవు, 40 మైళ్ల వెడల్పుగల భాగం జకోస్లోవేకియానుండి పోయింది. హంగరీ కోరిన అయిదు పట్టణాలకుగాను మూడింటిని మాత్రమే ఇచ్చారు. ఐనాకూడా మ్యూనిక్ ఒడంబడిక సూత్రములనుబట్టి చూస్తే హంగరీకి న్యాయంగా చెందాల్సిన భాగానికంటే ఎక్కువే ముట్టిందని స్పష్టపడుతుంది. ఇటలీ-జర్మనీ తీర్పుప్రకారం నవంబరు 5 మొదలు అయిదురోజుల్లో జక్ సైన్యం ఆప్రాంతాన్ని ఖాళీచేయాల్సి ఉంది. అలానే జరిగింది. ఇలానే టీషన్ జిల్లాని పోలిష్ ప్రభుత్వానికి సంక్రమిస్తుంది. స్లోవక్ రాష్ట్రీ స్వాతంత్ర్యాన్ని ఇచ్చివేయటానికి శాసనము చేస్తూఉంది జక్ ప్రభుత్వం. చివరకు ఒక్కొక్క జిల్లా ఒక్కొక ప్రత్యేక దేశంక్రింద మారిపోయింది. మధ్యయూరప్‌లో చిన్నదేశాల సంయుక్త సంఘటనకింక అవకాశం లేదనే చెప్పాలి. జర్మనీ, ఇటలీ దేశాలు చెప్పినట్లే ఈ దేశాలన్నీ నడుచుకుంటవి. హిట్లర్ త్వరలోనే యుక్రేనియాలో కొంతభాగాన్ని, లిథూనియాలో కొంతభాగాన్ని, బెల్జియంలో కొంతభాగాన్ని ఆక్రమించటానికి ప్రారంభించవచ్చు.

మ్యూనిచ్ ఒడంబడికకుపూర్వం "నాకు జకోస్లోవేకియా ఇచ్చివేస్తే చాలు నేనింక యుద్ధంగురించి మాట్లాడను" అన్నాడు హిట్లర్. ఆ ఒడంబడిక పూర్తి ఐన మర్నాడునుంచే మొదలెట్టాడు "వలస రాజ్యాలు, వలసరాజ్యాలు" అని. బ్రిట్టను, ఫ్రాన్సుల ఈ వలస రాజ్యాల సమస్య విషయమై కొంచెం పట్టుదలగానే ఉన్నారు. బ్రిటిష్ ప్రధాని నవంబరు మధ్యలో కామన్సు సభా సమావేశంలో ఆ సంగతిని స్పష్టం చేసాడు. ఐతే మరి యుద్ధం తప్పదా?

# బ్రిటిష్ ప్రధాని ద్రోహం !

జెకోస్లోవేకియాకు ద్రోహం జరిగింది. బ్రిటను ఫాసిస్టు రాజ్యాలకు లొంగిపోయింది. అంతేగాదు నేటి బ్రిటిష్ మంత్రివర్గం ఫాసిస్టు విధానాన్నే అనుసరించుతూఉంది. ఛేంబర్లేను ఆదినుండి అంతంవరకూ అబద్ధాలతోనే ప్రపంచాన్ని మోసంచేసాడు. సెప్టెంబరు రెండవ వారంలో బ్రిటిష్ ప్రధాని హిట్లరును చూడటానికి వెళ్లకపూర్వం, అన్నిదేశాలు, పోలెండ్, హంగరీలు సహా, జర్మనీవాడిని ప్రతిఘటించటానికి సిద్ధంగాఉన్నాయి. ఎప్పుడైతే ఛేంబర్లేను హిట్లరుకు సుడేటను ప్రాంతాలను వ్రాసిఇచ్చాడో వివిధ దేశాల వైఖరి మారిపోయింది. బ్రిటన్ను నమ్ముకొని యుద్ధానికి దిగడంఅంటే ఎద్దుతోక పట్టుకుని ఏరు దాటటంలాగా ఉంటుందనుకున్నారు. వెంటనే జర్మనీలో చేరిపోయినాయి చిన్నదేశాలన్నీ.

ఛేంబర్లేను ఈ వ్యవహారాల్లో ఎంత నిర్భయంగా అబద్ధాలు ఆడుతూవచ్చాడో చూడండి. తాను హిట్లర్ సూచనలను అంగీకరించలేదన్నాడు. పోనీ అలాగే హిట్లర్ కు చెప్పాడనుకుందాం. ఇక్కడే హిట్లర్ బ్రిటిష్ ప్రధానికో క్రొత్త రాజనీతి నేర్పాడు.

గాడిస్ బర్గ్ సూచనలను అంగీకరించినట్లు వేషంవేసుకొని లండనులో దిగినాడు. ప్రపంచం అంతా ఉడికిపోతూఉంది, హిట్లర్ గడువులోని ఆరురోజులూ అయిపోతూఉంటే. వెంటనే బ్రిటన్ ఫ్రాన్స్ దేశాలలో మంత్రివర్గ సమావేశాలు ప్రారంభమైనాయి. సైనికోద్యోగుల సలహాలనుకూడా తీసుకున్నారు. రష్యా స్పష్టంగా చెప్పింది జర్మనీతో యుద్ధం చేయాల్సివస్తే ఏమీ వెనుకాడం అని.

బ్రిటనులో సైనికసన్నాహాలు ప్రారంభమైనాయి. అవి మామూలు ధోరణిలో లేవు. అంతా అదొక రకంగా ఉంది నావికా దళం కదలలేదు. ఇతర సైనికదళాలు ఎక్కడున్నవో అక్కడే ఉన్నాయి విమానదాడినుండి రక్షణల నేర్పాటుచేయటం సాగించారు. అందరికీ హడలు పుట్టుకొచ్చింది. ఇంకేముంది యుద్ధం వచ్చి పడిందనే అనుకున్నారు.

తిరిగి బ్రిటిష్ మంత్రివర్గ సమావేశం జరిగింది. మంత్రుల్లో చాలామంది హిట్లరు లొంగిపోవటానికి వీలులేదన్నారు. నావికా దళాన్ని ఆయత్తపరుస్తానన్నాడు డఫ్ కూపరు. అవసరం లేదన్నట్లు చెప్పాడు ఛేంబర్లేను. ఈ రహస్యం కనుక్కునే డఫ్ కూపరు తరువాత తన "అడ్మిరాలిటీ" పనికి రాజీనామా ఇచ్చాడు. సైన్యాలను తయారుచేయటానికి బదులు, విమానదాడినుండి రక్షణ మార్గాలను ఆలోచించటంలో అగ్రంపమిటో గ్రహించాలి.

ఇది ఇలా ఉండగా క్రొత్త ప్రచారాన్ని సాగించారు. ఫ్రాన్సు, బ్రిటను, రష్యా సేనలన్నీ కలిసినా జర్మనీసేనను ఎదిరించలేవన్నారు. కనుక హిట్లరుకు లొంగక తప్పదు అన్న అభిప్రాయాన్ని ప్రచారం చేసారు. ఎవరు పుట్టించారో...ఎక్కడ బయలుదేరిందో ...వివరంగా చెప్పవలెనా ?

హిట్లరు పెట్టిన గడువు దగ్గరకొచ్చేసరికి, అధికారులు ఒకప్రకటన చేసారు. బ్రిటన్‌లో విమానదాడి రక్షణ సన్నాహాలు సంతృప్తికరంగా లేవని, ఫ్రాన్స్‌కు తగినంత ఆయుధ ప్రతిపత్తి లేదని, రష్యా వైమానిక దళ బలం, అంతఃకలహాలవలన తగ్గిపోయిందని......

బ్రిటిష్ సన్నాహాలు సంతృప్తికరంగా లేదనే అనుకుందాం. ఐతే మంత్రివర్గం ఈ మూడు సంవత్సరాలనుంచీ ఏమిచేస్తోంది? ఎప్పు



యుద్ధానికి సిద్ధమైన జక్కు వీరుడు

హా ఆయుధ ఉత్పత్తికార్యములందే నిమగ్నులై ఉన్నట్లు కనపడు తూవచ్చారు మంత్రులు. నిజానికి బ్రిటిష్ వైమానికదళం అంత పనికిమాలిందిగాలేదు. బ్రిటన్‌కు ఉన్నంత వైమానికబలం ప్రపంచంలో ఏదేశానికీ లేదని నిపుణులే అభిప్రాయపడ్డారట. కనుక లండన్ బ్రిటిష్ బాంబులకు ఆహుతి ఐపోతుందన్న ప్రచారంలో ఏమీ నిజంలేదు అన్నాడు జాన్‌స్ట్రాచీ.

ఏఒక్క దేశపు వైమానికదళంగాని జర్మనీ విమానాలకు సరితూగకపోవచ్చుగాని బ్రిటిన్, ఫ్రాన్స్. జకోస్లోవేకియాల దళాలు మూడు కలిస్తే జర్మనీదళం సోదిలోకికూడా గాకుండా పోతుందని గట్టిగా చెప్పచ్చు.

రైన్‌లాండ్‌లో ఉన్న జర్మను సేనలను నాలుగురోజుల్లో నామరూపాలులేకుండా చేసివేయగలదు ఫ్రెంచి సైన్యం అని ఇంతకు పూర్వం ఫ్రెంచిసేనాని గావించిన ప్రకటనను మరచిపోవటానికి వీలులేదు. ఫ్రాన్స్‌కు తగినంత ఆర్థిక ప్రతిపత్తి లేదనటములో అర్థము లేదు.

రష్యా వైమానికదళం ఒక్కటే జర్మనీ, జపాన్ దేశాల రెండింటినీ కలిపికొట్టగలదు. అసలు సంగతులు ఇవి.

సత్యాన్ని మభ్యపరచి, పచ్చి అబద్ధాలాడి బ్రిటిష్ ప్రజలను మోసగించాడు, జక్స్‌కు ద్రోహం చేశాడు.

అలాగాక హిట్లర్‌కు తగినట్లు సమాధానమే చెప్పిఉంటే... జర్మనీ జకోస్లోవేకియాతో యుద్ధానికే దిగిఉంటే పరిస్థితులు మరోక విధంగా ఉండేవి. జర్మనీ యుద్ధంచేయటానికి తగిన పరిస్థితుల్లో

లేదని సర్వసేనాని హిట్లర్‌కు తెలియపరచాడు. గోరింగ్‌కూడా ఆర్థిక పరిస్థితులు అంత అనుకూలంగా లేవని రహస్యంగా హిట్లర్‌కు నివేదించాడు. నిజంగా జర్మనీ యుద్ధానికి దిగిఉంటే "నాజీ రాజ్యం" కూలిపోయేదే. జక్స్లకు స్కోడా ఫ్యాక్టరీ ఉంది. ఇదే ప్రపంచంలోని చాలా దేశాలకు ఆయుధాలను సప్లయిచేస్తుంది, పైగా జెక్ సైనికులు మహా గట్టివాళ్లు. వీటికితోడు ఫ్రాన్స్. రష్యా, బ్రిటన్ దేశాలబల: అప్పుడు పోలెండ్, హంగరీలుకూడా జకోస్లొవేకియానే బలపరచేవి. ఇటలీ బాగా సహకారం చేసేదికాదు జర్మనీకి. ఇద్దరూ కలసినా ప్రపంచంఅంతా ఒకటైతే ఏమిచేయగలరు? ఫాసిస్టు పతనాన్ని నివారించాడు. బ్రిటిష్ ప్రధాని ఛేంబర్లేన్. ఫలితాన్ని త్వరలోనే అనుభవించుతాడు!

జకోస్లోవేకియాను జయించటంతో సంతృప్తి చెందలేదు హిట్లర్. బెనిష్ రాజీనామా ఇవ్వాలన్నాడు. జర్మనీకి అనుకూలంగా ఉండే మంత్రివర్గం ఏర్పడాలన్నాడు. లేకపోతే పోలెండ్, హంగరీలకు ఎక్కువ భాగాలను కట్టిపెటతామని బెదిరించాడు. ఊపిరి తిరగకుండా ప్రచారం సాగించాడు. బెనిష్‌కొంచెం దూరదృష్టి కలిగి వెంటనే అక్టోబరు 5 వ తేదీన అధ్యక్షపదవికి రాజీనామా ఇచ్చివేసాడు. అప్పటికి ప్రధానిగా ఉన్న జనరల్ సిరోవి అధ్యక్షుడైనాడు. ఆరుమాసాలవరకు ఈయనే అధ్యక్షులుగా ఉన్నారన్నారు. కాని ఈయన ప్రభుత్వంకూడా పనికిరాదంటూ జర్మన్ పత్రికలు విమర్శించుతూ ఉన్నాయి. జర్మనీకి పూర్తిగా అనుకూలంగా ఉండే ప్రభుత్వానికి దేశాన్ని వదలివేయటానికి ఏమీఅభ్యంతరం లేదన్నాడు సిరోవి.

# జర్మను దురంతాలు

మంత్రివర్గాలు మారేవరకు ఓపిక లేకుండా ఉంది జర్మన్‌లకు. అప్పుడే ప్రారంభమైనవి...హత్యలు...దోపిడి...దేశంనుండి వెళ్లగొట్టటం. నవంబరు 20 వ తేదీనే బాటా అనే ఒక జక్ పారిశ్రామికుని అరెస్టుచేసి...కొంతకాలం నిర్బంధంలో ఉంచి తరువాత విడుదలచేశారు.

ప్రేగ్ నుండి వచ్చేవార్తలు గుండెలను జలదరింపచేస్తూఉన్నవి. రాత్రింబగళ్లు తుపాకీ కాల్పుల మోతలే వినబడుతూఉన్నవట. సోషల్ డెమోక్రాట్లు, సోషలిస్టులు, కమ్యూనిస్టుల పట్టీని తయారు చేసి వార్నందర్నీ నానాబాధలు పెడుతూ ఉన్నారట. ఒక లక్ష మందికి పైగా నాజీ అత్యాచారాలను సహించలేక, బాధలను భరించలేక జక్ పట్టణాల్లోకి చేరుతూఉన్నారు. కాని ప్రభుత్వం, జర్మనీ ఏమంటుందో అని భయపడి, ప్లెబిసైట్ వ్యవహారం పూర్తిఅయ్యే వరకు ఉన్న చోటే ఉండి వోట్లివ్వమని పంపివేస్తూ ఉన్నారు.

ఇళ్లల్లోనుంచి బయటకుఈడ్చి ఇళ్లను తగులబెడుతూఉన్నారు. కార్లల్లో పోయేవాళ్లని కాల్చివేస్తున్నారు. హెన్లిన్ పక్షంవారు మరీ ఘోరంగా ప్రవర్తించుతూ ఉన్నారు. తప్పత్రాగి ఇళ్లల్లోకి పోయి అమానుషంగా ప్రవర్తించుతూ ఉన్నారు.

ప్రేగ్ నగరవీథుల్లో బిచ్చమెత్తుకుంటూ ఉన్న స్త్రీ ఇలా నివేదించింది.

“నా భర్త సుడేటన్ డెమోక్రాట్. నాకు ముగ్గురు పిల్లలున్నారు. మేము అయిదుగురం ఇంట్లోఉండగా హెన్లిన్ పక్షం వారు వచ్చి భర్తను బయటకీడ్చి మా ఎదుటనే కాల్చి చంపారు.”

ఈ దారుణాలను గురించి లండన్ న్యూస్ క్రానికల్ పత్రిక ప్రకటించిన వివరాలు చూడండి.

నేడు జకోస్లోవేకియా ప్రజల స్థితిని వర్ణించటము చాలా కష్టం. ప్రేగ్ పట్టణం విచారగ్రస్తమై ఉంది. ఎప్పటికప్పుడు తమ దేశస్థితిని గురించి ఆలోచించుకుంటూ ఉన్నారు. ఏఏ క్రొత్త భాగాలు జర్మనీ వశమగుచున్నవో తెలుసుకోవటానికి ఆతురపడు చున్నారు.

రోజులు గడచినకొద్దీ వాళ్లస్థితి మరీ దుర్భరమౌతూఉంది. అంతర్జాతీయ కమీషన్ జర్మనీ కోరకలను కళ్లుమూసుకొని అంగీక రించి వేస్తూఉంది. హంగరీకి కొంతభాగాన్ని ఇచ్చివేశారు. జక్ కస్టమ్స్ యూనియన్‌ను జర్మన్ ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ముఖ్యమైన రైలుమార్గాన్ని వశపరచుకుంది. ఇంత దారుణంగా ఉన్నా జక్ ప్రజలు చాలా శాంతంగా ఉన్నారు.

జర్మనీక్రిందకు చేరిన ప్రదేశములో దాదాపు ८50,000 మంది జక్స్ ఉన్నట్లు తెలుస్తుంది. ఇందులో 100,000 జక్ ప్రభుత్వో ద్యోగులే. వీళ్లందరూ జర్మన్ అధికారులకు లొంగిపోవాలి. పెత్త నాన్ని వాళ్లకిచ్చి ప్రేగ్‌కు పోవాలి. మిగిలినవారిలో కనీసం 600,000 మంది జక్ ప్రాంతాలకు పోవాలి మ్యూనిక్ ఒడంబడిక ప్రకారం వీరందరికీ జక్ ప్రభుత్వం జీవనాధారాలను కల్పించాలి. వీళ్లు గాక నాజీ విధానాన్ని అంగీకరించనివారు 3 లక్షలమంది ఉన్నారు సుడేటన్ ప్రాంతాలలో. వీరంతా ఇళ్లనువదలి రక్షణకొరకు ప్రేగ్ పట్టణానికి పారిపోయారు. కాని జర్మనీకి కోపంవస్తుందేమోనని వీరి నందరినీ తిప్పిపంపుతున్నది జక్ ప్రభుత్వం.



నాజీతత్వంకిట్టని సుడేటన్లు, సుడేటనుప్రాంతాలు ఖాళీ చేస్తున్నారు

యూరప్‌లో హింసింపబడుతూ ఉన్న జనాభాకు శరణాలయంగా ఉంటూ ఉన్న జకోస్లోవేకియా... ఈరోజున తన ప్రజలకే రక్షణ ఇవ్వలేకుండా ఉంది.

మరొక పత్రిక ఈ క్రింది వివరాలను ప్రకటించింది.

మ్యూనిక్ ఒడంబడిక వార్త విన్నప్పుడు ప్రజల్లో కలిగిన మార్పు ఎలా ఉందో చూడండి.

"నాభార్య చావ సిద్ధమైంది." "ప్రాత్తికమఫులో పొడిచిన ట్లనిపించింది." "సైనిక శాఖాధికారులు ఆవురుమన్నారు."

పగలు వీధుల్లో తిరగటానికి భయపడుతూ ఉన్నారు ప్రజలు. సంతోషంగాఉన్న ముఖం ఒక్కటి కనపడదు. స్త్రీల వక్షస్థలాలలో స్వస్తికాగుర్తులను కాలుస్తున్నారు. ఎనిమిది నెల్లుంటవి, ఆపిల్ల ముఖాన కాల్చారు స్వస్తికగుర్తు.

ఇవి కొన్ని దారుణాలు. హిట్లర్ చేసే ఘోరాలకు అంతుండదు. ఇవిచాలక జక్ ప్రభుత్వ సభ్యులుకూడా మారాలన్నాడు. తమకు అనుకూలంగా ఉండే అధ్యక్షుడు రావాలన్నాడు.

నవంబరు 30 వ తేదీన ఎన్నికలు జరిగాయి. క్రొత్త అధ్యక్షుణ్ణి ఎన్నుకున్నారు. ఒక ప్రొఫెసరు ఆయన. డాక్టర్ హాచా. ఇంతవరకూ అధ్యక్షులుగాఉన్న సిరోవి తిరిగి రక్షణశాఖామంత్రి ఐనాడు. అంతకుపూర్వం సర్వసేనానిగా ఉంటూ ఉండేవాడు. జకోస్లోవేకియా క్రొత్తమంత్రివర్గంలో [illegible] చాలామంది ఉన్నారు.

ఈ మంత్రివర్గానికి నాజీవాసనలు వున్నట్టు స్పష్టపడింది.

ఇది సహించలేకనే, యేమో, లండనులో జక్కు రాయబారిగాఉన్న జాన్ మాజరిక్ తనపదవికి డిశంబరు 5 వ తేదీని రాజీ

నామా యిచ్చేడు. ఇతడు, జక్లోస్లోవేకియా రిపబ్లిక మూలపురుషుడు అయిన మేజరిక్ కుమారుడు.

జర్మన్ దాడిని తట్టుకోలేక జక్స్ ఇలా అల్లాడుతూఉంటే మధ్యలో పోల్స్ (పోలీష్ దేశీయులు) ఒక సరిహద్దుసంఘర్షణను జరిపారు. అదృష్టవశాత్తు అది శృతిమించలేదు.

నేడు జకోస్లోవేకియా జర్మనీకి ఒక బానిసదేశంగానే మారి పోయింది. హిట్లర్‌కు నచ్చని పనిచేస్తే ఎక్కడయుద్ధానికి దిగుతానంటాడో నన్న భయం ప్రజలను, ప్రభుత్వాన్నికూడా వేధించుతూనే ఉంది.

జకొస్లోవేకియా లొంగిపోయినంత మాత్రాన ఐరోపా సంగ్రామం ఆగిపోయిందనటానికి వీలులేదు. హిట్లర్ వలసరాజ్యాల ఆందోళన సాగించాడు. బ్రిటన్‌గురించి చాలా అసహ్యమైన ప్రచారం చేస్తూఉన్నాడు. యూదుల హింసించుతూ ప్రపంచ ఆగ్రహానికి గురిఐనాడు. తిరిగి మామూలు పరిస్థితులే ఏర్పడినవి. బ్రిటన్ వలస రాజ్యాలలో ఒక్క అంగుళాన్నైనా ఇవ్వనంటున్నవి. ఈ విషయాన్ని చేంబర్లేన్ పదేపదే పార్లమెంట్‌లో స్పష్టంచేస్తూఉన్నాడు.

కాని యూరప్ పరిస్థితులు నిమిష నిమిషానికి మారుతూ ఉన్నవి. ఫ్రాన్స్, జర్మనీలకు మధ్య రాజీ కుదిరేసరికి ముస్సోలినీ ఫ్రాన్స్‌మీద తిరగబడ్డాడు. టునీసియాలో డిశంబరు మొదటి వారంలో ఫ్రాన్స్‌కు ప్రతికూల ప్రదర్శనాలు బ్రహ్మాండంగా జరిగాయి. ఫ్రెంచి రాయబారి ఆవిషయం గురించి ఇటలీ విదేశాంగ మంత్రిని అడిగితే ప్రభుత్వానికి వాటితో ఏమీ సంబంధం లేదన్నాడే తప్ప ని తగిన చర్య తీసుకుంటానని అనలేదు.

హిట్లర్ దృష్టి లితూనియా మీదకు మరలింది. మెమెల్ అల్లరులను బాగా ప్రోత్సహించుతూ ఉంది జర్మన్ ప్రభుత్వం. అమెరికా విపరీతంగా ఆయుధ ప్రతిపత్తిని ఎక్కువ చేసుకుంటూ ఉంది. బ్రిటన్ కూడా వైమానికదళాభివృద్ధి గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పని చేస్తూ ఉంది. రష్యా యూరప్ రాచకీయాలలోనుంచి నిష్క్రమించుకుంది. గనుక ఇంక ఫ్రాన్స్ ఒక్క బ్రిటన్ సహకారముమీదనే ఆధారపడిఉండాల్సివచ్చింది.

త్వరలోనే హిట్లర్ లితూనియా మీద పడతాడు. వలస రాజ్యాల ఆందోళనను మాత్రం తీవ్రంగానే సాగించుతూ ఉంటాడు. ఏనిమిషంలోనైనా ప్రారంభం కావచ్చు. కాని అందులో ఏ దేశాలు పాల్గొంటవా అన్న విషయాన్ని ఇప్పట్లో తేల్చలేము బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీలు ఉంటవి......

ఇంక ప్రపంచానికి శాంతిలేదు. యూరప్‌లో ఫాసిజం ఉన్నంతకాలం బ్రిటన్‌లో కృత్రిమ ప్రజాస్వామ్య ప్రభుత్వం అధికారంలో ఉన్నంతకాలం చావు బ్రతుకుల మధ్య ఇలా కొట్టుకోవాల్సిందే. వివిధ దేశాలలో సుస్థిర సామ్యవాద ప్రభుత్వ మేర్పడి ప్రజలకు ఎట్టి కొరతలేక అన్ని సౌఖ్యాలు పొందేవరకూ యుద్ధ మేఘాలు అలా తిరుగుతూనే ఉంటవి. తిరిగి ఆ మేఘాలు పూర్తిగా వర్షించేవరకూ యుద్ధభయం పోదు. 1914 మాదిరిగానే యుద్ధాన్ని ఆపుటకు యుద్ధం ప్రారంభం అవుతుంది. అలాగాకున్న శాంతి స్థాపనకు యుద్ధం ప్రారంభం కావాలి. అవసరం. తప్పకుండా!

యుద్ధానికి సిద్ధమైన జక్కువీరుడు